Sunday, February 12, 2023
12:32 PM

1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 7
పుటలు :52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

సెప్టెంబరు 2018



## గురజాడను ఆరాధించిన రచయిత...చైతన్యశీలి



కథానికా సాహిత్య ఉద్యమకారుడు
వేదగిరి రాంబాబు

## తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థకు చట్టబద్ధత కల్పించాలి

చట్ట నిర్మాణం, సాధారణ పరిపాలన,
న్యాయరంగం, విద్యారంగాలలో
ప్రభుత్వ భాషావిధానాన్ని
స్పష్టంగా ప్రకటించాలి.
ప్రాథమిక విద్యలో
మాతృభాష మాధ్యమాన్ని
అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ
అమలు చేయాలి.
ప్రాధికార సంస్థను
చట్టబద్ధంగా నెలకొల్పాలి.


– తెలుగు భాషోద్యమ సమాఖ్య
రాష్ట్రస్థాయి సమాలోచనా సదస్సు ప్రకటన

ఇది తెలుగువారి గుండెచప్పుడు... ఇదీ 'తెలుగు మానిఫెస్టో'

# అందరికీ ఆహ్వానం



## ఏటుకూరి ప్రసాద్ గారికి తాపీ ధర్మారావు జీవన సాఫల్య పురస్కారం



తేదీ, సమయం : 16, సెప్టెంబరు 2018 ఉ॥ గం.10 లకు
వేదిక : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజి, ద్వారకా హోటలు వద్ద, టెలిఫోన్‌భవన్ ప్రక్కన, ఖైరతాబాదు, హైదరాబాదు.
సభాధ్యక్షులు : శ్రీ ఆచార్య జయధీర్ తిరుమలరావు, కవి, రచయిత, పరిశోధకుడు.
ముఖ్య అతిథి: జస్టిస్ శ్రీమతి టి.రజని, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి.
విశిష్ట అతిథి : డా॥కె.శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకుడు.
ఆత్మీయ అతి : శ్రీమతి విమలా సోహన్, తాపీ ధర్మారావుగారి మనుమరాలు

తాపీ ధర్మారావు వేదిక, విజయవాడ
సమావేశకర్త : డా.సామల రమేష్‌బాబు, ఫోన్: 9848016136
E Mails : `samalarameshbabu@gmail.com, editorammanudi@gmail.com

'తాపీ ధర్మారావు జీవితం – రచనలు' ప్రామాణికమైన పరిశోధన గ్రంథం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1983లో డాక్టరేట్‌ను పొందిన ఏటుకూరి ప్రసాద్ పరిశోధనకు పుస్తక రూపం అది. నాటికీనేటికీ తాపీ ధర్మారావు జీవితం, రచనలు అన్న అంశంపై వచ్చిన సమగ్ర గ్రంథం అదే. తాపీ ధర్మారావు అనేక అంశాలపై వ్రాసిన గ్రంథాలుగాక,ఆయన గురించి సమగ్ర అవగాహనకై ఆధారపడదగిన పరిశోధనాత్మక రచన అదే.'తాపీ ధర్మారావు పురస్కారా'న్ని ఇంతవరకు ఏడుగురు ప్రముఖ రచయితలైన జర్నలిస్టులకు ఇచ్చిన తాపీ ధర్మారావు వేదిక, ఇప్పుడు తాపీధర్మారావు 'జీవన సాఫల్య పురస్కారాన్ని' ప్రత్యేకంగా ప్రముఖ రచయిత, సంపాదకులు ఏటుకూరి ప్రసాద్‌గారికి ఇవ్వడానికి నిర్ణయించింది.

ఇంతవరకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు




డా॥ఎన్.వేణుగోపాల్-2009



డా॥కె.శ్రీనివాస్-2011



శ్రీ టంకశాల అశోక్-2013



శ్రీ జి.శ్రీరామమూర్తి-2014



శ్రీ ఎ.కృష్ణారావు-2015



శ్రీ ఆర్ఎం.ఉమామహేశ్వరరావు-2016



శ్రీసతీష్ చందర్-2017

సభవద్ద చెరగని స్ఫూర్తి తాపీ ధర్మారావు పుస్తకం (వెల రు.150/-) లభించును

సభవద్ద **అమ్మనుడి** పత్రికకు చందాలు చెల్లించవచ్చును.

తెలుగుజాతి పత్రిక


# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

సెప్టెంబర్ 2018


- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...



## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదకహృదయం : | తెలుగు భాషకు ప్రపంచ గుర్తింపా ? | | 7 |
| భాషోద్యమం : | జి.ఒ.పై సమాలోచన సదస్సు వివరాలు | | 9 |
| | ప్రాధికార సంస్థకు చట్టబద్ధత కలిగించాలి : ముఖ్యమంత్రికి విన్నపం | | 13 |
| చర్చాపత్రం : | ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషాభివృద్ధి చర్యలు??బి.హనుమారెడ్డి | | 15 |
| తెలుగు మానిఫెస్టో : | ఇది తెలుగు గుండె చప్పుడు... | | 17 |
| ప్రభుత్వ సభ : | తెలుగు భాషా దినోత్సవం : ప్రభుత్వ సభ వివరాలు | | 18 |
| బోధన భాష: | బోధనా భాషగా తెలుగు-సాధక బాధకాలు డా॥ తక్కోలు మాచిరెడ్డి | | 20 |
| పాలనాభాష : | పరిపాలనాభాష- వాడుక భాష | కీ.శే.వావిలాల | 22 |
| కంప్యూటర్లు - తెలుగు : | తెలుగు భాషకు ఆధునిక హోదా - 8 | వీవెన్ | 25 |
| సందర్భం : | గణనీయుడు తెలుగుబిడ్డ సి.ఆర్.రావు | వేములపల్లి సత్యవతి | 30 |
| వేమన : | శబ్ద గాండీవి వేమన....2 | కీ.శే.దుర్గానంద్ | 32 |
| సాహిత్యరంగం : | తెలుగు వచన రచన.... | మధురాంతకం నరేంద్ర | 35 |
| పెద్దోరి తీపి గురుతులు : | ప్రోత్సాహశీలి వావిలాల | సన్నిధానం నరసింహశర్మ | 37 |
| పిట్ట చూపు : | దేశానికే హెచ్చరిక కేరళ వరదలు | చలసాని నరేంద్ర | 47 |
| ధారావాహికలు : | | | |
| 1. బౌద్ధం-వైజ్ఞానిక మార్గం -17 | ..... | బొర్రా గోవర్ధన్ | 39 |
| 2. మౌనంలోని మాటలు 11 : | సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ | - ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు | 42 |
| భాషోద్యమ కథానిక: | | | |
| 1. ఓ నిరుద్యోగి ఆక్రందన..... | | సంకేపల్లి నాగేంద్రశర్మ | 27 |
| కవితలు : | | | |
| 1. అమరావతి. | | డా॥ పాపినేని శివశంకర్ | 16 |
| 2. శబ్దం | | డా॥ ఎన్.గోపి | 29 |
| 3. అమ్మగుండెల్లో బాకు. | | గుర్రాల రమణయ్య | 41 |
| 4. తేట తెలుగులు | | మిత్ర | 50 |


రేఖా చిత్రాలు : **పావులూరి చిదంబరేశ్వరరావు** కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (Watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

\- సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
**AMMA NUDI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **915020010550189**
**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, తెనాలి
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం. 58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (*క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్*) లో ప్రచురిత మవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించు కొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.


ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.

సంపాదకుడు, **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

మన్నన

# మన ఫోటో జర్నలిస్టు తమ్మా శ్రీనివాసరెడ్డికి అత్యున్నత అంతర్జాతీయ పురస్కారం




నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి పత్రికలను తొలినుండీ అభిమానిస్తూ, సహకరిస్తున్న ప్రముఖ ఫోటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాసరెడ్డి ప్రతిభ, సాధించిన జాతీయ అంతర్జాతీయ విజయాలను గురించి మన పాఠకులకు తెలుసు. తాజాగా శ్రీనివాసరెడ్డి అత్యున్నత అంతర్జాతీయ పురస్కారం పొందిన నలుగురిలో ఒకరుగా నిలిచారు.

ఫోటోగ్రఫి రంగంలో విశేషంగా కృషి చేసిన వారికి అమెరికన్ సొసైటీ అందించే అత్యున్నతమైన పురస్కారం ప్రపంచ ప్రఖ్యాత ఛాయాచిత్రకారుడైన తమ్మా శ్రీనివాసరెడ్డిని వరించింది. అమెరికాలోని ఇమేజ్ కొలీగ్ సొసైటి ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేసిన మొత్తం నలుగురిలో శ్రీనివాసరెడ్డి ఒకరు మన తెలుగువాడు కావటం ఎంతో గర్వించదగ్గ విషయం. ఈ మేరకు సొసైటీ ఛైర్మన్ టోలి లీ కిమ్ తాన్ శ్రీనివాసరెడ్డికి అమెరికాకు రావల్సిందిగా ఆహ్వానం పలికారు. ఇమేజ్ కొలీగ్ సొసైటీలో శ్రీనివాసరెడ్డి 1996లో సభ్యునిగా చేరి, అదే సంవత్సరం అసోసియేట్ ఆనర్‌ని ఆసియా ఖండంలోనే తొలి వ్యక్తిగా నలుపు – తెలుపు విభాగంలో పొందారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే పోటీలలో ఇమేజ్ కొలీగ్ సొసైటీ నిబంధనలకు లోబడి పలు సంస్థలు ఫొటోగ్రఫి పోటీలు నిర్వహిస్తాయి. పలు పతకాలతో సొసైటీ ప్రపంచ వ్యాప్తంగా ఫొటోగ్రఫి పోటీలు నిర్వహించి, ఫొటోగ్రాఫర్‌లను ప్రోత్సహిస్తోంది. దాని అనుబంధ సంస్థలైన యునైటెడ్ స్టేట్ ఫొటోగ్రాఫిక్ ఎలయన్స్, శ్వాన్, ఫెడరేషన్ మల్టి ఫొటోగ్రాఫర్ ఆర్ట్ సంస్థల నుండి శ్రీనివాసరెడ్డి దశాబ్దం క్రితమే ఆనరరీ ఫెలోషిప్‌లు పొందారు. ఈ విధంగా అత్యున్నత అవార్డులు పొందినవారు ప్రపంచవ్యాప్తంగా గుర్తించి ఇప్పటికి ఫొటోగ్రఫి రంగంలో చురుకుగా పాల్గొంటూ కృషి చేస్తున్నవార్ని గుర్తించిన పిమ్మట ఈ అత్యున్నతమైన అవార్డుకి శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేశారు.

నవంబర్‌లో కాలిఫోర్నియా (అమెరికా) లో జరిగే అంతర్జాతీయ ఫొటోగ్రఫి కాన్ఫరెన్స్‌లో ఎంపికైన నలుగుర్ని 'ఆనరరీ ఎక్సలెన్స్' అవార్డుతో సత్కరించనున్నారు. కృష్ణానది ఒడ్డున ఉండవల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి గత మూడు దశాబ్దాలుగా ఈ రంగంలో కొనసాగుతూ పలు జాతీయ, అంతర్జాతీయ గౌరవ పురస్కారాలు పొందారు. బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రఫి సొసైటీ నుండి 2000 సంవత్సరంలోనే పురస్కారాన్ని అందుకున్నారు. పలు పత్రికలకు ఫొటో జర్నలిస్ట్‌గా పనిచేసిన శ్రీనివాసరెడ్డి అత్యధికకాలం "ఇండియా టుడే" పత్రికకు ఆంధ్రప్రదేశ్ నుండి ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పత్రికకు ఫొటో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు. పిక్టోరియల్, నేచర్, కలర్, ఫొటో జర్నలిజం, వైల్డ్ లైఫ్, ఫొటో ట్రావెల్ ఆరుఅంశాల్లో ప్రపంచ వ్యాప్తంగా జరిగే పోటీలకు గత 25 సం॥లుగా పంపుతూ నేటికి 168 బంగారు పతకాలు, 497 అవార్డులు, 876 ప్రతిభా పురస్కారాలతో పాటు ఆయన తీసిన 4900 చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి. ఫోటో జర్నలిజంలో అత్యున్నతమైన రామ్‌నాథ్ గోయంకా పురస్కారంతో పాటు, గత సంవత్సరం డా॥పిన్నమనేని సీతాదేవి ఫౌండేషన్ అందించే అవార్డును కూడా పొందారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫి అకాడమికి ప్రధాన కార్యదర్శిగాను, ఫోటో జర్నలిజం అంశానికి ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్‌కి ఛైర్మన్‌గా కొనసాగుతూ ఎంతోమంది ఔత్సాహికులను ఈ రంగంలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. 2015 సంవత్సరంలో ఫోటోగ్రఫిలో గ్రాండ్ మాస్టర్ అవార్డును పొందిన శ్రీనివాసరెడ్డి ఇమేజ్ కొలీగ్ సొసైటీకి ఆసియా ఖండానికి అంబాసిడర్‌గా పనిచేస్తున్నారు.

శ్రీనివాసరెడ్డి తన రంగంలో ఇంకా అధిరోహించే శిఖరాలు, అందుకొనే కీర్తి కిరీటాలు ఏమిటో ఎదురు చూద్దాం. శ్రీనివాసరెడ్డికి తెలుగు ప్రజలందరూ ఎప్పుడూ శుభం కలగాలని కోరుకుంటున్నారు. నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారు.

# వేదగిరి రాంబాబుతో నా నడక ఆగిపోయింది



కనుమరుగు 18-8-2018

గురజాడ స్ఫూర్తితో రాంబాబు, గిడుగు స్ఫూర్తితో నేనూ కలిసి చేసిన ప్రయాణం ఏడేళ్ళపాటే సాగింది. 2011కు ముందు వేదగిరి రాంబాబుతో పరిచయం నామమాత్రమే. 2011-12లలో గురజాడ 150 వ జయంతి సందర్భంగా ఆయన పూనుకొని 'నడుస్తున్న చరిత్ర' కోసం తాను వ్రాయడమే కాకుండా తన మిత్రుల చేత కూడా గురజాడ గురించీ, ఆయన రచనల గురించీ వరుసగా ఏడాదిపాటు వ్యాసాలు రాశారు. చివరగా సెప్టెంబరు 2012 సంచికలో 'దీపధారి' అనే వ్యాసాన్ని తానే వ్రాసి వాటిని ముగించారు. తర్వాత సరిగ్గా సంవత్సరానికి గిడుగు 150వ జయంతి సందర్భంగా 2013 ఆగస్టులో ఆయనా నేనూ కలిసి పర్లాకిమిడితో మొదలుపెట్టి, విజయనగరం, గజపతినగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం, తణుకు, రాజమండ్రి, విజయవాడ, తెనాలి, మదనపల్లి, చెన్నై వరకు అనేకచోట్ల గిడుగు 150వ జయంతి సభలను ఏర్పాటుచేయించి, మేమిద్దరమూ ప్రసంగిస్తూ ఉద్యమస్ఫూర్తిని వ్యాప్తి చేస్తూ సాగాము. చివరగా ఆగస్టు 29న ముగింపుసభను హైదరాబాదులో జరిపాము.

తర్వాత 'నడుస్తున్న చరిత్ర' సెప్టెంబరు 2013తో ప్రచురణ నిలిచిపోయింది. ఆ సంచికలోనే మా పర్యటన వివరాలు గల వ్యాసాన్ని ఆయనే వ్రాశారు. పత్రిక ఆగిపోయినందుకాయనకు ఎంతో బాధ కలిగింది. మళ్లీ 2015 మార్చి నుండి 'అమ్మనుడి' పేర పత్రికను తిరిగి ప్రారంభించినందుకు ఆయన ఎంతో సంతోషించారు. తరచు ఇందులో వ్రాస్తుండేవారు. భాషోద్యమ అంశాలపై కథానికల్ని ప్రచురిస్తే బాగుంటుందని, సాహిత్యం ద్వారా ప్రజల్లోకి భాషోద్యమ ఆలోచనకు తీసుకువెళ్ళాలనీ వేదగిరి రాంబాబుతో ప్రస్తావించాను. 'కథానిక'ను నెత్తిన పెట్టుకుని, వ్యయప్రయాసలకు ఓర్చి, నిరంతర కృషి చేస్తున్న మీరే అందుకు పూనుకొని రచయితల్నీ ఈ దిశగా ప్రోత్సహించాలని నేనాయనతో అన్నాను. మధుమేహం వల్ల నానాటికీ శారీరకశక్తిని కోల్పోతున్నా, మానసికంగా దృఢంగా వుండే ఆ చైతన్యమూర్తి – వెంటనే తానే ఒక కథానికను వ్రాసి, 'ఈ కథానికకు కాళ్లు లేవు' అనే మకుటంతో ప్రచురించమని ఇచ్చారు. అది ఆగస్టు 2017 సంచికలో ప్రచురణయింది.

ఇక ప్రతినెలా ఇద్దరిచేత భాషోద్యమ కథానికలను వ్రాయిస్తానని అన్నారు. అన్నట్లే ఆయన పూనుకొని – ప్రతినెలా రెండు కథానికల్ని రచయితల చేతా, రచయిత్రుల చేతా వ్రాయించి, పంపిస్తూనే ఉన్నారు. పోయిన నెలవరకూ అలాగే జరిగింది. నాలుగు నెలలుగా మంచానపడి, చెప్పరాని అనారోగ్య బాధలు పడుతూ శస్త్రచికిత్సలకు శరీరాన్ని అప్పజెప్పి – ధర్మపత్ని సంధ్యమ్మా సంతానమూ రాత్రింబవళ్లు కంటికి రెప్పలా చూసుకొన్నా, కోలుకున్నట్లే అందరికీ కనిపించి, చివరకు విధి నిర్ణయానికి తలవంచాడు వేదగిరి రాంబాబు. మంచానపడేముందే – 'మహనీయుల మరణ వాంగ్మూలాలు' అనే శీర్షికన గురజాడ, గిడుగు, శ్రీపాదల గురించి వ్రాశారు. తాపీ ధర్మారావు దగ్గర కలం ఆగిపోయింది. తమ మరణవాంగ్మూలాలుగా ఆ మహనీయులు ఏ సందేశాలనందించారు, సమాజం నుండి వాళ్లేం కోరుకున్నారు అనేది వ్రాయాలని ఆయన సంకల్పం. వాటన్నిటినీ కలిపి ఒక పుస్తకంగా ఒక ఏడాది తర్వాత ప్రచురించాలని ఆయన అనుకొన్నారు.

'ఈ కథానికకు కాళ్లు లేవు', 'మరణవాంగ్మూలం' ఈ శీర్షికల్నెలా అర్థం చేసుకోవాలి!

మేము కలిసి చేసిన ప్రయాణం ఏడేళ్ల పాటిదే అయినా గురజాడ గురించి ఆయన నుండి నేను చాలా తెలుసుకున్నాను. గిడుగు గురించి నా నుండి ఎన్నో సంగతులను, ఆలోచనలను ఆయన రాబట్టారు.

రచయితగా ఎంత శక్తిమంతుడో, అంత నిగర్వి. కథారచయితల్ని, అంకితభావంతో రచనారంగంలో ఉన్నవారిని ఆయన ఎంతగానో ప్రేమించేవాడు, ఎంతో ప్రోత్సహించేవాడు. గురజాడ, గిడుగు, శ్రీపాదల రచనాసర్వస్వాలు పెద్దవాల్యూమ్స్‌గా – తెలుగు అకాడమీ ద్వారానో మరొక విధంగానో వెలువడ్డాయంటే దానికి ఆలోచనా, శ్రమా అంతా వేదగిరి రాంబాబుగారిదే. రాజమండ్రిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి విగ్రహాన్ని నెలకొల్పిన రాంబాబు, విజయనగరంలో గురజాడ ఇంటినీ బాగుచేయించి నిలబెట్టిన వ్యక్తి, గురజాడ పోస్టల్‌స్టాంపును విడుదల చేయించింది వేదగిరి రాంబాబుగారే.

నాకొక పెద్దతోడుగా ఉన్న నా అభిమాన సోదరుడు నాకంటే సుమారు పదేళ్లు చిన్నవాడయినా, నాకంటే ముందే వెళ్లిపోయాడు. ఎవరి ఆయుష్షు ఎంతో ఎవరికి తెలుసు గనుక!

అయినా, రాంబాబు సాహిత్యరంగంలో చేసిన కృషి వల్లా, తన వ్యక్తిత్వం వల్లా చిరంజీవిగానే చరిత్రలో మిగిలిపోతాడు.

– సామల రమేష్‌బాబు

సంపుటి : 4 సంచిక : 6
**అమ్మనుడి**
సెప్టెంబర్ 2018

సంపాదకుని హృదయం

# తెలుగు భాషకు ప్రపంచ గుర్తింపా...?

తెలుగుభాష గొప్పదనం, తియ్యదనం గురించి తరచు మనం మాట్లాడతాం. కవితలని గానం చేస్తుంటాం. తెలుగుసాహిత్యంలోని ప్రత్యేకతల గురించి, తెలుగు సంస్కృతి ప్రాచీనత గురించి గర్వపడుతూ వుంటాం.

దేశభాషల్లో రెండవదనీ లేదా మూడవదనీ, ప్రపంచ భాషల్లో తొలిపదిలో ఒకటనీ, దేశంలోని రెండు రాష్ట్రాల్లో కలిపి ఎందరు తెలుగువారున్నారో మరి అంతమంది ఇతర రాష్ట్రాల్లో దేశమంతటా విస్తరించియున్నారని చెప్పుకొని ముచ్చటపడతాం.

ఇదంతా నిజమే. కాని, ఇంతటి పెద్ద భాషాజాతి తన భాషకు దూరమైపోతుంటే, తన ఊపిరిని కోల్పోతుంటే, దాని తియ్యదనాలు, గొప్పదనాలు, సాహిత్యాలు, సాంస్కృతిక ప్రత్యేకతలూ– ఇవన్నీ ఎక్కడ నిలుస్తాయి? తెలుగును నేటి అన్ని అవసరాలకూ వినియోగించుకోవడాన్ని మానివేసి, దానికి బదులుగా పరభాషల మీద పూర్తిగా ఆధారపడుతుంటే ఇక తెలుగు అవసరమేమి ఉంటుంది? ఇంత చరిత్ర, సాహిత్యం, సంస్కృతి గల జాతికి మూలమైన తన భాషను ఎలా కాపాడుకోగల్గుతుంది?

కారణాల గురించీ సమాధానాల గురించీ చర్చిస్తే చివరకు నేరం అంతా పాలకవర్గాలపైనే పడుతుంది. భాషారాష్ట్రాలు ఏర్పడిన తరువాత నేతలు, ప్రభుత్వాలు అనుసరించిన పోకడల వల్లే ఈ పరిస్థితులు దాపురించాయన్న స్పష్టమైన అంశం మనకు కన్పిస్తుంది.

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. రెండు రాష్ట్రాల నేతలకూ ప్రస్తుత పరిస్థితి తెలియనిది కాదు. అయినా వాళ్లు దీన్ని ముఖ్యంగా భావించరు. పైగా తమకు రాజకీయంగా నష్టాన్ని కలిగించే అంశంగానే భావిస్తారు. ప్రజల్లో ఇంగ్లీషు భాషపట్ల ఉన్న మోజుకు భంగం కలిగించే ఏ చర్య అయినా తమకు నష్టం కలిగిస్తుందనే వారు భావిస్తారు. పైగా కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో వున్న పాలకవర్గాల ఆర్థిక ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించే ఎటువంటి చర్యలకూ – అవి ప్రజానీకానికి ఎంత ప్రయోజనం కలిగించేవి అయినా పూనుకోరు.

అందుకనే ఈ రెండు రాష్ట్రాల నేతల పలుకులనూ, చర్యలనూ నిశితంగా గమనించండి... సాహిత్యం గురించీ, సంస్కృతి గురించీ, కళల గురించి పదేపదే మాట్లాడుతారు కాని, తెలుగులో పాలన గురించి, తెలుగులో బోధన గురించీ మాట్లాడరు. ఈ భాషాజాతి మనుగడకు, అభివృద్ధికి అవి ఆయువుపట్టులనే సంగతి వారికి తెలిసీ పట్టించుకోరు. అయితే – ప్రపంచ తెలుగు మహాసభలను రెండేళ్లకొకసారి పెట్టి, భారీగా ఖర్చుపెట్టి, సాహితీవేత్తలనే పేరుతో ఆశ్రితులను తృప్తిపరచడం, సంస్కృతీ ప్రదర్శన పేరిట హడావుడి చేయడం తప్ప – భాష విషయమై నిర్దిష్ట చర్యలకు చిత్తశుద్ధితో పూనుకున్న దాఖలాలున్నాయా? లేవు... ఉన్నా, అవన్నీ కాగితాలపైనే!

దాదాపు రెండు దశాబ్దాలుగా భాషోద్యమకారులు చేస్తున్న ఉద్యమాల వల్ల ఎప్పటికప్పుడు ఏవో ఉత్తర్వులు, చర్యలు పొందినట్లు అనిపించినా, ఆచరణలో అవన్నీ నీరుకారిపోవడం చూసి, నిశ్చేష్టులైపోవడమే వారికి మిగిలింది. పాలనలో తెలుగును అమలుచెయ్యడం విషయంలో సంయుక్త రాష్ట్రంలోగానీ, విభజన తర్వాత రెండు తెలుగురాష్ట్రాల్లో గానీ సరిపడినన్ని జి.ఒ.లున్నాయి. తెలుగేతర అధికారుల పెత్తనానికి లోబడిగానీ– నేతల్లో సంకల్పం, పట్టుదల లేనప్పుడు మనకెందుకులే అనే నిర్లిప్తధోరణి వల్ల గానీ పాలనలో తెలుగు ముందుకు సాగడంలేదు. రవిచంద్ర, ముక్తేశ్వరరావు వంటి కొద్దిమంది అధికారులు మాత్రం తమకు చేతనైనంతవరకు చేస్తున్నారు. ఉద్యోగాల్లో ఉన్నప్పుడు వారైనా రాజకీయనేతల్లో సంకల్పశుద్ధి, చిత్తశుద్ధిలేకపోవడాన్ని వేలెత్తి



Unfiled Notes Page 7

చూపలేరు కదా!

భాషకు ప్రత్యేక మంత్రిత్వశాఖ కోసమూ, దానితోపాటు ప్రాధికార సంస్థ కోసమూ సుదీర్ఘకాలం ఉద్యమించినందున – చివరకు వత్తిడిని ఉపశమింపజెయ్యడానికి వాగ్దానాలు చేసి, జి.ఒ.నెం.909/31–3–2013 ద్వారా మంత్రిత్వశాఖను ఇచ్చినా, దానిని సాంస్కృతిక శాఖతో కలిపి ఇచ్చి నిష్ప్రయోజనం చేశారు. ప్రత్యేక బడ్జెట్టూ లేదు, భాషపట్ల ఒక విధానమూ లేదు. చివరకు సాంస్కృతిక శాఖను భాషాసాంస్కృతికశాఖగా పిలుచుకోవడం తప్ప ఒరిగిందేమీ లేదు. యువజనాభ్యుదయం, పర్యాటకం అంశాలను వేరుపరచి, 'తెలుగుభాష, సంస్కృతి' శాఖను ప్రత్యేకంగా చేశామని చెప్పినా, ఉత్తర్వులు ఇచ్చినా, చివరకు అదంతాపోయి – మళ్లీ కథ మొదటికి వచ్చింది. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ – 'యువజనాభ్యుదయం, పర్యాటక మరియు భాషా సాంస్కృతిక శాఖ' పూర్వంవలెనే కొనసాగుతున్నది. బడ్జెట్టు కేటాయింపులూ అలాగే జరుగుతున్నాయి. ఇదీ నేతల తమాషా!

ఎన్నికలకుముందు 2012లో బహిరంగంగా సమాఖ్య వేదిక మీద నాటి ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుగారిచ్చిన వాగ్దానం ప్రకారం – తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ, దానితోపాటు 'తెలుగుభాషాభివృద్ధి ప్రాధికారసంస్థ' ఏర్పరచాలి. వెంటపడగా పడగా 2017 ఆగస్టు 29న తెలుగుభాషా దినోత్సవ సభలో బహిరంగంగా ఆయన చేసిన ప్రకటన ప్రకారం – ప్రాధికారసంస్థను చట్టపరంగా ఏర్పాటుచెయ్యాలి. ఇప్పుడు అందుకు భిన్నంగా – ఒక జి.ఒతో సరిపెట్టారు. ఆ జి.ఒ. నిండా ఆదర్శాలు, ఉద్బోధలు, అసంబద్ధతలు! పాలనలో తెలుగు అమలుపరచకపోతే వేలాది రూపాయల జరిమానాలు వేస్తున్నట్లు ఆ జి.ఒ.లో పేర్కొన్నారు. కేవలం ఆ జి.ఒ. ఆధారంగా అది చెల్లదు – ఆచరణలోకి రాదు. దాన్ని నిజాయితీగా అమలుచేస్తే ఆ జి.ఒ. అమలుకొచ్చిన జులై 18 నుంచి ఇప్పటివరకు మన రాష్ట్రప్రభుత్వంలో చాలామంది అధికారుల నుంచి వేలాది రూపాయల జరిమానాలు వసూలు చేసి ఉండాల్సింది!

అంతేకాదు... ఆ జి.ఒ.లో – తెలుగు మాధ్యమంలో బోధన గురించి ఏమాత్రం స్పష్టత లేదు. ప్రోత్సహించడం, పరిశీలించడం, సమీక్షించి సలహాలు చెప్పడం కోసం 'ప్రాధికార సంస్థ' అక్కర్లేదు. గతంలో వలె ఎప్పటికప్పుడు తాత్కాలిక అధికారభాషా సంఘాన్ని మొక్కుబడిగా వేసి కాలక్షేపం చేస్తే సరిపోయేదానికి ఇంత రాద్ధాంతం ఎందుకు? ప్రాధికారసంస్థ ఎందుకు అంటే ప్రభుత్వ విధానాల ప్రకారం ఆయారంగాల్లో తెలుగును అమలులో పెట్టేందుకు.. అందుకు కావలసిన సర్వాధికారాలూ దానికి వుండాలి. మాధ్యమం విషయంలో ఈ జి.ఒ.లో వ్రాసిందంతా అసంబద్ధమే.

ఒక భాషగా తెలుగుబోధన అంశంపై తొలినుండీ మోసమే జరుగుతున్నది. 2003లో కూడా చంద్రబాబునాయుడు గారి ముఖ్యమంత్రిత్వంలోని ప్రభుత్వమే జి.ఒ.నెం. 86 (విద్యాశాఖ) ఇచ్చింది. అదెప్పుడూ సరిగా అమలైన పాపాన పోలేదు. 1 నుండి 10 వ తరగతి వరకు ఇతర మాధ్యమాల బదుల్లో – తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తూ ఇచ్చిన జి.ఒ. అది. ఆచరణలో కొన్ని మినహాయింపులూ వున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కె.సి.ఆర్‌గారు చేసిన ఒక ప్రకటన.... 'ఒకటి నుంచి 12 వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తాం' అని. అదంతా మాటల్లోనే ఉండిపోయింది. సంస్కృత భాషా బోధకుల 'లాబీ' వత్తిడికి లొంగి, ఇంటర్మీడియెట్‌లో యథాపూర్వ స్థితినే కొనసాగిస్తున్నారు. 1 నుంచి 10 వరకు నాటి జి.ఒ. 86 స్థానంలో మరొక చట్టమో, జి.ఒ.నో వచ్చింది.

ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ ఒకే తంతు నడుస్తోంది. తెలంగాణలో అధికారికంగా ఎల్.కె.జి. నుంచీ తెలుగు మాధ్యమానికి తులసి నీళ్లు వదిలేయగా, ఆంధ్రప్రదేశ్‌లో అదే పనిని జి.ఒ.లతో దోబూచులాడుతూ, అనధికారికంగా మంత్రుల, అధికారుల స్థాయి నుంచే చేస్తున్నారు!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారు ఆగస్టు 24న ఒక సమీక్షా సమావేశం జరిపారట. దానిలో తెలుగు సాంస్కృతిక నేత ఉపసభాపతి బుద్ధప్రసాద్‌గారితోపాటు, సాంస్కృతిక శాఖ ఉన్నతాధికారులూ పాల్గొన్నారు. 'తెలుగుభాషకు ప్రపంచ గుర్తింపు తీసుకువచ్చేందుకు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటుచేసినట్లు ఆ సందర్భంలో ముఖ్యమంత్రిగారు అన్నారట. ముఖ్యమంత్రిగారిని శంకించడం కాదుగాని ఒక్క ప్రశ్నను అడగక తప్పడంలేదు. 'ఇన్నేళ్లూ ఆగి, మీ మాటను మీరే ఉల్లంఘించి, చట్టంగా తేకుండా ఎందుకీ అసంబద్ధ, అస్పష్ట జి.ఒ. ఇచ్చారు? ముఖ్యమంత్రిగారూ, నిజంగా మీరు తెలుగు అభివృద్ధిని సంకల్పిస్తే – భాషోద్యమకారులు కోరుతున్నవిధంగా తగు సవరణలు చేసి ప్రాధికారసంస్థను చట్టరూపంగా తీసుకురండి. దానికంటే ముందు విద్యారంగంలో మీ ప్రభుత్వ భాషా విధానాన్ని స్పష్టం చేయండి. ప్రాధికారసంస్థను పటిష్టంగా పనిచేయించండి. అప్పుడు తెలుగుభాషకూ మీకూ అన్ని స్థాయిల్లో గుర్తింపు వస్తుంది. తెలుగుజాతి ప్రేమాభిమానాలూ మీకు దక్కుతాయి.

సామల రమేష్‌బాబు

తేదీ : 31-8-2018



# తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ జి.ఒ.పై ఆగస్టు 26న జరిగిన
# సమాలోచన సదస్సు వివరాలు



వేదిక : శ్రీపద్మావతీ కళ్యాణ వేదిక- శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం
బృందావన్ గార్డెన్స్ 5వ లైను, గుంటూరు - 6



'అమ్మనుడి' ఆగస్టు సంచికలో 'సదస్సులో పాల్గొనమని పిలుపు' ను ప్రచురించినప్పుడు - దాన్నొక పెద్ద సభగా నిర్వహించాలని తల పెట్టాము. దానికి ముఖ్య అతిథిగా ఉప సభాపతి గౌ॥ డా॥ మండలి బుద్ధప్రసాద్‌గారినీ, విశిష్ట అతిథిగా భాష, సంస్కృతిశాఖ సంచాలకులు డా॥ డి.విజయభాస్కర్‌గారిని ఆహ్వానించాము. ఇద్దరూ అంగీకరించి నప్పటికీ, బుద్ధప్రసాద్ గారు తాను అత్యవసర పనుల వల్ల రాలేకపోతున్నట్లు తర్వాత తెలియజేశారు.


తర్వాత, సభగా కాకుండా, ఒక సమాలోచన సదస్సుగా మాత్రమే జరిపి, అందరి అభిప్రాయాలతో ప్రభుత్వానికి ఒక నివేదిక సిద్ధామని నిర్ణయించాము. అందుకనుగుణంగా ఆసక్తి కలిగిన వారిని మాత్రమే జి.ఒ.ను చదువుకొని, వారి అభిప్రాయాలను సమాలోచనా సదస్సులో చెప్పవలసిందిగా కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆహ్వానించాము.

విజయభాస్కర్‌గారు మాత్రం తప్పక వస్తున్నట్లు 25 సాయంత్రం కూడా చెప్పారు. కాని, జ్వరం వల్ల ఆయన రాలేక పోతున్నట్లు సదస్సును మొదలు పెట్టే సమయంలో వారి పి.ఎ.గార్కి ఫోన్ చేస్తే తెలిసింది.

సదస్సు ఉదయం గం.10.30 కు మొదలై సాయంత్రం గం. 4. వరకూ సాగింది. ఇంతటి ప్రయోజనకరమైన చర్చలు ఇటీవలి కాలంలో జరగలేదని అంతా అభిప్రాయపడ్డారు.

సదస్సు వేదికపై సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి డా॥ వెన్నిసెట్టి సింగారావులతోపాటు హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, భాషావేత్త, డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు ఆసీనులైనారు. ఆయన రెండు రాష్ట్రాల్లోని భాషా సంక్షోభం గురించి ఎంతో పరిశోధన చేసి, అన్ని వివరాలనూ ప్రచురించిన వ్యక్తి. దండలు, సత్కారాలు, సన్మానాలను విడిచిపెట్టి, సమావేశ లక్ష్యంపైనే మనసు పెట్టి శ్రద్ధగా సాగిన ఈ సదస్సులో 106 మంది పాల్గొన్నారు. అందులో ఎక్కువ మంది చర్చలో పాల్గొన్నారు. వారిలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, రచయితలు, న్యాయవాదులు, వైద్యులు, విద్యాపరిరక్షణ, భాషా పరిరక్షణోద్యమకారులు, సామాజిక కార్యకర్తలు - రాష్ట్రంలో పలుచోట్లనుంచి పాల్గొన్నారు.

తొలుత-సమాఖ్య కార్యదర్శి డా॥ సింగారావు అందరికీ స్వాగతం పలికి, కార్యక్రమాన్ని వివరించారు. అధ్యక్షుడు డా॥రమేష్‌బాబు క్లుప్తంగా ప్రసంగిస్తూ ప్రాధికార సంస్థ ప్రాముఖ్యాన్ని, దానికోసం తెలుగుభాషోద్యమ సమాఖ్య చేసిన పోరాటాన్ని తెలిపి, సంస్థను ఇప్పుడు పటిష్టం చేసుకోవడంపైనే మనసు పెట్టవలసి వుందని తెలియజేశారు. ఆయన ప్రసంగ పత్రాన్ని ఈ తరువాతి పుటలో చూడండి...




వి.హనుమారెడ్డి

ముందుగా ఒంగోలు నుంచి విచ్చేసిన ప్రముఖ న్యాయ వాది, సమాఖ్య ఉపాధ్యక్షులు శ్రీ.వి.హనుమారెడ్డి పత్రాన్ని సమర్పించారు. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికారచట్టం చేసి, తెలుగుభాషాభివృద్ధి ప్రాధికారసంస్థను ఆ చట్టం ద్వారా ఏర్పాటు చేసి, చట్ట బద్ధత కల్పించి దానికి అవసరమైన అధికారాలను కల్పించి, దానికి మంత్రిస్థాయి అధ్యక్షుడుండునట్లు చట్టంలో ఏర్పాట్లు చేయాలి. సభ్యులుగా ఇతర పలురంగాల పెద్దలను తీసుకోవాలి. తగు విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలి. (పత్రం పూర్తి పాఠాన్ని 15,16 పుటల్లో చదువవచ్చు.)

తర్వాత - ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డెప్యూటి కలెక్టరు

# తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థకు స్వాగతం
# దానిని ఆచరణశీలంగా, శక్తిమంతంగా తీర్చిదిద్దాలి

### తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు విజ్ఞప్తి



సదస్యులందరికీ - దండాలు.

తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పర్చుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ.నెం. 40/10.7.2018 పై చర్చించి, మన అభిప్రాయాలను, సూచనలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు మనం ఇక్కడ సమావేశమవుతున్నాము. ఇందులో పాల్గొంటున్న తెలుగుభాషోద్యమకారులందరికీ స్వాగతం పలుకుతున్నాను. ప్రత్యేకంగా ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆహ్వానించినంతనే విచ్చేసి, పాల్గొంటున్న తెలుగుభాష, సంస్కృతీ శాఖ సంచాలకులు డా॥ డి.విజయభాస్కర్ గారికి స్వాగతం పలుకుతున్నాను.

తెలుగురాష్ట్రాల్లో తెలుగుకు పూర్తి సాధికారతను సాధించేందుకు మనం ఎంతోకాలంగా ఉద్యమాలు చేస్తున్నాం. తెలుగు భాషోద్యమం 'రాజ్యానికి' వ్యతిరేకం కాదు. కాని, ప్రజలకోసం, ప్రజల హితం కోసం పనిచేయని వ్యవస్థల్ని, ఆ వ్యవస్థల పనుల్ని వ్యతిరేకిస్తాం. ప్రజలకోసం కొన్ని నిక్కచ్చులను (డిమాండ్లను) ప్రభుత్వం ముందు పెడతాం. వాటిని సాధించడం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం చేస్తాం. భాషా సాధికారత కోసమే తెలుగు భాషోద్యమకారులు పనిచేస్తున్నారు. గిడుగు రామ్మూర్తిగారి వ్యవహారిక భాషోద్యమం ఇందుకు బాటలు వేసింది. ఆ బాటలో అనేకమంది వివిధ సంఘాలుగాను విడివిడిగా వ్యక్తులుగాను ముందుకు వచ్చి ఎంతో కృషి చేశారు. వాటిని అందిపుచ్చుకొని 2003 నుండి తెలుగుభాషోద్యమ సమాఖ్య ఒక నిర్దిష్టమైన అజెండాతో పనిచేస్తున్నది. ఆ అజెండా లక్ష్యం తెలుగు రాష్ట్రాల్లో భాషా సాధికారతను సాధించడం.

ఎందువల్ల భాషాపరంగా నేటి పతన స్థితికి వచ్చాం అనేది ఇప్పుడు మళ్లీ చర్చించాల్సిన సందర్భం కాదు - ప్రధాన కారణం - నేతల్లో రాజకీయ 'సంకల్పం' లేక పోవడం. మొత్తంగా ఇది మన సమాజ వైఫల్యం - ముఖ్యంగా మేధావుల, సామాజిక, రాజకీయ నేతల వైఫల్యం. బాధ్యతల్ని విస్మరించి, నిందను ప్రజల మీదకు తోసివేయడం తగదు.

మిత్రులారా, మనందరి కృషి ఫలితంగా మంత్రిత్వ శాఖ 31-12-2013న ఏర్పడింది. దానితోపాటు తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఇవ్వడానికి 2013 నాటి ప్రభుత్వం సిద్ధపడలేదు. తర్వాత - మన ప్రయత్నాలను కొనసాగించాం. మొత్తమ్మీద - రెండేళ్లక్రితం ఇప్పటి ప్రభుత్వం నుండి వాగ్దానం, చర్యలు మొదలై నేటికి కార్యరూపం ధరించి 'తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ' ఏర్పాటవుతున్నది. 18-7-2018 నుండి ఇది అమలులోకి వచ్చినట్లు దానిలో పేర్కొన్నారు కూడా. జి.ఒ. ఎం.ఎస్ 40/10.7.2018 ద్వారా ఇది ఏర్పాటవుతున్నది.

2017 ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవ అధికారిక సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగారు - రానున్న శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి చట్టంగా తెస్తామని ప్రకటించారు. కాని, ఏ కారణం వల్లనో ఇప్పుడు జి.ఒ మాత్రమే ఇచ్చారు. కార్యాచరణ ఆలస్యం కాకూడదనే ఉద్దేశ్యంతోనే యీ జి.ఒ.ను ఇచ్చారని భావిస్తూ త్వరలో దీనికి చట్టరూపమివ్వడానికి ప్రభుత్వం చర్యలు గైకొనాలని కోరుతున్నాం.

మొదట్లోనే చెప్పుకున్నట్లు తెలుగుకు మన రాష్ట్రంలో సాధికారతను సాధించడంకోసం ప్రాధికార సంస్థను మనం పూర్తిగా వినియోగించుకోవాలి. సాధికారత రావాలంటే విద్య, పరిపాలనకు చెందిన అన్ని స్థాయిలలో తెలుగు రాజ్యమేలాలి. ప్రజల భాష తెలుగు కనుకనే - ప్రజల భాషకు పట్టం కట్టాలి. అలా కానట్లయితే ఇది తెలుగు రాష్ట్రంగా గుర్తింపుతోపాటు మనం ఒక భాషా జాతిగా మనుగడనూ కోల్పోతాం.

తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థకు స్వాగతం పలుకుతూ - దాన్ని ఆచరణ శీలంగా, శక్తిమంతంగా తీర్చిదిద్దడానికి ఏం చేయాలో మనం సమాలోచన సాగిద్దాం. ప్రభుత్వం నుంచి దీనికి సంబంధించిన అధికారిగా వచ్చిన తెలుగుభాషా, సంస్కృతి శాఖ సంచాలకులు డా॥ డి. విజయభాస్కర్ గారికి మరోసారి స్వాగతం పలుకుతూ...మన ఆలోచనలను, ఈ సదస్సు చేయబోయే తీర్మానాలను స్వీకరించి వాటిని ప్రభుత్వ పెద్దలకు తెలుప వలసిందిగాను, తగు చర్యలను చేపట్టవలసిందిగానూ విజ్ఞప్తి చేస్తున్నాను.



రహంతుల్లా


స్థాయిలో పనిచేస్తూ – తన ఉద్యోగ కాలమంతా తెలుగులో పాలనకే ఆచరణలో ప్రాధాన్యత నివ్వడమేగాక, ఆ అంశంపై వ్యాసాలు, గ్రంథాలు వ్రాసిన శ్రీ నూర్‌బాషా రహంతుల్లా ఆ అంశంపైనే మాట్లాడారు. సర్వీస్ కమిషన్ వారి పరీక్షల్లో 20 శాతం ఉద్యోగాలను తెలుగు మాధ్యమ విద్యార్థులకు కేటాయిస్తూ – తమిళనాడులో వలె – నిర్ణయం తీసుకోవాలని, అందుకోసం ప్రాధికార సంస్థ కృషి చెయ్యాలని అన్నారు.

తర్వాత ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ



డా॥ గారపాటి

విద్యారంగంలో తెలుగు వినియోగం గురించి, మొత్తం జి.ఒ.ను గురించీ ఎంతో ఆలోచనాత్మకంగా వివరించారు. సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ జి.ఒ.లో అనేక లోపాలున్నాయని, క్లుప్తంగా సూటిగా, స్పష్టంగా ఉండవలసిన ఈ జి.ఒ. అనవసరంగా పేజీల కొద్దీ ఆశయాలు, ఆదర్శాలను బోధించడం సమంజసం కాదు అన్నారు. విద్యా మాధ్యమం గురించీ, ఉద్యోగాలు, ఉపాధి కల్పన గురించీ ఏమీ ఇందులో చెప్పక పోవడం పెద్దలోపం అన్నారు. విద్యా మాధ్యమంగా మాతృభాష నిలిచే అవకాశం ఈ జి.ఒ.లో కనబడడం లేదన్నారు. డిజిటలైజేషన్ మొత్తంలో సమన్వయం కుదరడం లేదన్నారు. 'బృహన్నిఘంటువు కావాలన్నారు సరే, తెలుగు మాధ్యమం లేకుండా నిఘంటువు ఉపయోగం ఉందా అని ప్రశ్నించారు. జి.ఒ.లో లోపాలను సరిదిద్ది, పటిష్టమైన చట్టంగా తేవడమే సరియైన పద్ధతి అని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తున్నందుకు ఆయన ప్రభుత్వాన్ని అభినందించారు.



వీవెన్



రహమానుద్దీన్

తర్వాత కంప్యూటర్‌లో తెలుగు వినియోగ నిపుణుడు 'వీవెన్' మాట్లాడుతూ "మనం కళ్ళుమూసి తెరిచేలోపలే జీవితాలు మారిపోతున్నాయి. మన సాంకేతిక నిపుణుల్ని తగు విధంగా ఉపయోగించుకోలేకపోతున్నాం. అందువల్ల మన సాంకేతిక నిపుణులు ఇతర భాషలకు పనిచేస్తున్నారు. స్పీచ్ టెక్నాలజీని వినియోగించుకోవాలి. సాంకేతికత (టెక్నాలజీ)ని వినియోగించుకొనే విధానం గురించిన స్పష్టత జి.ఒ.లో కనబడడం లేదని అన్నారు. మన సేవలకు సంబంధించి, నిపుణులకు ఈ జి.ఒలో ప్రోత్సాహం కనబడటంలేదని అన్నారు.

ఉత్తర్వులు వాటి విశేషాలు అన్నీ ఆ వస్తువులపైన తెలుగులో ఉండాలనీ, తెలుగు మాధ్యమంలో చదువు, తెలుగులో 'సాంకేతిక ఉపకరణాల' ఏర్పాటు ఉండాలన్నారు. కొందరు మిత్రులు కలిసి సామాజిక మాధ్యమాల్లో పెట్టిన 'తెలుగు మానిఫెస్టో'ను చూడవలసిందిగా కోరారు. (ఆ పత్రాన్ని సదస్సులో అందరికీ అందజేశారు) ఈ సంచికలో 17వ పుటలో దాన్ని ప్రచురించాము చదవండి.

తెలుగు కంప్యూటర్ రంగంలో మరో నిపుణుడు రహ్మానుద్దీన్ షేక్ మాట్లాడుతూ ప్రాధికార సంస్థ ఏర్పాటు చాలా అవసరమైన చర్య అని, ఆ సంస్థ నిర్మాణం మరెవ్వరూ ప్రశ్నించలేని విధంగా ఏర్పాటు చెయ్యాలి అన్నారు. తెలుగు అమలు వేరు, తెలుగుభాష అమలు వేరు అంటూ లిపి అభివృద్ధి అంశం ఇందులో లేకపోవడం పెద్దలోటు అన్నారు.



రమేష్ పట్నాయక్



సి ఎస్ ఆర్ ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు రమేష్ పట్నాయిక్, రచయిత, విరసం కార్యకర్త సి.ఎస్. ఆర్. ప్రసాద్, మరి కొందరు – కనీసం ఐదవ తరగతి వరకు బోధనా మాధ్యమంగా మాతృ భాషను పెట్టాలనే స్పష్టతను ఈ జి.ఒ. ఇవ్వాలని, సదస్సు చేయబోయే తీర్మానంలో ఈ అంశాన్ని స్పష్టం చెయ్యాలని అన్నారు. ఈ జి.ఒ. కార్పొరేట్ దృష్టిలో వచ్చినదిగా కనబడుతోందని వారు అన్నారు.

సాహిత్య అకాడమీ మాజీ సభ్యులు పాపినేని శివశంకర్ మాట్లాడుతూ – 'అమ్మనుడి' ఆగస్టు సంచిక సంపాదకీయంలో సాహిత్యాన్నీ భాషనూ వేరు చేసి చూడ్డాన్ని ప్రస్తావించి 'ఇది సరికాదు' అన్నారు. భాషా సాహిత్యాలు రెంటినీ కలుపుకు పోవాలని, సాహిత్యం తెలిసిన వాళ్ళే భాషను గురించి మాట్లాడగలరు అనీ అన్నారు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షులు డా॥ వావిలాల




వావిలాల

సుబ్బారావు మాట్లాడుతూ "భాషా ప్రధానమైన సాహిత్యం, సాహిత్య ప్రధానమైన భాష ఉండాలి. ఆధునిక భావాల్ని వ్యక్తీకరించడానికి భాషా ప్రధానమైన సాహిత్యాన్ని నేర్పాలి' అని విశదం చేశారు. ఈ జి.ఒ.లో కొన్ని ఆదేశాలుగా ఉన్నాయిగాని, విధిగా చెయ్యాలని చెప్పలేదు. భాషను వినియోగదారుడు వినియోగించుకొనే అవకాశం కల్పించాలి. తెలుగు కోసం ప్రత్యేకంగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదు తెలుగుభాషకు వ్యతిరేకంగా మాట్లాడేవాళ్లను అదుపు చేయాలి.



Unfiled Notes Page 11



పి.కన్నయ్య

'సమైక్యభారతి' సంస్థ నేత పి.కన్నయ్య 'ఈ జి.ఒ.ను 2014లోనే తెచ్చి ఉండాల్సింది. ఇప్పుడు ఎన్నికల ముందు - ఈ తప్పుల తడక జి.ఒ.నివ్వడం సమంజసం కాదు' అని విమర్శించారు.

కడప నుంచి వచ్చిన సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుడు తవ్వా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ చట్టంగా సాధికార సంస్థను త్వరలో తేవాలని డిమాండ్ చేశారు.

డా॥ టి.లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ 'మాతృభాషలో విద్యాబోధన' తప్పనిసరి అని ఇదే అన్నిటికీ కీలకం, ఆధారం అనీ అన్నారు. తెలుగు నేలపై ఉన్న బ్యాంకుల్లో తెలుగులోనే అన్ని రాతకోతలు జరగాలన్నారు.



డా॥ టి.లక్ష్మీ ప్రసన్న



తవ్వా ఓబుల్‌రెడ్డి


శ్రీయుతులు కందిమళ్ల శివప్రసాద్, ఎర్రంశెట్టి హనుమంతరావు, ఎం.బి.డి శ్యామల, చిట్టినేని శివకోటేశ్వరరావు, వి.నాగరాజ్యలక్ష్మి, సన్నపనేని అయ్యన్‌రావు, చందునాగేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, వై.హెచ్.కె.మోహనరావు, డా॥ రవీంద్రనాథ్, సిహెచ్. సత్యనారాయణ, జమదగ్ని, ఎ.వి.కె.సుజాత, మున్నగువారు తమ అభిప్రాయాలను తెలిపారు.

మాండలికాలను వినియోగించుకొనే విషయంలో జి.ఒలో ఏమీ పేర్కొనలేదని కొందరు విమర్శించారు. అందరూ వక్తలూ ఏకగ్రీవంగా కోరిన అంశాల్లో తెలుగు మాధ్యమంలో విద్య ముఖ్యమైనది. తప్పులను, లోటుపాట్లను సవరించి చట్టాన్ని నిర్ణీత కాల వ్యవధిలోపుగా తేవాలని అందరూ ముక్త కంఠంతో కోరారు. చట్టంగా వచ్చినపుడే ఈ ప్రభుత్వ చర్యను పూర్తిగా నమ్మే పరిస్థితి ఉంటుందన్నారు.

(ఈ సదస్సులో మాట్లాడిన అందరి పేర్లు, కొన్ని అంశాలు ఇవ్వడానికి సమయమూ, స్థలమూ కలిసి రావడం లేదు..)

సదస్సులో తీర్మానాన్ని కార్యదర్శి డా॥ వి. సింగారావు ప్రవేశపెట్టి, సభ్యుల అభిప్రాయాలను స్వీకరించి, తగు విధంగా సరిదిద్ది, ఏకగ్రీవంగా ఆమోదాన్ని పొందారు. ఆ తీర్మానం పూర్తిపాఠాన్ని 'ముఖ్యమంత్రిగారికి బహిరంగ విన్నపం' లో ఇచ్చాము. (ఈ ప్రక్క పుటలో చూడండి)


నిర్వహణకు సహకరించిన పెద్దలు



సిహెచ్ మస్తానయ్య

అయ్యన్‌రావు

తీర్మానాన్ని చర్చకు ప్రవేశపెడుతున్న డా॥ వి. సింగారావు




## తెలంగాణలో కూడా ప్రాధికార సంస్థకై త్వరలో ఉద్యమం


– తెలంగాణ రాష్ట్ర శాఖ కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్




వరంగల్‌నుంచి ఈ సదస్సులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర తెలుగు భాషోద్యమ సమాఖ్య కార్యదర్శి శ్రీ టి. ప్రభాకర్ సభలో మాట్లాడుతూ సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన ఉద్యమాన్ని రెండు రాష్ట్రాల్లోనూ కొనసాగించాల్సి ఉన్నదని, తెలంగాణలో కూడా త్వరలో ఇందుకై సమావేశం కానున్నామని ప్రకటించారు.

# ఆంధ్రప్రదేశ్ తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థకు చట్టబద్ధత కలిగించాలి.

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారికి బహిరంగ విన్నపం



2012 ఫిబ్రవరి 21న – తాము ప్రతిపక్ష నాయకునిగా ఉన్నప్పుడు హైదరాబాదులో తెలుగు భాషోద్యమ సమాఖ్య నిరసన దీక్షా శిబిరానికి విచ్చేసి సమాఖ్య కోరుతున్న 9 డిమాండ్లనూ బలపరచారు. 2014 ఎన్నికలలో గెలిచి అధికారం చేపట్టి, తప్పక ఆ డిమాండ్లను నెరవేరుస్తామని కూడా తాము అప్పుడు ప్రకటించారు. సమాఖ్య కోరిన 9 డిమాండ్లలో ప్రాధికార సంస్థ ఏర్పాటు మొదటిది.

2016లో సరిగ్గా ఇదే రోజున ఆధునిక తెలుగు భాషోద్ధారకుడు గిడుగు రామమూర్తిగారి జన్మదినోత్సవం – తెలుగు భాషా దినోత్సవం సందర్భాన తెలుగు భాషోద్యమ సమాఖ్య విజ్ఞప్తిని తాము మన్నించి, 'తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ'ను స్థాపించడం కోసం తగు కసరత్తు చేసి నెల రోజుల్లో నివేదికను ఇవ్వాలని నిర్దేశిస్తూ ఒక కమిటీని నియమించారు. కొంత ఆలస్యంగా కమిటీవారు నివేదికను ఇచ్చారు. తర్వాత, ప్రాధికార సంస్థ స్థాపనపై వెంటనే నిర్ణయం తీసుకోవలసిందిగా 2017 తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మరల తమకు విజ్ఞప్తి చేశాము. ఆ రోజున ఉత్సవ సభలో 'రేపోమాపో శాసన సభ సమావేశాల్లో ఇందుకోసం బిల్లును ప్రవేశపెట్టి, త్వరలో చట్టాన్ని తెచ్చి ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్థాపిస్తాము' అని తాము ప్రకటించారు. నాటి ప్రభుత్వం చేయలేకపోయిన పనిని తాము ముఖ్యమంత్రిగా వచ్చి, నెరవేర్చుతున్నారని భాషోద్యమకారులంతా సంతోషించారు.

దాదాపు ఒక ఏడాది గడచిన తర్వాత, 'ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు, అది 2018 జులై 18 నుండి అమలులోకి వస్తున్నట్లు' జులై 10న భాషా సాంస్కృతిక శాఖ నుండి జి.ఒ.నెం.:40 విడుదలయింది. ప్రాధికార సంస్థ ఏర్పాటవుతున్నందుకు అందరూ సంతోషించినా, శాశ్వత స్థాయిలో ఏర్పాటు కావలసిన ఒక వ్యవస్థ నిర్మాణం- శాసనబద్ధమైన పటిష్టమైన చట్టం ద్వారా చేయకుండా, ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా జరుపడం విజ్ఞులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

2018 తెలుగు భాషాదినోత్సవం నాటికి చేసేద్దామన్న ఉద్దేశంతో, ఇది హడావిడిగా చేపట్టిన చర్యగా అన్పిస్తున్నది. అంతేగాక ఈ జి.ఒ.లో అనేక విషయాల్లో అస్పష్టత, అసంబద్ధత చోటు చేసుకున్నది. దీనిపై తెలుగుభాషోద్యమ సమాఖ్య పిలుపు మేరకు ఆగస్టు 26న గుంటూరులో జరిగిన 'జి.ఒ.నెం : 40 పై సమాలోచనా సదస్సు' లో రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన విద్యావేత్తలు, భాషావేత్తలు, భాషోద్యమకారులు పాల్గొని రోజంతా చర్చించి ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని ఈ క్రింద ఇస్తున్నాము. ఎంతో ముఖ్యమైన ఇందలి అంశాలను తాము పరిగణనలోకి తీసుకొని, తగిన దిద్దుబాట్లను చేసి, ప్రాధికార సంస్థను చట్టబద్ధంగా స్థాపించడం కోసం చర్యలను వెంటనే చేపట్టాలని వేడుకుంటున్నాము.

## తీర్మానం

'తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చర్యలు గైకొంటున్నందుకు ఈ సదస్సు హర్షాన్ని ప్రకటిస్తున్నది. అయితే, ఎంతో ప్రాముఖ్యతగల సంస్థను ఒక చట్టంగా గాకుండా కేవలం ఒక ప్రభుత్వ ఉత్తర్వు (జి.ఒ.ఏం.ఎస్.నెం 40/10.7.2018) ద్వారా ఏర్పాటు చేయడం పట్ల తన అసంతృప్తిని తెలుపుతున్నది.

2017 తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా జరిగిన ప్రభుత్వ అధికారిక సభలో

ముఖ్యమంత్రిగారు ప్రసంగిస్తూ "ఇంతకు ముందున్న అధికార భాషా సంఘం స్థానంలో తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్థాపించడం కోసం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లుపెట్టి చట్టాన్ని తెస్తాం" అని ప్రకటించారు. కాని, అందుకు కారణం ఏదయినా దాదాపు 10 నెలలు గడిచిన తర్వాత ఇప్పుడు జి.ఒ. నెం. 40/10.7.2018 ద్వారా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేశారు. చిరకాలం ఉండవలసిన ఇటువంటి సంస్థను కేవలం ఒక జి.ఒ. ద్వారా ఏర్పరచడం సమంజసం కాదు అని ఈ సదస్సు అభిప్రాయపడుతున్నది.

ప్రాధికార సంస్థ చేయవలసిన అనేక పనులు ప్రభుత్వ విధాన నిర్ణయాలతో ముడిపడి ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ భాషా విధానం, విద్యా విధాన పరమైన స్పష్టతను ప్రకటించి, వాటి అమలుకు సంబంధించిన బాధ్యతలనివ్వడం సముచితంగా ఉంటుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే సాధారణ పరిపాలన, చట్ట నిర్మాణం, న్యాయస్థానాలుతో సహా పరిపాలన మరియు - విద్యా రంగాలలో ప్రభుత్వ భాషా విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని ఈ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతున్నది.

ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల వరకే పరిమితం చేస్తూ ఈ జి.ఓలో ప్రకటించారు. ఇది సామాజిక వివక్షకిందకే వస్తుంది. ప్రాథమిక విద్యను మాతృభాషా మాధ్యమంలోనే నేర్పాలన్న శాస్త్రీయ విధానాన్ని - విద్యావేత్తలందరూ ఆమోదించిన పద్ధతిని - ప్రభుత్వ విధానంగా ప్రకటించి రాష్ట్ర, కేంద్రప్రభుత్వ, ప్రైవేటు తదితర నిర్వహణలలోని అన్నిరకాల పాఠశాలలలోనూ, పాఠ్యప్రణాళికల (సిలబస్) లోనూ, అమలు చేయడం ప్రాధికార సంస్థకు అప్పజెప్పాలని ఈ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతున్నది.

ఈ జి.ఒ.లో ఆరు విధాలైన నేరాలకు జరిమానాలను, జైలుశిక్షలను నిర్దేశించారు. వీటి చెల్లుబాటును న్యాయ నిపుణులు సందేహిస్తున్నారు. ఈ జి.ఒ.లోనే మరికొన్ని అంశాలపై అస్పష్టతలున్నాయి. వాటిని కూడా సవరించవలసి యున్నది.

అయితే 18.7.2018 నుండి ఈ ఉత్తర్వు అమలులోకి వచ్చినందునా, ప్రాధికార సంస్థ స్థాపనకై వ్యవస్థాపరమైన చర్యల్ని ఇప్పటికే మొదలు పెట్టినందునా - ఆ క్రియాక్రమాన్ని ఆపకుండా కొనసాగిస్తూనే పైన కోరిన విధంగా లోటుపాట్లను త్వరలో సవరించి సమగ్రమైన, నిర్దుష్టమైన చట్టాన్ని తెచ్చేందుకు - రానున్న శాసన సభ సమావేశాల్లో బిల్లును ప్రవేశ పెట్టవలసిందిగా ఈ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.

రానున్న సాధారణ ఎన్నికలకు లోపుగా ఈ చట్టాన్ని తెచ్చి, ప్రజల ఆదరాన్ని పొందవలసిందిగా గౌరవనీయ ముఖ్యమంత్రిగారికి విన్నవిస్తూ ఈ సదస్సు ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నది...'

డా॥ సామల రమేష్‌బాబు
తెలుగుభాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు
9848016136

---

ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకీయ పుటలో తెలుగు భాషా దినోత్సవం (29-8-2018) నాడు పై విన్నపాన్ని ప్రచురించారు.

చర్చాపత్రం

బి.హనుమారెడ్డి, న్యాయవాది
94402 88080

# ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషాభివృద్ధి చర్యలు??

తెలుగు ప్రజాబాహుళ్యం ప్రభుత్వ కార్యకలాపాలలోను, సాధారణ వినియోగంలోను, మాతృభాష తెలుగును వాడుకొనుట నుద్దేశించి 1966 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారభాషా చట్టం తెచ్చింది. ఉర్దూ భాషను కూడ ఆ చట్టంలోకి తెచ్చింది. అది లొసుగులతోవుండి నిరుపయోగంగా పరిణమించినందున చాల జి.వొ.లు కూడ ఇచ్చాయి. ఆ చట్టంలో పేర్కొన్న విధంగా అధికారభాషా సంఘం ఏర్పరచబడింది. కొందరు పెద్దలు ఛైర్మన్‌లుగా, మరికొందరు అందలి సభ్యులుగా పనిచేశారు. దురదృష్టమేమంటే ఆ చట్టంలో అధికారభాషా సంఘానికి ప్రభుత్వ కార్యకలాపాలలో, భాషావిధానంలో, భాషాభివృద్ధిలో ఎట్టి అధికారాలు లేవు. అది కేవలము సమీక్ష, సమాలోచన, సలహాల సంఘంగా నిరుపయోగంగా వుండినది.

కాలక్రమేణా ఉద్యోగాలకు, ధనసంపాదనకు ఇంగ్లీషు భాష ఉపకరణమైంది. 1960–1970 ప్రాంతాలలో తెలుగు భాషను మాట్లాడు, వినియోగించు ప్రజలు భారతదేశంలో రెండవ స్థానంలో వుండగా నేటికి అది నాల్గవ స్థానంలోకి పడిపోయింది. ఇందుకు కారణం మన రాష్ట్రప్రభుత్వాలు తెలుగుపట్ల శ్రద్ధ చూపకపోవటం ఒకటైతే, టెక్నాలజీ మరియు విదేశీ ఉద్యోగాలు మరొక కారణమైతే, ప్రక్క రాష్ట్రాలలో తెలుగులో విద్యాబోధన ఎప్పటివలె లేకపోవటం ఇంకొక కారణం. ఫలితంగా మన మాతృభాష తీవ్ర ఇబ్బందికి లోనౌతున్నది.

ఈ ప్రమాదాన్ని గుర్తించి తెలుగు భాషోద్యమ సమాఖ్యవారు, రాష్ట్రంలోని సాహితీ కారులు, సాహితీ సంఘాలు మాతృభాషా పరిరక్షణకు పరిపరి విధాల ప్రభుత్వాలను చర్యలు తీసుకొనవలసిందిగా కోరుతూ వచ్చారు. కాని ప్రభుత్వాలు అందరి డిమాడ్లను పెడచెవిన బెట్టి విద్యను, విద్యలోని భాషాంశాన్ని విద్యావ్యాపారుల పెత్తనానికి వదిలేసింది. వారు, వారి వ్యాపారాభివృద్ధికిగాను విద్యనంతటిని ఆంగ్లమయం చేసి మన యువతను అమెరికాకు నడిపారు. అమెరికాకు పోయే టెక్నలాజికల్ కోర్సులకు ఎంత ఆంగ్లం కావాలి? కాని విద్యార్థుల జీవితాలను ప్రభుత్వాలు, ప్రైవేటు కాలేజీలు కలిసి ఒక మూలకు తోసేశారు.

ప్రభుత్వానికి ఒక నిర్ణీత భాషా విధానంగాని, విద్యావిధానంగాని లేదు. మాతృభాషను కాపాడుటకు అధికారాలతో కూడిన తెలుగు భాషాప్రాధికార సంస్థ లేదు. అట్టి సంస్థ అవసరాన్ని గూర్చి ఉద్యమకారులు, సాహితీ సంఘాలు ప్రభుత్వాన్ని పలుసార్లు కోరారు. కాని, ప్రభుత్వం చలించలేదు. ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయలేదు. 1966 చట్టంక్రింద ఏర్పాటు చేసిన అధికారాలు లేని అధికార భాషా సంఘం కూడ గాలికి పోయింది. ప్రస్తుతం కార్పొరేట్ విద్యా సంస్థలు మాతృభాషకు ఏమాత్రం గౌరవం, ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వ సూచనలను కూడ పాటించటం లేదు. ఎవరి వ్యాపారం వారిది. ప్రజలు కూడ వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవటంలేదు. టెక్కీ విద్యార్థులు తెలుగు నేర్చుకోవటానికి గల ఇబ్బందేమిటో వారికి కూడ తెలియదు. గతంలో భాషా పరిరక్షణ దిశలో ప్రభుత్వం జారీచేసిన జి.వొ.లలో ఒక్క దానిని కూడ ప్రభుత్వంగానీ, ప్రభుత్వ సంస్థలుగాని అమలు పరచలేదు. పర్యవసానంగా బోధన, పాలన, న్యాయపరిపాలనా విభాగాలలో తెలుగు భాష ఏమాత్రం వినియోగించ బడుటలేదు.

2013 సంవత్సరాన్ని భాషా సాంస్కృతిక వికాస సంవత్సరంగా ప్రకటించారు. దానికొక కార్యాచరణ ప్రణాళిక కూడ విడుదల చేశారు. వాటిలో 13 ప్రభుత్వ శాఖలు పాలుపంచుకొనుటకు 10 లక్ష్యాలతో కార్యక్రమాలు విడుదల చేశారు. తెలుగుబాట కార్యక్రమాలంటూ రకరకాల కార్యక్రమాలు పేర్కొన్నారు. అన్నింటి నిర్వహణను రాష్ట్రసాంస్కృతిక వ్యవహారాల శాఖకు అప్పగించారు. ఒక్కటి కూడ యువతకు, విద్యార్థులకు మాతృభాషపై మక్కువ కలిగించేవి కాదు. ఇందుకు విద్యాశాఖ ఏమైనట్లు? భాషకు ప్రత్యేకంగా శాఖలేకుండా ఎందుకు పోవాలి? 1985 లోనే అకాడమీల పునరుద్ధరణ ఉత్తరువులిచ్చారేగాని అవి పూర్తిస్థాయి అమలుకు రాలేదు.

కాగా–తెలుగు భాషాభివృద్ధి కోసమని ఒక వ్యవస్థను సృష్టిస్తూ ప్రభుత్వం జి.వొ. నం.40 / 10-07-2018 విడుదల చేసింది. ఈ జి.వొ. ను ఆంధ్రప్రదేశ్ టూరిజమ్, కల్చర్ అండ్ హెరిటేజ్ బోర్డు చట్టం–2017లో సెక్షన్‌లు 6, 10(1)(బి), మరియు 42ల క్రింద ఇచ్చారు. ఆ టూరిజం చట్టంలో 'భాష' లేదు. టూరిజమ్, కల్చర్ మరియు హెరిటేజ్ పదాల్లో భాష పదం లేదు. టూరిజం సంబంధించి కల్చర్‌లో భాష చేరదు. హెరిటేజ్ కట్టడాలకు సంబంధించింది ఆ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ టూరిజం, కల్చర్ అండ్ హెరిటేజ్ బోర్డును ఏర్పాటు చేయవచ్చుగాని, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను కాదు. ఈ జి.వొ.ను భాషా సంబంధిత శాఖవారు విడుదల చేయలేదు. కనుక భాషా సంబంధ విషయాలపై చెల్లదు. దీనిలో బోలెడు డబ్బు వినియోగ మార్గాలున్నై. ఈ జి.వొ. క్రింద ఏమి రాసినా భాషకు ప్రయోజనముండదు.

తెలుగు ప్రజలు కోరుకునేది టూరిజం చట్టం క్రింద జి.వొ. కాదు. ఇది కంటి తుడుపు జి.వొ. అని, భాషాభివృద్ధికోసం కాదని తెలుగు ప్రజలకు అర్థమైంది. తెలుగు ప్రజలకు నేడు కావలసింది అధికార భాష అమలు, భాషాభివృద్ధి ప్రాధికారసంస్థ చట్టం. జి.వొ. కాదు. దానికి చట్టబద్ధస్థాయి కల్పించి బోధన, పాలన, న్యాయస్థానాలలో తెలుగు వాడకం అను ముఖ్య విషయాలు పొందుపరచి అమలకు అవసరమగు అధికారాలివ్వాలి. లేకుంటే మన మాతృభాష తెలుగుకు ప్రమాదం వేగంగా రాగలదు. ఈ రోజుకు పరిశోధనలలో విఖ్యాత భాషా పరిశోధకులైన ప్రొ:గణేష్ యన్. దేవిగారు తేల్చిన దేమంటే గత అర్ధశతాబ్దంలో మనదేశంలో 283 భాషలు మాయమయ్యాయి. కొంతకాలానికి మనదేశం భాషల మృత్యుదిబ్బగా మారుతుంది. మాతృభాషలలో విద్య అవసరం

మరియు వలసలు ప్రధాన శత్రువు అని తేల్చారు. ఈ ప్రమాదాన్ని గుర్తించాలి.

కనుక తెలుగు భాషాభివృద్ధికి ఈ క్రింది అంశాలను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని, తెలుగు భాషోద్యమ కారులు, భాషాభిమానులు, సాహిత్య సంస్థలు కోరుతున్నారు.

అ) విద్యావిధానము - ప్రణాళికకు ప్రభుత్వం సరైన నిర్ణయం ప్రకటించాలి.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో ఒకే సిలబస్, ఒకే విద్యావిధానం ఉండాలి. 5వ తరగతి వరకు విద్యాబోధన తెలుగు మాధ్యమంలోనే జరగాలి. ఇంగ్లీషు ఒక సబ్జక్టుగా వుండవచ్చు. ఆ తరువాత ఎవరి మాధ్యమం వారికి 10 వ తరగతి వరకు విడివిడిగా వుండాలి.

ఆ) యం.ఎ వరకు తెలుగు మాధ్యమం, ఇంగ్లీషు మాధ్యమం బోధనతో కాలేజీలు అవసరం.

ఇ) భాషా విధానంను ప్రభుత్వం ప్రకటించాలి.

ఈ) కేంద్రప్రభుత్వానికి, ఇతర రాష్ట్రాలకు పంపు ఉత్తర ప్రత్యుత్తరాలు మినహా రాష్ట్ర సచివాలయం నుండి గ్రామ సచివాలయం వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు దస్త్రాలు, కార్యకలాపాలు విధిగా తెలుగులోనే జరగాలి.

ఉ) హైకోర్టుకంటె దిగువస్థాయి న్యాయస్థానాలలో తెలుగును విధిగా వాడునట్లు, చట్టం అవసరం.

ఊ) చట్టాలను, జి.వొ.లను ప్రభుత్వమే తెలుగులో రాయించి ప్రచురించాలి.

ఋ) తెలుగు భాషాభివృద్ధి ప్రాధికారచట్టం చేసి, తెలుగుభాషాభివృద్ధి ప్రాధికారసంస్థను ఆ చట్టం ద్వారా ఏర్పాటు చేసి, చట్ట బద్ధత కల్పించి దానికి అవసరమైన అధికారాలను కల్పించి, దానికి మంత్రిస్థాయి అధ్యక్షుడుండునట్లు చట్టంలో ఏర్పాట్లు చేయాలి. సభ్యులుగా ఇతర పలురంగాల పెద్దలను తీసుకోవాలి. తగు విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలి.

ఋ) తెలుగులో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికే తెలుగు రాష్ట్రంలో ఉద్యోగాలివ్వాలి. పదోన్నతులివ్వాలి.

ఎ) తెలుగు-ఇంగ్లీషు మరియు ఇంగ్లీషు-తెలుగు నిఘంటు నిర్మాణం నిరంతరంగా జరిగేట్లు ప్రాధికార సంస్థలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి..

ఏ) దైనందిన అన్ని భాషావాడకాలు, ప్రతిచోట తెలుగు భాషలోనే వుండునట్లు అవసరమైన జి.వొ. లివ్వాలి.

ఐ) ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం తేవాలి.

ఒ) ప్రక్కరాష్ట్రాలలో తెలుగు వాడకాన్ని రక్షించాలి. ఆ ప్రభుత్వాలతో చర్చించాలి.

ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నాము...

కవిత

# అమరావతి

డా॥ పాపినేని శివశంకర్
89780 12323

కృష్ణవేణి ఒడిలో అల్లారు బిడ్డ అమరావతి
తెలుగుతల్లి మెడలో నవ వైజయంతి అమరావతి

ఏ యక్షిణి కన్య లిచట యక్షగానములు చేసిరొ
ఏ నాగుల ఎలనాగలు వలయనృత్యమాడారో
వన్నెల పలు జాతుల సామూహిక విన్యాసంలో
పున్నమి వెన్నెల రాత్రుల పులకించిన పుణ్యభూమి ॥కృష్ణ॥

అదె సిద్ధార్థుని జీవిత మదే పంచకల్యాణం
భిక్షు శాంతికపోతాలు విహరించిన విహాయసం
జీవనదీ తరంగాలు పలికిన త్రిశరణ మంత్రం
*బుద్ధం శరణం గచ్ఛామి*
*ధర్మం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి*
ధ్యాన జ్ఞానజ్యోతులు వెలిగించె మహాస్తూపం ॥కృష్ణ॥

శాతవాహనుల క్షాత్రం మ్రోగించిన యుద్ధభేరి
హాలుడు గుది గుచ్చిన మాలిక గాథా సప్తశతి
శిలలకు ఊపిరులూదిన శిల్పకళా బహుళ కీర్తి
శాంతిని దాంతిని నిరతం పండించిన యశోమూర్తి

కరుణామృత ధారలొలుకు అమరేశ కటాక్ష దీప్తి
క్రౌంచగిరుల శిఖరంపై కాలూనే కర్మసాక్షి
కనువిందొ వికుంతాద్రి, కట్టెదుటే కనకదుర్గ
శ్రీ భవఘ్ను వాటికలో మార్మోగే మధుర గీత ॥కృష్ణ॥

రేగటి పొలాల నాగలి చిందించిన చెమటచుక్క
రేపటి జన జీవనిగా మొలకెత్తిన పత్తిమొక్క
ఆకుపచ్చ చీరలోన అందగించు పుడమి చాన
ఆగామి స్వర్ణయుగ నిరీక్షణపై కలల వాన

కృష్ణవేణి ఒడిలో అల్లారు బిడ్డ అమరావతి
తెలుగు తల్లి మెడలో నవ వైజయంతి అమరావతి

# ఇది తెలుగు గుండె చప్పుడు...ఇదీ తెలుగు మానిఫెస్టో

## తెలుగువారి ఆశయ ప్రకటన...తెలుగుభాషోద్యమకారుల లక్ష్య ప్రకటన!

### తెలుగువారు తమ రోజువారీ వ్యవహారాలను తెలుగులో జరుపుకోగలగాలి!

- ⇨ తెలుగువారికి మాతృభాషలో విద్యాబోధన జరగాలి.
- ⇨ తెలుగు రాష్ట్రాలలో పరిపాలన, వ్యాపార వ్యవహారాలూ తెలుగులో జరగాలి.
- ⇨ తెలుగు రాష్ట్రాల్లో అమ్ముడయ్యే వస్తువులూ, అందించబడే సేవలూ తెలుగులో లభ్యమవాలి.
- ⇨ సగటు తెలుగువాడికి కావలసిన వినోదం, విజ్ఞానం, వికాసం అన్నీ తెలుగులో లభ్యమవాలి.
- ⇨ తెలుగు మాత్రమే వచ్చినవారు కూడా సౌకర్యంగా, గౌరవంగా బతకడానికి తగ్గ సంపాదనావకాశాలు ఉండాలి.

### ప్రభుత్వం - శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలు

ప్రజల తర్వాత వారిపై అత్యంత ప్రభావాన్ని చూపించే వ్యవస్థలు ఇవి. ఈ వ్యవస్థలు తెలుగు భాషలో నడుస్తూ, వాటి విధానాలు తెలుగు భాషకు అనుగుణంగా ఉన్నప్పుడు మన లక్ష్యం నెరవేరినట్టే.

- ⇨ చట్ట సభల్లో చర్చలూ, చట్టాల రూపకల్పన తెలుగులో జరగాలి.
- ⇨ ప్రభుత్వ ఉత్తర్వులు, నియమ నిబంధనలు, విధాన ప్రకటనలు, సంక్షేమ పథకాలు, తాఖీదులు, రశీదులు, ఇతరత్రా సమాచారం అంతా ప్రధానంగా తెలుగులోనే ఉండాలి.
- ⇨ పరిపాలన, ప్రభుత్వ అంతర్గత వ్యవహారాలు, పద్దులు, రికార్డులు అన్నీ తెలుగులోనే జరగాలి.
- ⇨ న్యాయస్థానాల్లో వాదప్రతివాదనలు తెలుగులో జరగాలి. తీర్పులను తెలుగులో వెలువరించాలి.
- ⇨ ప్రభుత్వం, దాని విభాగాలు ప్రజలకు అందించే సమాచారం, ప్రజాసంబంధాల నిమిత్తం నిర్వహించే అన్ని రకాల కార్యకపాలాలు (రేడియో టీవీ ప్రోగ్రాములు, వార్తాలేఖలు, సామాజిక మాధ్యమాలలో ప్రచారం గట్రా) అన్నీ తెలుగులో ఉండాలి.

### ముద్రణ, ప్రసార, జాల మాధ్యమాలు

ప్రజల మధ్య, సమాజంలోని తతిమా వ్యవస్థల మధ్య అంతరాల్ని పూడ్చి సంభాషణా వారధులుగా వ్యవహరించేవే మాధ్యమాలు. వీటికి ఉన్న ప్రాధాన్యత లేదా అవి పోషించే పాత్ర మూలంగా వీటిని ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరించారు. తెలుగు భాషకు ఆధునికహోదాలో కూడా వీటిదే కీలక పాత్ర.

- ⇨ **వినోదం:** సినిమాలు, టీవీ కార్యక్రమాలు, నాటకాలు, స్వతంత్ర మాధ్యమాలలో తక్కువ నిడివి సినిమాలు, కథలు, కవితలు, కార్టూనులు వంటివి అన్నీ తెలుగులో ఉండాలి. ఇప్పటికే ఇవన్నీ తెలుగు లోనే ఉన్నా వీటి సృష్టి ఇతర భాషలతో పోలిస్తే తెలుగులో చాలా తక్కువ. తెలుగు వారి తలసరి సాంస్కృతిక దిగుబడి చాలా పెరగాల్సి ఉంది.
- ⇨ **విజ్ఞానం:** అకడమిక్ రూపంలో చూస్తే అన్ని స్థాయిల్లోనూ చదువులు (వృత్తి విద్యలు, దూర విద్యలతో సహా) పూర్తిగా తెలుగులో చదువుకునే అవకాశం ఉండాలి. పరిశోధనలు, పత్ర సమర్పణలు, శాస్త్ర విజ్ఞాన రంగాల్లో పురోగతీ, దానిపై చర్చలూ, సదస్సులూ కూడా తెలుగులో జరగాలి. అకడమికేతర రూపాల్లో వివిధ నైపుణ్యాలపై శిక్షణలు, సరికొత్త సాంకేతికతలపై సదస్సులు, చర్చలూ, అనేక అంశాలపై సెమినార్లూ గట్రా తెలుగులో జరగాలి.
- ⇨ **సమాచారం:** స్థానిక, ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వార్తలూ విశేషాలూ అన్నీ తెలుగులోనూ లభించాలి. కేవలం దినపత్రికలు, జాల పత్రికలే కాకుండా, స్వతంత్ర మాధ్యమాలుగా బ్లాగులు, ట్విట్టర్, యూట్యూబ్ ఛానెళ్లు, పోడ్‌కాస్టులు తెలుగులో విరాజిల్లాలి.
- ⇨ **వికాసం:** ఆధ్యాత్మికత, తత్వ చింతన, నైతిక ధర్మ చింతనలు, భవిష్యత్తు-సాంకేతికతలపై ఆలోచనలు, మానవాళి మనుగడ, ప్రస్థానం ఇలాంటివాటిపై ఆలోచనలు, చర్చలు, ప్రచురణలు తెలుగులో జరగాలి. మార్పుకై పోరాటం, అన్ని రకాల ఉద్యమాలు వాటి సాహిత్యం అంతా తెలుగులో లభించాలి.

### వ్యాపార సంస్థలు

నేటి మార్కెట్-ఆధారిత పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యాపార సంస్థల పాత్ర కూడా అంచనాలకు మించిన ప్రాధాన్యం కలది. వాటినుండి భాషకు తగ్గ తోడ్పాటు లభించినప్పుడే ఆధునికహోదా లభించినట్టు.

- ⇨ తెలుగు రాష్ట్రాల్లో అమ్ముడయ్యే వస్తూత్పత్తులన్నీ (పేర్లూ, వాడుకునే సూచనలు, ఇతరత్రా వివరాలతో సహా) తెలుగులో ఉండాలి. ఇక్కడ అందించబడే సేవలు కూడా తెలుగులో/తెలుగు సమాచారంతో లభ్యమవాలి. వారి వ్యాపార ప్రకటనలూ తెలుగులో ఉండితీరాలి.
- ⇨ వ్యాపార సంస్థలు ప్రభుత్వాలకు, ప్రభుత్వ విభాగాలకు దాఖలు చేసే నివేదికలు, వాటి పెట్టుబడిదార్లకు, వాటాదార్లకు, ప్రజల సమాచార నిమిత్తం ప్రచురించే నివేదికలు, పత్రాలు తెలుగులో ఉండాలి.
- ⇨ తెలుగువారి వ్యాపార సంస్థల్లో అంతర్గత కార్యకపాలాలు, పద్దులు, ఖాతా పుస్తకాలువంటివీ తెలుగులో నిర్వహించబడుతూండాలి.

(https://manifesto.irusu.in)

ప్రభుత్వ సభ

# గిడుగు జయంతి – తెలుగుభాషాదినోత్సవం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సభ వివరాలు



తెలుగుభాషాదినోత్సవం సందర్భంగా ఆధికారికంగా విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రంలో సాయంత్రం ఘనంగా ఒక సభను జరపడం, దానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ప్రసంగించడం, సుమారు పది – ఇరవై మంది వారికి భాషా పురస్కారాల నివ్వడం – ఇది గత మూడేళ్లుగా జరుగుతూనే ఉంది. యధావిధిగా ఈ ఏడు కూడా తలపెట్టారు గాని, తెలుగుదేశం పార్టీ ప్రముఖుడు, ముఖ్యమంత్రిగారి బావ మరిది నందమూరి హరికృష్ణ ప్రమాదవశాత్తు మరణించడం వల్ల ముఖ్యమంత్రిగారి కార్యక్రమం రద్దుఅయింది. అందువల్ల ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా జరిపేశారు. పురస్కార గ్రహీతల్లో కూడా కొందరు రాకపోవడంతో 15 మందికి మాత్రం శాసన సభ ఉపసభాపతి డా॥మండలి బుద్ధప్రసాద్‌గారిచేత పురస్కారాలనిప్పించి ముక్తసరిగా కార్యక్రమాన్ని జరిపించేశారు సంచాలకులు డి.విజయభాస్కర్. భాషా పురస్కారాలనందుకొన్నవారు సర్వశ్రీ...డానియేల్ నెగర్స్ (ఫ్రాన్స్), నాగసూరి వేణుగోపాల్, షేక్ రహ్మానుద్దీన్, ఆదినారాయణ, జె. సత్యవాణి, జక్కంపూడి సీతారామారావు, నాదెండ్ల శ్రీమన్నారాయణ, దార్ల బుజ్జిబాబు, పారుపల్లి కోదండరామయ్య, శరత్ జ్యోత్స్నారాణి, జి.రెజీనా, వావిలాల సుబ్బారావు, చొక్కాపు వెంకటరమణ, మంగళగిరి ప్రసాదరావు, సముద్రాల గురుప్రసాద్. ఇక అంతా మామూలే. హడావుడి పనులు...మనసుపెట్టని మర్యాదలు...వెరశి...విమర్శలు ! ఈ కార్యక్రమం ప్రతియేటా ఇంతే. ప్రభుత్వం...డబ్బుకు కొదవలేదు. మాతృభాష పట్ల మమకారంగాని, ప్రజలభాష పట్ల కట్టుబాటుగాని లేని లేదు!.

ఈ సభలో పాల్గొన్న ఒక ప్రేక్షకురాలు – విద్యావంతురాలైన ఒక పెద్దావిడ తన భావాలను రాసి పంపించారు. చదవండి!

## స్మారకం ముందు జయంతి చిన్నబోయింది!

తెలుగు భాషా దినోత్సవంగా గిడుగు రామమూర్తిగారి జన్మదినాన్ని (29 ఆగస్టు) యధాప్రకారం అన్ని ప్రభుత్వలాంఛనాలతో ఈ సంవత్సరం గూడ నిర్వహించారు. సభా భవనం శోభస్కరంగా ఉంది. తెలుగు భాషా సంస్కృతులకు ఇంత వేడుక చేయ తలపెట్టిన ప్రభుత్వాన్ని, నిర్వహణభారం వహించిన భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టరు శ్రీ విజయభాస్కర్ గారిని మనసారా అభినందించవలసిందే. సత్కారం పొందటానికి వచ్చినవారిలో ఫ్రెంచి దేశస్తుడయిన డేనియల్ నెగర్సు; మారిషస్‌లో తెలుగు కోసం కృషి చేస్తున్న ఆదినారాయణ గార్లను తలచుకుంటే మనసు పులకరించింది. రెల్లిభాషపై పరిశోధన చేసిన మంగళగిరి ప్రసాదరావుగారు, తెలుగు కంప్యూటరీకరణ గురించి కృషి చేస్తున్న యువకుడు రహమానుద్దీన్ వంటి యువకులకు పురస్కారాలు ఇవ్వటం వల్ల మరింత కృషికి ఉత్తేజం పొందుతారు. వృద్ధులకు పురస్కారాలు ఇవ్వటం వల్ల వారికి తృప్తి, ప్రజలకు గౌరవం కలుగుతాయి. ఈ విధంగా రెండు వయో వర్గాలను సత్కరించటం మెచ్చదగిందే.

సాంస్కృతిక శాఖవారు ఘనంగా చేయదలచినా ఉత్సవం కాస్తా నందమూరి హరికృష్ణగారు అకాల మరణం చెందటం వల్ల, సంతాపఛ్చాయల క్రింద ముగిసింది. అందుచేత వారు నాట్య సంగీత ప్రదర్శనలను కార్యక్రమం నుంచి ఉపసంహరించారు.

కానీ....వినోదాలను ఉపసంహరించినా ప్రసంగాలను గూడ విరమించటంలోని ఔచిత్యం తోచదు. శ్రీకాకుళం నుండి చిత్తూరు దాక వివిధ జిల్లాల నుండి దాదాపు 18 మంది భాషా క్షేత్రంలో కృషి చేస్తున్నవారిని పిలిచారు గదా! వీరి అనుభవాలను అభిప్రాయాలను క్లుప్తంగా తలా మూడు నిమిషాలలో చెప్పమంటే గంటలోపే (వచ్చినవారు 15 మంది) పూర్తి అయ్యేది. అభిప్రాయాలు చెప్పే అవకాశాన్ని సన్మానితులు, విని తెలుసుకొనే అవకాశాన్ని శ్రోతలు పోగొట్టుకున్నారు. భాషకు నేటి అవసరాలేమిటో, ప్రజలు ఏమి చెయ్యాలో ప్రభుత్వం ఎట్లా సహకరించాలో మొదలయిన విషయాలను నావంటి శ్రోతలు తెలుసుకొనేవారు. తెలుగుపై అభిమానమేగాని, ఏమి చెయ్యాలో తెలియని శ్రోతలు నాలాగా చాలామంది ఉన్నారు.

భాషాభివృద్ధి గురించి అభిప్రాయాలు చెప్పటం, ప్రభుత్వ బాధ్యులు వాటిని వినటం – స్పందించటం సంతాప వాతావరణానికి ఏమీ వ్యతిరేకం కాదు గదా! మాట్లాడిన ప్రభుత్వ వక్తలందరు, ఎమ్మెల్సీ రామకృష్ణగారు, గుమ్మడి గోపాలకృష్ణగారు, డి. విజయభాస్కర్‌గారు ఎక్కువగా హరికృష్ణగారిపై సంతాపాన్ని, తక్కువగా గిడుగువారి గురించి, మరీ

తక్కువగా భాషా కర్తవ్యం గురించి మాట్లాడినట్లనిపించింది.

హరికృష్ణగారి ఫోటో సంస్మరణగా దీపారాధనతో సహా వేదిక వెనుక తెరపై ప్రధానంగా ఫోకస్ చేశారు. ఒక ప్రక్కన క్రింద గిడుగువారి ఫోటో ఉంది. స్మారకం ముందు జయంతి చిన్నబోయింది!

మలేషియా ప్రతినిధి తెలుగు పలుకుబడి ఫ్రెంచి దేశీయుని తెలుగు ఉచ్చారణ వినముచ్చటపడి, తెలుగు కృషీవలుల శ్రమను విని, ప్రభుత్వ బాధ్యుల సమాధానాలను తెలుసుకొనే అవకాశం శ్రోతలు కోల్పోయారు!!

అందరికీ శాలువలు, జ్ఞాపికలు యిచ్చి, సమిష్టి ఫోటో తీయించారు. వాళ్లు వేదికమీద కూర్చొనే కనీస అవకాశంగూడ కల్పించలేదు. ఒకరికిచ్చిన మొమెంటో చూచాను. దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి ఫోటో మాత్రమే ఉంది. గిడుగువారి ఫోటో కాదుగదా పేరుగూడ లేదు – ఆ పెద్దాయన పేరుగాని ఫోటోగాని ఉంటే ఎంత ఉచితంగా ఉండేది! ఈనాటి దినోత్సవానికి గిడుగు గారికి ఉన్న సంబంధం మొమెంటో తీసుకున్న సందర్భం స్ఫుటం అయి వుండేవి. ఇపుడు ముఖ్యమంత్రిగారికి, భాషా దినోత్సవానికి సంబంధం ఉన్నట్లు చెప్పారు నిర్వాహకులు. ఎవరి నిర్వహణా చాతుర్యమో!

పాపం నాట్య ప్రదర్శనకు వచ్చిన నాట్య తారలూ మేకప్ ఆహార్యం అన్నీ సిద్ధమయి వచ్చి ప్రదర్శనకు నోచుకోలేదు. పోనీ ముందే చెప్పితే మేకప్ తిప్పలు తప్పేవి గదా!

శ్రోతలకు మాకే ఇంత అసంతృప్తిగా ఉంటే, సన్మానితులకు, నాట్య తారలకు ఎట్లా ఉందో? ఇట్లాగే ఉంటుందని తెలిసే కాబోలు ప్రేక్షకులు గూడ నిమిషంలో లెక్క పెట్టగలిగినంత మందే వచ్చారు. ముఖ్యమంత్రిగారు రాలేకపోవటం అర్థం చేసుకోవచ్చు...వచ్చిన ఉప సభాపతిగారు గూడ ప్రభుత్వ కృషిని ఏమీ చెప్పకపోవటం అసంతృప్తే! అమ్మయ్య...ఈ సంవత్సరానికి అయిపోయింది అన్నట్లు అనిపించింది.

– వై. జయశ్రీ

పొరుగు తెలుగు

## "చెన్నపురి తెలుగువాణి" వారి తెలుగుభాషా దినోత్సవం



చెన్నై: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం "భారతదేశంలో తెలుగు స్థానం" అనే అంశంపై చర్చ జరిగింది. మైలాపూర్ లజ్ వద్దగల ఆంధ్ర మహిళా సభ – వేదిక. ముఖ్య అతిథిగా తమిళనాడు ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి జే టీ ఆచార్యులు, విశిష్ట అతిథిగా తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి డా॥ వెన్నిసెట్టి సింగారావు పాల్గొన్నారు. సభకు విశ్రాంత ప్రొఫెసర్ నిర్మల పళనివేల్ అధ్యక్షత వహించారు. అధ్యక్షురాలు డా॥ నిర్మల మాట్లాడుతూ...తమిళనాడులో స్థిరపడిన తెలుగువారు నాలుగో తరం వచ్చేసరికి తాము తమిళులమేనని చెప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడులు, కళాశాలలలో తెలుగు విద్యార్థుల సంఖ్య, బోధనా సిబ్బంది తగ్గడానికి తమిళనాడు ప్రభుత్వం కారణం కాదని, అందుకు తెలుగువారే కారణమని అభిప్రాయపడ్డారు. వ్యావహారిక గిడుగు రామమూర్తి కృషిని వివరించారు.

డా॥ వెన్నిసెట్టి సింగారావు మాట్లాడుతూ... ప్రపంచమంతటా ఆయా దేశాలలో మాతృభాషలు చలామణి అవుతుండగా, తెలుగు రాష్ట్రాలలో మాత్రం పాలన, బోధన ఆంగ్లంలో జరగడం గర్హనీయమన్నారు. భాషాభివృద్ధి కోసం 2003లో తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏర్పాటు, 15 సంవత్సరాల పాటు ఎదుర్కొన్న ఆటుపోట్లను వివరించారు. పదవి లేనప్పుడు భాష వర్ధిల్లాలని నినదించి, పదవి వచ్చాక మాట మార్చిన నేతల వైఖరిని ఎండగట్టారు. తమ ఉద్యమానికి పత్రికలు బాసటగా నిలిచాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లో తెలుగు భాషాభివృద్ధి శాఖను ప్రకటించి అనంతరం భాషా, సాంస్కృతిక శాఖగా మార్చి భాషా ప్రేమికులను నిరుత్సాహపరిచారని వ్యాఖ్యానించారు. విద్యార్థులు మార్కుల కోసం ఇతర భాషలను ప్రథమంగా ఎంచుకొని తెలుగును రెండవ భాషగా ఎంచుకోవడాన్ని విమర్శించారు. ప్రైవేటు సంస్థలు బోధన వ్యవస్థను భ్రష్టు పట్టించాయని అన్నారు. తెలుగుకు ప్రాచీన హోదా ఇవ్వకూడదని మద్రాసు హైకోర్టులో కేసు వేస్తే... ఎవరూ పట్టించుకోకపోయినా సంజీవరావు పోరాడి తెలుగువారి గౌరవాన్ని కాపాడారని గుర్తు చేశారు. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కనీసం ఆయనను పిలిచి అభినందించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పండితుల చేతుల్లోని భాషను పామరులకు అందేలా గిడుగు ఉద్యమం చేయగా నేడు పరాయి భాష నుంచి తెలుగును కాపాడుకొనే ప్రయత్నం నేటి భాషోద్యమకారులు చేయాల్సొస్తోందని పేర్కొన్నారు.

భాషాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలను గురించి కమలాకర రాజేశ్వరి, మంగళ కందూర్, డా. కల్పన గుప్తా, చదలవాడ ఉదయశ్రీ తమ అభిప్రాయాలను, పరిశీలనలను వెల్లడించారు. ముఖ్య అతిథి జేటీ ఆచార్యులు మాట్లాడుతూ... తెలుగు జనాభా ఎక్కువగానే ఉన్నా తెలుగు మాట్లాడేవారి, తెలుగు మాతృభాషగా చెప్పుకొనేవారి సంఖ్య తగ్గిపోతున్నదని పేర్కొన్నారు. తమిళనాట రాబోయే జనాభా లెక్కల్లో స్థానిక తెలుగువారు 'మేం తెలుగువాళ్ళం' అని చెప్పి రాయించుకోవలసిన అవసరాన్ని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాలు అధికార భాష అమలుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమావేశ కర్త డా॥ తూమాటి సంజీవరావు స్వాగతోపన్యాసం చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగులో వ్రాత పరీక్షలతోపాటు మౌఖిక పరీక్షలు కూడా నిర్వహించాలని, పాఠ్య పుస్తకాల విషయంలో కళాశాలలే శ్రద్ధ వహించి విద్యార్థులకు మేలు చేయాలని ఆయన సూచించారు. టీనగర్ కేసరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీ ఆర్ బి సీ సీ కళాశాల విద్యార్థులు మహేష్, కౌసల్య, లవణ్ కుమార్‌లు మాట్లాడుతూ... **తెలుగుకి సంబంధించి చిన్ననాడే తమకు మంచి పునాది వేసి ఉంటే ఎంతో బాగుండేదని అభిప్రాయపడ్డారు.** తమకు తెలుగు పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా తెలుగు పాఠాలు మారలేదని అంటూ... ఆధునిక రచనలు కూడా పాఠ్యాంశాలలో భాగం చేయాలని సూచించారు.

డా॥ తక్కోలు మాచిరెడ్డి(వివేక్)
80996 17667

# బోధనాభాషగా తెలుగు–సాధక బాధకాలు

**మనదేశంలో ఇప్పటికే 197 భాషలు అంతరించినాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2025 నాటికి తెలుగు అంతరిస్తుందని ఒక అంచనా. ఏ భాష అయినా ఇంటికి మాత్రమే పరిమితమైతే ఆ భాష ప్రమాదంలో ఉన్నట్లులెక్క. ప్రస్తుత తరం ఆ భాషను నేర్చుకోనట్లయితే ఆ భాష ఖచ్చితంగా ప్రమాదంలో ఉన్నదని చెప్పవచ్చు. మరి పాత తరం మాత్రమే ఆ భాష మాట్లాడితే ఆ భాష సీరియస్‌గా ప్రమాదంలో ఉన్నట్లే. దీన్ని బట్టి చూస్తే, తెలుగుకు ప్రమాదం పొంచి ఉన్నట్లే. ఎందుకంటే, ఇప్పటి తరం దాదాపు ఇంటికే తెలుగును పరిమితం చేసే స్థితికి వచ్చింది కాబట్టి.**

మాతృభాషలో విద్యాబోధన లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందిన దాఖలాలు లేవంటోంది యునెస్కో. సృజనాత్మకతకు మూలం మాతృభాషలోనే విద్యాబోధన ఉండటం అంటారు అబ్దుల్ కలాం. మాతృ భాషకు దూరమైన వాళ్ళు తమ తమ ఆత్మల నుంచి దూరమైనట్లే అని ప్రసిద్ధ ఆఫ్రికా రచయిత గూగీ వా థియోంగో అన్నాడు.

విదేశాలలో ఉద్యోగం కావాలంటే ఇంగ్లీషు అవసరం కదా అనే వాళ్ళున్నారు. మన శ్రమశక్తిలో వీళ్ళ శాతం ఎంత? వీళ్ళ కోసం మన భాషను నిర్లక్ష్యం చేయడం సబబు కాదు. 2018, జనవరి ఒకటవ తేదీన, ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని, యువతకు సైన్సు మీద ప్రేమ పెంచాలన్నా, సైన్సును ప్రోత్సహించాలన్నా, సైన్సు బోధన మాతృభాషలోనే ఉండాలి అన్నాడు. మరి మెడిసిన్, ఇంజనీరింగ్ లాంటి విషయాలనూ తెలుగులోనే బోధించాలి.

మన దేశంలో దాదాపు రెండు వందల భాషలు ఉన్నాయి. వీటిలో 24 భాషల్ని సాహిత్య అకాడమీ గుర్తించింది. 22 భాషలను రాజ్యాంగంలో పేర్కొన్నారు. భాషల ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడినాయి. కానీ కొన్ని మినహాయింపులున్నాయి. ఇప్పుడు తెలుగు మాట్లాడే రెండు రాష్ట్రాలున్నాయి. బాంగ్లా భాష మాట్లాడేవి కూడా రెండు రాష్ట్రాలున్నాయి–పశ్చిమబెంగాల్, త్రిపుర. ఇక హిందీ మాట్లాడే రాష్ట్రాలు పది దాకా ఉన్నాయి. దాదాపు 60 కోట్ల మంది హిందీ మాట్లాడే వారున్నారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, బీహార్, ఝార్ఖండ్, ఢిల్లీ ఈ రాష్ట్రాల భాష హిందీ. కాని విషాదమేమిటంటే, ప్రజల భాష కాని ఇంగ్లీష్ ఎక్కువ భాగం బోధనా భాషగా, పాలనా భాషగా కొనసాగుతోంది. ఒక లైబ్రరీ భాషగా ఇంగ్లీష్‌ను అభ్యసించవచ్చు. కాని దాని పెత్తనం పనికిరాదు. అందుకే, ఇకనైనా హిందీ, మరియు ఇతర ప్రాంతీయ భాషలు అన్ని స్థాయిల్లోనూ బోధనా భాషలుగా ఎదగాలి. అమలు కావాలి. యూరప్‌లోని హంగేరీ, రుమేనియా దేశాలు మన కోస్తాంధ్రమంతకూడా ఉండవు. కాని హంగేరియన్, రుమేనియన్ భాషలే అక్కడ బోధనా భాషలు, పాలనా భాషలు.

బోధనా మాధ్యమ భాషగా తెలుగు అంటేనే వెంటనే మనల్ని వెంటాడే సమస్య –పదజాల సమస్య. పారిభాషిక పదాలు ఇంగ్లీషులో ఉన్నన్ని తెలుగులో లేవు కదా –ఎలా మరి ఈ సమస్య తీరేది అని ప్రశ్న. తెలుగు అకాడమీ ఈ దిశగా కృషి చేసి వివిధ విజ్ఞాన విషయాలకూ, సామాజిక విషయాలకూ, పాలనకూ సంబంధించిన పదకోశాలు తయారు చేసింది. మామూలుగా అనుకునేది ఏమంటే ఇంగ్లీషులో వుండే పదజాలం కంటే తెలుగు పారిభాషిక పదావళి కష్టతరంగా వుంటోంది అని. కాని పరిశీలిస్తే తేలిందేమిటంటే, తెలుగు పదాలు సులభంగా అవగాహన అవుతాయని, పెద్దగా శ్రమపడాల్సిన అవసరం లేకుండానే. ఆ మధ్య నేను భౌతిక శాస్త్రం, వైద్య విద్యకు సంబంధించిన కొన్ని పదాలు–ఇంగ్లీషులో వుండేవే, వాటి సమానార్థక తెలుగు పదాలూ చూశా. ఈ ఉదాహరణలు చూస్తే ఏవి సులభమో కాదో మీకు తెలుస్తుంది. నేను చూసిన ఈ పదాలలో కొన్ని Monoplegia అంటే ఏకపార్శ్వపక్షవాతం, Arteriosclerosis అంటే ధమని కాఠిన్యం, optical pyrometer అంటే ప్రకాశతాప మాపకము. (మాపకము అంటే కొలిచేది అని అర్థం). eachymosis అంటే చర్మంలోకి రక్తస్రావం, sinistrality అంటే ఎడమ చేతివాటం, sphygmomanometre అంటే రక్తపీడనమాపకం,varicosity of veins అంటే సిరల మెలికలు. ఇప్పుడు తెలిసింది కదూ తెలుగు పదావళి ఎంత సరళమో. కొన్ని తెలుగు సమానార్థకాలు కఠినంగా వుంటే వుండొచ్చు. అలవాటు పడితే అవీ సులభమవుతాయి.

ఇక హిందీ సంగతి. కొన్ని పదుల సంవత్సరాల క్రితమే హిందీలో వివిధ విజ్ఞాన శాస్త్రాల, సామాజిక శాస్త్రాల పదకోశాల నిర్మాణానికై వివిధ పదకోశ సమితులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆ కమిటీలు పలుసార్లు సమావేశమై ఒక్కో పదం ఏఏ భాషలో ఎలా వ్యవహరిస్తారో పరిశీలించి ఎక్కువ భాషల్లో వచ్చిన పదాన్ని ఎంపిక చేసి స్థిరీకరించారు. దేశవ్యాప్తంగా తమిళనాడు, పుదుచ్చేరిలను మినహాయించి మిగతా రాష్ట్రాలన్నింటికీ దాదాపు ఒకే పదావళిని నిర్ధారించారు.

భారతీయ భాషల్లో వివిధ విషయాలపై తగినన్ని గ్రంథాలు లేకపోవడం ఒక సమస్య. పుస్తక ప్రచురణ బాధ్యత వివిధ విశ్వ విద్యాలయాల కర్తవ్యం కావాలి. ద్రావిడ విశ్వ విద్యాలయం వారూ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం వారూ ఈ దిశగా కొంత కృషి చేశారు. కాని ఇది చాలదు. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం పెద్ద సంఖ్యలో ప్రతి సంవత్సరం ప్రామాణిక పుస్తకాలు ప్రచురిస్తోంది. మన విశ్వ విద్యాలయాలు దానితో పోటీ పడాలి. అనువాదాల్లో కాదు, మౌలిక గ్రంథాల ప్రచురణను పెద్ద ఎత్తున చేపట్టాలి. హిందీ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు చొరవ తీసుకొని రాష్ట్ర స్థాయిలో హిందీ గ్రంథ అకాడమీలు స్థాపించారు. అవి క్రియాశీలముగా వుంటూ అనేక గ్రంథాల ప్రచురణ

# చట్టబద్ధత కల్పిస్తేనే 'తెలుగు'కు ప్రాధికారత

## మైదుకూరు -తెలుగు భాషాదినోత్సవ సభలో తవ్వా ఓబుల్‌రెడ్డి




మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని, అయితే ఆ సంస్థకు చట్టబద్దత కల్పించినప్పుడే తెలుగు భాష పరిరక్షణకు అవకాశం కలుగుతుందని తెలుగు సమాజం అధ్యక్షుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు, రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు.

మైదుకూరులోని ఇందిరమ్మ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.నారాయణ రెడ్డి అధ్యక్షతన సాయంత్రం జరిగిన తెలుగు భాషాదినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తూ 40వ నెంబరు జి.ఒ. జారీ అయినప్పటికీ, ఈ ఉత్తర్వులపై శాసనసభలో చట్టం చేసినప్పుడు మాత్రమే ఉత్తర్వులో పొందుపరచిన విధివిధానాలు సంపూర్ణంగా అమలయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టి.మహానందప్ప, ధర్మిశెట్టి రమణ, ఉపాధ్యాయులు వై. అంకన్న, కె.జె. సుబ్బిరెడ్డి, ఎల్. లక్ష్మీనారాయణరెడ్డి, ఏ.బేబిమాలిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పిల్లలకు వక్తృత్వ పోటీలు జరిపి విజేతలకు బహుమతులు ఇచ్చారు. పద్యపఠనం, కథారచన పోటీలో అఖిల్, ఇబ్రహీం, హరికృష్ణ, గురులక్ష్మి, సానియా, పోలిమ్మ, హరీశ్వర్, సనా, మహేశ్, సలీం అనే విద్యార్థులకు పెద్ద బాలశిక్షలు, పద్య పుస్తకాలు, 'బాల భారతం' మాస పత్రికలు అందజేశారు.

చేశాయి. తెలుగు రాష్ట్రాల్లో వివిధ విషయాలపై వందల సంఖ్యలో తెలుగులో పుస్తకాలు రావల్సి వుంది. పాఠ్య పుస్తకాలతోపాటు అనేక రెఫరెన్స్ పుస్తకాలు తెలుగులో ప్రచురించాలి.

బోధనా భాషగా తెలుగు నత్తనడకే నడుస్తోంది. 1976లో ఉస్మానియా విశ్వ విద్యాలయం స్నాతకోత్తర స్థాయిలో సమాధానాలు తెలుగులో రాయడానికి అనుమతి ఇచ్చింది. ఈ స్థితి హిందీ రాష్ట్రాల్లో 1965-66లోనే వుంది. నేను ఎమ్.ఏ. చదివిన అలాహాబాద్ విశ్వ విద్యాలయం 1965-66లో లెక్చరర్లు హిందీ లేక ఇంగ్లీషులో బోధించేవారు. విద్యార్థులు సమాధానాలు హిందీ లేక ఆంగ్లంలో రాసేవారు. ఇక్కడా ఆ వెసులుబాటు కల్పించవచ్చు.

దేశభక్తికి ఒక నిదర్శనం మన భాషల్ని మనం ప్రేమించడం, అభివృద్ధి చేయ సంకల్పించడం. తెలుగును రక్షించండి అనే నినాదం చాలదు. **ఇప్పుడు మన నినాదం కావాల్సింది. అన్ని స్థాయిల్లోనూ తెలుగును బోధనా భాషగా చేయండి. ఇంగ్లీషును ఐచ్ఛికం చేయండి. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉద్యోగాలివ్వడంలో ప్రాధాన్యత కల్పించండి. ప్రతి విశ్వ విద్యాలయంలో ఓ అనువాద నిలయం ఏర్పాటు చేయండి, అని.**

ఈ సందర్భంగా మిగతా దేశాల్లో స్థితి ఏమిటో తెలుసుకోవడం అవసరం. చైనా భాష అతి క్లిష్టమైన భాష. ప్రతి అక్షరమూ ఒక చిత్రం. ప్రతి చిత్రమూ ఒక పదం. మరి అక్కడ అన్ని స్థాయిల్లోనూ బోధనాభాష చైనా భాషయే. రష్యాలో మన సంస్కృతంలాంటి కఠినమైన రష్యను భాష బోధనాభాష. పోలెండ్ ఓ చిన్నదేశం. అక్కడ బోధనాభాష పోలిష్ భాషయే. జర్మనీలో జర్మన్‌భాషే బోధనాభాష ఇంగ్లీష్ కాదు.


'గీతాంజలి' ఆంగ్లానువాదానికి నోబెల్ బహుమతి పొందిన మన రవీంద్రుడు అన్ని స్థాయిల్లోనూ బోధనా మాధ్యమంగా ప్రాంతీయ భాషలే ఉండాలన్నాడు. ఠాకూర్ ఆశయం వాస్తవమవుతుందని ఆశిద్దాం.

(విశాలాంధ్ర దినపత్రిక సౌజన్యంతో...)

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

కీ.శే. 'కళాప్రపూర్ణ' వావిలాల గోపాలకృష్ణయ్య

# పరిపాలనా భాష : వాడుక భాష



"స్వరాజ్యం కావాలంటున్నాము, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం చిక్కుపడుతున్నాము. ప్రజాస్వామిక పరిపాలనకోసం కోరుతున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు – సామాన్య జనులకు ఏ భాష ద్వారా జ్ఞానం కలుగజేయవలసి వుంటుందో, ఏ భాషలో గ్రంథ రచన సాగించవలసి వుంటుందో ఆలోచించండి" అంటూ తమ తుది సందేశంలో కళా ప్రపూర్ణ గిడుగు వెంకటరామమూర్తిగారు 40 సంవత్సరాల క్రితం 15-1-40లో తెలుగు ప్రజలను హెచ్చరించారు.

నేడో 1980వ సంవత్సరం. 1947లో స్వరాజ్యం సాధించాం. 1953లో ఆంధ్ర రాష్ట్రం సాధించాం. 1956 లో విశాలాంధ్రే సాధించాం. 1955లో తెలుగును అధికార భాషగా అమలు జరపవలెనని ఆంధ్ర శాసన సభ ఆదేశించింది. తెలుగును అధికార భాషగా 1966లో శాసనం ద్వారా నిర్ణయించడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు తెలుగును అధికార భాషగా అమలు జరపవలెనని, ఇంగ్లీషు అమలు జరపరాదని, తాలూకా స్థాయిలో 1967- 74ల్లో, జిల్లా స్థాయిలో 1975లో సచివాలయంలోని అధికార భాషా, విద్యాశాఖ విభాగంలో 1976లో, రాష్ట్రంలోని అన్ని శాఖల డైరెక్టరేటుల్లో 1976 లోను, ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది.

ఆంధ్ర విశ్వ విద్యా పరిషత్తు, 1926లో యేర్పడినపుడే బోధన, పరీక్షలు తెలుగులో జరపవలెనని 1925లో శాసనం ఆదేశించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ భాషను బోధనా పరీక్ష భాషగా అమలు జరిపారు కాని ఆంధ్ర విశ్వవిద్యా పరిషత్తులో తటపటాయింపులు జరిగినవి.

అంత వరకు 10 వ తరగతి వరకు బోధనా భాషగా తెలుగు ఉండగా 1969లో భారతదేశంలో అన్ని రాష్ట్రాలకన్నా భాషలకన్నా ముందుగా ఇంటర్ తరగతులలో, డిగ్రీ తరగతులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు బోధనా భాషగా సాగించింది. తెలుగు బోధనా భాషగా చదివిన వారికి 1976లో నుండి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ కమీషన్ పరీక్షలలో ప్రతి పరీక్షా పత్రానికి అయిదు (5) మార్కులు అదనంగా యివ్వడానికి ఏర్పాటు కూడా చేయబడింది.

ఇంత వరకు తెలుగు సాహిత్యభాషగా బోధింపబడుతున్నది. భాషా బోధనలో పాఠ్యం, అపాఠ్యం అని రెండు వర్గాలుగా బోధింపబడుతున్నది. ఇంటర్, డిగ్రీ తరగతులలో తెలుగు బోధనా భాష చేయడంతో ఆ తరగతులలో అన్ని పాఠ్యాంశాలకు వివిధ పాఠ్యగ్రంథాలు అవసరం అయ్యాయి. వాటిలో రచనలు ప్రచురణలు నిర్వహించుటను తెలుగు అకాడమీకి అప్పగించడం జరిగింది. ఆ పై తరగతులలో అంటే పట్టభద్రానంతర తరగతులలో తెలుగు బోధనా భాషగా చేయనందున అంత వరకు చదివిన విద్యార్థులు తెలుగును భాష నుండి పట్టభద్రానంతర తరగతుల చదువులకు ఎగిరి ఇంగ్లీషులో దూక వలసి వచ్చింది. మరల ఇంగ్లీషు ప్రారంభించక తప్పని స్థితి ఏర్పడింది. దాని ఫలితంగా తెలుగు బోధనా భాషగా తీసుకొనుటలో మందకొడితనం ఏర్పడింది. అందుకు కారణంగా ఆ తరగతులకు తగిన పాఠ్య పుస్తకాలు తెలుగులో లేకపోవడం కారణం అయింది.

దేశభాషలకు ప్రాధాన్యం ఇవ్వవలెననే ఆందోళన ఫలితంగా వివిధ రాష్ట్రాలలో ఆయా భాషలు అధికార భాషలుగా (నామమాత్రంగానే అయినా) అమలు జరపడం వల్ల కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఉద్యోగాలకు జరిపే పరీక్షలు కేంద్ర పబ్లిక్ సర్వీసెస్ కమీషన్ వారు రాజ్యాంగంలో ఉదహరించిన వివిధ భాషలలో బోధన...ప్రశ్నా పత్రాలు...జవాబులు వ్రాయటానికి అంగీకరించడంతో యు.జి.సి. వారు శ్రీ సతీష్ చంద్ర అధ్యక్షతన యేర్పాటు చేసిన కమిటీవారి సిఫారసు మేర ఈ 1980వ సంవత్సరం మార్చి 22-25 తేదీలలో శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో తిరుపతిలో తెలుగు పరిశోధనా విధానాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. తెలుగు ప్రజ్ఞావంతులు హాజరయినారు. తెలుగుభాషలో పట్టభద్రానంతర తరగతులలో పరిశోధనకు కావలసిన పాఠ్య గ్రంథాలు ఇతర సారస్వతం సిద్ధం చేయటానికి సూచనలు -ప్రణాళికలు తయారు చేశారు.

తెలుగు బోధనా భాషగా గాని, లేక పరిపాలనా భాషగా గాని అమలు జరపవలెనని కోరితే అందుకు పదజాలం లేదని సాకు చెప్తుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పారసీకులు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు, పోర్చుగీసులు ఆధునిక యుగంలో పరిపాలన సాగించారు. పారశీకుల

భాషలలోని పదాలు కొన్ని తెలుగులో కలిసిపోయినవి; కొన్ని మిగిలిపోయినవి. వాటిని ఆచరణలోగాని, ప్రజాసామాన్యంలోగాని, అన్యభాషా పదాలుగా తలంచడమే లేదు. బాధ లేదు. డచ్చి, ఫ్రెంచి, పోర్చుగీసు పదాలు వాటి ప్రభావాన్ని కోల్పోయినవి. ఇక ఇంగ్లీషు పదాలు – తెలుగు వాటి స్థానంలో వచ్చినవి కొన్ని, లేక స్వయంగా అమలులోకి వచ్చినవి కొన్ని, అంటే యంత్ర యుగం వల్ల, పరిపాలన ప్రభావం వల్ల సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం వల్ల ప్రత్యామ్నాయాలు సాధించడంలో ఫలితం లేనివి కొన్ని ఉన్నవి. వాటిని అన్నింటిని యధాతధంగా తీసుకోవడంలో ప్రమాదం లేదు. అయితే మన అజ్ఞానం, తెలియనితనం వల్ల తెలుగులో వున్న పదాలు తెలియక తెలుగులో అసలు పదాలు లేవు గనుక, ప్రత్యామ్నాయ పదాలు లభించవు గనుక ఇంగ్లీషు పదాలు యధాతధంగా వాడుదామంటే మన అజ్ఞానాన్ని బయట పెట్టుకోవడమే గాక, అంతకన్నా భాషకు తీరని అపకారం చేసినవారం అవుతాం. కార్పెంటరు, ఎస్టిమేటు, రైలు, రేడియో వంటివి. కార్పెంటరు – వడ్రంగి, ఎస్టిమేటు, అంచనా, అని వున్నవి కదా! ఇక రైలు, రేడియో యధాతధంగా వాడడమే శ్రేష్టం. వడ్రంగిని కార్పెంటరుగా వాడితే రెండు మూడు తరాలలో అసలు తెలుగు పదాలు మరుగుపడి మరచి పోవడమే జరుగుతుంది. మరుగుపడితే ఇక భాషకు వ్యక్తిత్వం ఎక్కడి నుండి మిగులుతుంది! ఇక సంస్కృతం. తెలుగులో సంస్కృతం 50 శాతం కలిసి పోయిందని తలుస్తున్నాం. అయితే మాలపల్లిలాంటి రచనలలో గ్రామ జీవితాన్ని ప్రతిబింబించే వృత్తి పదాలు, సాంకేతిక పదాలు, గ్రామ జీవనంలో వాడిన పదాలు సేకరించి వాడుకోవచ్చు. అయితే అసలు సంస్కృత పదాలు తద్భవాలు, తత్సమాలు, దేశ్యాలు లేనపుడు వాడుకోక తప్పదు. అప్పటి కవి చెప్పినట్లు –

"కేశవ, యాంధ్రులు నానా దేశం
బుల యందు నిలిచి వెలుగుత త్త
ద్దేశోక్తులంటి బలికిన నా శబ్దము
లన్య దేశ్య జాంధ్రములయ్యెన్"

కావచ్చు. అన్ని భాషలలోని పదాలు తీసుకుందాం. భాష సజీవంగా వుండడానికి ఆదాన ప్రదానం తప్పదు కాని వాటికి ప్రత్యామ్నాయాలు తెలుగులో లేనపుడే తీసుకోవచ్చు.

అయితే తెలుగు పదాలు ఎక్కడ వున్నవి? అంటారా – ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ మున్నగు భాషల ప్రభావం వల్ల తెలుగు తెలియని, తెలిసికొనని వారి నుండి తీసుకోవడం నిష్ప్రయోజనం. ఈ ప్రభావాలల్లో వ్యక్తిత్వం కోల్పోని, కలుషితంగాని, గ్రామ జీవనం వృత్తులలోని నిత్య వ్యవహారాలలో, గృహ నిర్వహణలో, గ్రామ ప్రాంతంలో సాహిత్యభాషకన్నా జీవభాషలో లభిస్తవి. ఆ పదజాలం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలోని వివిధ గ్రామాలలో వివిధ వృత్తులవారి నుండి వివిధ పదాల నుండి వారు వాడే పదజాలం సేకరించాలి. పదానికి వాడిక తగిలే నిఘంటువుకు చేరుతుంది. రోజులు గడిచి, నిఘంటువుకు కూడా అందకుండా మరుగునపడిపోవాలి. మరుగునపడిపోతే భాష కృత్రిమ భాష అవుతుంది. ఈ పద సేకరణకు విశ్వవిద్యాలయాలు, అకాడమీలు, విద్యాశాఖవారు, వివిధ వృత్తులవారు, వివిధ ప్రాంతాల నానుడులుగల గ్రంథ సముదాయాల నుండి సేకరించాలి. ముఖ్యంగా ఈనాడు వయోజన విద్యా ప్రచారం విరివిగా సాగిస్తున్న ఈ సమయంలో వ్రాతరాదు గాని ఆయా ప్రాంతాలలోని అన్ని పదాలు వయోజనులకు సుపరిచితమే. మనం వారికి అక్షరం నేర్పితే వారి నుండి ప్రతి వయోజన విద్యా బోధకుడు ప్రాంతీయ పదాలు సేకరించవచ్చు. అందువల్ల భాషను వివిధ ప్రాంతాల పదజాలాన్ని సంపాదించడం జరుగుతుంది. వీటిని ఒకచోట చేర్చినచో ఒక్కొక్క పదానికి ఏఏ ప్రాంతంలో ఏఏ విధంగా పలుకుతారో ఒక్కొక్క వస్తువును, ఒక్కొక్క ప్రక్రియను ఒక్కొక్క నామ వాచకానికి ఎవరెవరు ఏ విధంగా పదాలు వాడతారో తెలియడం వివిధ పదజాల పర్యాయ పదాలు సేకరించి భాషను సంపన్నం చేయడం జరుగుతుంది. మాండలికాలు ప్రాంతీయాలు, అప్పుడప్పుడు ప్రకటింపబడుతున్న వాటిని గ్రంథస్థం చేయడం ప్రయోజనకారి కాగలదు.

గతంలో 1930లలో శ్రీ దిగవల్లి వెంకట శివరావుగారు ప్రప్రథమంగా 'పారిభాషిక పదకోశం' ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు వృత్తి పదకోశం మూడు సంపుటాలుగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమీషను 1974 నుండి కొన్ని శాఖల పారిభాషిక పదాల పత్రికలు ప్రకటించారు. 20000 పదాల పదకోశం తయారు చేయడం ప్రారంభించారు. అది ఏ దశలో వుందో తెలియదు. 1975లో జరిగిన వార్షికోత్సవ సందర్భంగా చేసిన నా అభ్యర్థనను మన్నించి తెలుగు అకాడమీ పరిపాలన పదకోశం మూడు సంపుటాలలో తయారు చేశారు. విజ్ఞుల పరిశీలనలో వుంది. విజ్ఞాన శాస్త్ర పద సూచనలు కొన్ని యిదివరలో ప్రకటించారు. ఈ ప్రయత్నం నిరంతరంగా పలు ముఖాలుగా సాగుతూండడం ఎంతయినా అవసరం.

దేశభాష ద్వారా విద్య బోధిస్తేనే గాని ప్రయోజనం లేదు. శిష్టజన వ్యవహారిక భాష జీవంతో కళకళలాడుతుంటుంది. వ్యావహారిక భాష గ్రంథ రచనకు, బోధనకు పరీక్షలకు, పరిపాలనకు ఉపయోగపడదంటూ అందుకు మాండలికాలను చూపుతారు. శ్రీ పోరంకి దక్షిణామూర్తి కోస్తా, రాయలసీమ, తెలంగాణా మాండలికాలను, వాటి ఒక్కొక్క మాండలిక భాషలో ఒక్కొక్క పుస్తకం వ్రాశారు. అవి ఆ ప్రాంతం వారికే సుబోధనం అవుతవి కాని ఇతరులకు కాజాలవు. అన్నింటిని కలిపినపుడు అందరికి కొంత వరకన్నా అర్థమవుతవి. ఇతర ప్రాంతాల వారికి ధారాళంగా సాగడం లేదంటారు. నిజం. వాడుక భాష ఒక మండలంలో ఒకటిగానూ, మరొక మండలంలో మరొక విధంగానూ వుంటుంది అందుకు మార్గం ఏమిటి? తమ మండలంలో వున్న మాటలు, లేక ఇతర మండలంలోని మాటలు వాడదామంటారా! ఈ మాటలలో వేటిని వాడమంటారు? రెండూ వాడవద్దు, వివాదం లేకుండా పోతుంది పరభాష వాడుదామంటారా? అందుకు ఎవరూ అంగీకరించరు కదా!

వ్యావహారిక భాష అంటే గ్రామ్యమనే అపప్రథ ఒకటి వుంది. గ్రామ్య శబ్దము, పారిభాషిక శబ్దము. పామరుల భాష గ్రామ్యమని, లక్షణ విరుద్ధమయిన భాష గ్రామ్యమని, తెలుగు పండితులంటారు. ఏ అర్థంలో చూచినా మనం వాడే వ్యావహారిక శబ్దం గ్రామ్యం కాదు అని గిడుగువారు అన్నారు. మన ప్రాచీన కావ్యభాష వైదిక భాష వంటిది. వ్యావహారిక భాష లౌకిక భాష వంటిది. మాండలిక శబ్దాలు వ్యావహారిక భాష ప్రయోజనానికి ప్రతిబంధకం కాదని కూడా గిడుగు వారంటున్నారు. ఎవరి వాడుకలో వున్న శబ్దాలు వారు ప్రయోగిస్తారు.

భాష నాలుగు రకాలు 1) మాట్లాడరు కాని వ్రాస్తారు. అది గ్రాంథికం. 2) మాట్లాడువారు వ్రాస్తారు. అది శిష్ట వ్యావహారికం 3)

మాటాడుటకే కాని వ్రాయరు– ఇది గ్రామ్యం 4) మాట్లాడరు – రాయరు దీన్ని ప్రచ్ఛన్న గ్రాంథికం అంటారు మొదటిది మాట్లాడరు కాని వ్రాస్తారు కనుక బోధనలో చాలా కష్టం అవుతుంది. సంభాషణలో కూడా ఉపయోగ పడదు. ఇది గ్రాంథిక భాష. గ్రంథాలలో వుంటే చదువుకొనుటకు ఉపయోగ పడవచ్చు. రెండవది, శిష్ట వ్యావహారికం. దీనిలో మాట్లాడువారు వ్రాస్తారు. వ్రాయవచ్చు. దీనినే పాఠ్య పుస్తకాలలోనూ పరిపాలనలో ఉపయోగించవచ్చు. సుబోధకంగా వుంటుంది. పరస్పరం మాట్లాడుకోవటంలో హెచ్చు తగ్గులుగాని, స్థాయిలో తేడాగాని వుండదు. వ్రాయడం కూడా సులువుగా వుంటుంది. మూడవది గ్రామ్యం. ఇది కొన్ని ప్రాంతాలలో అది స్థానికంగా, చిన్నచిన్న సమూహాలలో మాత్రమే ఉపయోగింపబడుతుంది. వ్యాప్త పరిమితి తక్కువగా వుంటుంది. దీనికి ఆ చిన్న సామూహిక విలువను మించి సామాజిక విలువగాని, ప్రయోజనంగాని, సామాజిక గౌరవంగాని వుండదు. ఇక నాల్గవది సరళ నామక గ్రాంథికం. వ్రాసేది కాదు మాట్లాడేది కాదు. ఉంటే కొద్దిమంది మధ్యలో ఉండవచ్చు. సామాజిక ప్రయోజనం కన్పించదు.

వీటిలో సామాజికంగా ఆలోచించినా ఆదాన ప్రధానంగా ఆలోచించినా శిష్ట వ్యావహారికమే గణనీయం. దీనిని ఆధునిక ప్రమాణీకరణ భాషగా మన్నించ వలసి ఉంది. భాష ఒకే పద్ధతిలో స్థిరంగా వుండడం కష్టం. సమాజం ఎంత వేగంగా ప్రగతికిగాని, దత్తానికిగాని పరుగులెత్తుతుందో అంత తీవ్రతతో మనిషి వెంట ఛాయ పరుగెత్తినట్లు పరువెత్తుతుంది. 1900 నుండి ప్రతి దశాబ్దంలోను భాష పరిణతి చెందుతూ వుంది. ఆనాటి పత్రికా రచనలు ఆనాటి నుండి ఆధునిక రచనల్లో సాగుతున్న పత్రికలేమి, రచనలేమి, పుస్తకాలేమి తులనాత్మకంగా పరిశీలన చేస్తే, ఎంతో తేడా కన్పిస్తుంది. అనుభవం చెప్పాలెనంటె నా రచనలలోనే కనిపిస్తుంది. అవ్యక్తంగా అనుభవిస్తున్నాను. ఈ ఎనుబది సంవత్సరాలలో పత్రికలోని భాష, సామాన్య జనంలోని యాస, పదజాలం, శబ్ద ఉచ్చారణ, వివిధ ప్రాంతాలను బట్టి మారడమేకాక వివిధ కాలాలనుబట్టి కూడా మారుతూన్నది. వివిధ భాషల పరిచయాల వల్ల వివిధ దేశాల సంస్కృతులు జీవనం మిళితం అవడం వల్ల నూతన వ్యక్తిత్వం ప్రస్ఫుటంగా ప్రతిబింబించుతుంది. ఈ పరిణామాన్ని సామాజిక స్పృహ అనవచ్చు. దీని ఫలితాలు కలిగించే కృషిని సామాజిక చైతన్యం అనవచ్చు. ఈ పరిణామాన్ని పరిశీలించి ఆధునిక ప్రమాణభాషను శిష్ట వ్యవహారాన్ని నిరూపణ చేయడమేగాక, రచనలు సాగించవలెననే కృషిని స్పష్టీకరించుటకు శ్రీ గ్విన్ సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. వారు ఈ కృషి సాధించుటకు తెలుగు అకాడమీని యేర్పాటు చేయవలెనని సిఫారసు చేశారు. కాని తెలుగు బోధనా భాషగా అమలు జరుపుటకు కావలసిన పాఠ్య పుస్తకాల రచన, ప్రచురణలో తెలుగు అకాడమీ నిమగ్నమై పోవడం వల్ల ఈ కృషి వెనుకబడి పోయింది. దీనిని వెంటనే సాగించడం అత్యవసరం.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు అకడమిక్ కౌన్సిలులో కళా ప్రపూర్ణ పురిపండా అప్పలస్వామిగారు "ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగులో పిహెచ్‌డిపై సమర్పించే పరిశోధనా వ్యాసాలు వ్యావహారిక భాషలో కూడా రాయవచ్చునని ; ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అన్ని స్థాయిలలోను తెలుగు పరీక్షా పత్రాలకు సమాధానాలు వ్యావహారిక భాషలో వ్రాయవచ్చునని; అన్ని తరగతులకు పాఠ్య పుస్తకాలుగా వ్యావహారిక భాషలో వున్న గ్రంథాలు కూడా నిర్ణయించవచ్చునని ప్రతిపాదించిన" తీర్మానం దీర్ఘ చర్చానంతరం వైస్ ఛాన్సలరు శ్రీ యం.ఆర్.అప్పారావు అధ్యక్షతన ఒక కమిటీని నియమించారు. ఈ సంఘం 5-7-73న తమ నివేదిక సమర్పిస్తూ, శిష్ట వ్యావహారిక భాషను అమలు జరపవలసిందిగా సిఫారసు చేశారు. శ్రీ గ్విన్ కమిటీ కళాశాల తరగతులలోని పాఠ్య గ్రంథాలలో ఉపయోగించే భాష, ప్రజాస్వామిక పరిపాలనా నిర్వహణలో ఉపయోగించే భాష ఆధునిక ప్రమాణ భాషగా వుండవలెనని చేసిన నిర్ధారణ కలిసి వీరిరువురు సిఫారసులు ఒక ప్రమాణాన్ని అందుకున్నవి. తెలుగు ఆధునికంగా ప్రమాణీకరించవలెనన్నారు. ప్రమాణిక భాష శిష్ట వ్యవహారికం అన్నారు.

ఇపుడా సంధియుగలో వున్నాం. ఆధునిక విజ్ఞానంలో, న్యాయ శాస్త్ర పాలనలో, శాసన నిర్మాణ పరిభాషలో, సాంకేతిక పరిభాషలో, వ్యాపార వాణిజ్యరంగంలో, శాస్త్ర విజ్ఞానంలో , బోధనలో, నిత్య పరిపాలనలో, విధిలేక వాడవలసి వచ్చిన అన్య భాషా పదాలు, వాడకంలో మినహా వాక్య నిర్మాణంలో, విషయ వివరణలో, శిష్ట వ్యవహారిక భాషను అమలు జరపడం అవసరం అని తేలుతున్నది. అందుకు విద్యాశాలల్లో చదివే పుస్తకాలు, అందులో ఉపయోగించే భాష శబ్దాలు, వాటిని అన్వయించుకొని వ్రాసే ప్రశ్నా పత్రాలు, ఆ ప్రశ్నా పత్రాలకు వ్రాసే జవాబులు, పరిశోధన వ్యాసాలు ఏ భాషలో వుండేవో ఎంత సహజంగా వుండేవో ఎంత సులభ బోధకంగా వుండేవో ఎంత అర్థవంతంగా వుండేవో ఎంత సృజనాత్మకంగా వుండేవో, ఆ ప్రాతిపదిక విద్యాబోధనలో సాధన మాత్రంగా ప్రాతిపదిక యేర్పడాలి.

అధికార భాష అమలు జరుపుటకు తగిన ప్రాతిపదిక పాఠశాలల్లో కళాశాలల్లో తరిఫీదు యివ్వాలి. అధికారభాషగా అమలు జరుపుటకు తెలుగు బోధింపబడి ఉండాలి. కోర్టులలో, సచివాలయాలలో వాణిజ్య రంగంలో, సాంకేతిక రంగంలో, విజ్ఞాన శాస్త్ర రంగాలలో, శాసన రచనా రంగంలో, అధికార భాషగా తెలుగు అమలు జరుపుటకు అనువగు భాషాజ్ఞానం, పదజాలం, రచనా సామర్థ్యం, భాషా, పుష్టి, సృజనాత్మక రచనా పాటవం అలవడి ఉండాలి.


భాషా భేషజాలకు పోకుండా సామాన్య జనానికి వారి సమస్యలకు, వ్యక్తులను, వారివారి సాంస్కృతిక స్థాయికి అందుబాటులో వుండగల భాష సంభాషణలో, రచనలో, ఉత్తరాలలో, ఉత్తరువులలో అందించాలి. పరిపాలనా భాష ప్రజల భాషలోనే కాకుండా ప్రజలకు అర్థమయ్యే విధంగా అందుబాటులో వుండాలి. అందుబాటులో వున్నదనే విశ్వాసాన్ని కలిగించాలి. ఈ వాడిన శబ్దాలు మఘలో పుట్టి పుబ్బలో పోయినదన్నట్లు కాకుండా నిరంతరం ధారావాహికంగా ప్రవహించే భాషా స్రవంతిలో నాల్గు కాలాల పాటు నిలువ తొక్కుకొని భాషను, భావాన్ని మరో తరానికి అందివ్వాలి. అందుకు శిష్ట వ్యవహారిక భాషా అనుసరణయే శరణం. (9-4-80)

---

కీ.శే. వావిలాల గోపాలకృష్ణయ్యగారు శాసనసభ్యులుగా, అధికార భాషా కమిషన్ అధ్యక్షుడుగా పనిచేసిన 'ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు 1980లో – విశాఖపట్టణంలో ఏప్రిల్ 26, 27 లలో జరిగిన 'వాడుక భాషా సదస్సు'లో సమర్పించిన పత్రం ఇది. దీనిని 'అభ్యుదయ' మాసపత్రికనుండి స్వీకరించాము. – సంపాదకుడు

వీవెన్
9963029061

# తెలుగు భాషకు ఆధునిక హోదా-8



## తెలుగు భాషకు మూలస్తంభాలు

**చెట్టు ఎంత ఎత్తుకి ఎదగాలంటే దాని వేర్లు అంత లోతుకి, బలంగా భూమి లోనికి చొచ్చుకుపోవాలి. ఎంత అందమైన భవనమైనా బలమైన పునాది మీదే నిలబడగలుగుతుంది. అదేవిధంగా భాష, దానికి ఆధునిక హోదా అనే హంగూ లోతైన బలమైన మూలస్తంభాలమీదే నిలబడగలవు. ఏ భాషకైనా ఆ భాషలో మాట్లాడేవారు, ఆ భాష నిత్యవాడుకలే పునాది. ఆ పునాది మీద భాషా భవంతి నిలబడటానికి నాలుగు మూలస్తంభాలు కూడా ఉండాలి. అలాంటి మూలస్తంభాలు ఏవిటన్నది ఈ వ్యాసంలో తరచిచూద్దాం.**

### 1. పదనిధి

లోకంలో ఎవడైనా ఎప్పుడైనా తెలుగులో మాట్లాడిన, వ్రాసిన మాటలన్నీ ఒక దగ్గర చేరిస్తే ఈ పదనిధి తయారవుతుంది. దీనికి స్థల, కాల పరిధులు ఏమీ ఉండకూడదు. దీనిలో కేవలం మాటలే కాకుండా వాటిని ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా వాడారో కూడా వీలైనంతమేరకు సందర్భసహితంగా ఉంటుంది. పుస్తకాలు, పత్రికలు, రేడియోలు, సినిమాలు, టీవీలు, వెబ్‌సైట్లు, యూట్యూబ్ వీడియోలు, బహిరంగంగా అందుబాటులో ఉన్న వ్యక్తుల లేఖలు, సంభాషణలు, ఇలా దీనిలో ఇండెక్సు కానిది ఏదీ ఉండదు.

18వ శతాబ్దంలో నిర్మాణరంగంలో వాడిన మాటలేమిటి అని ఈ పదనిధిని అడగవచ్చు. ఆపై వచ్చిన ఫలితాలను కేవలం పద్యకావ్యాలకు పరిమితం చెయ్యమని లేదా రాయలసీమ ప్రాంతానికి పరిమితం చేయమని కూడా అడగవచ్చు. ఒక మాట ఇంకా ఏయే మాటలతో కలిపి వాడుకలతో ఉందో అడగవచ్చు. ఉదాహరణకు, "బంగారం" అని అడిగితే, కాకి బంగారం, కొంగు బంగారం, నల్ల బంగారం, మొదలైన ఫలితాలను చూపిస్తూ అవి ఎంత విస్తృతమైన, పరిమితమైన వాడుకలో ఉందో కూడా తెలియజేస్తుంది.

ఇలాంటి పదనిధి ఒకటి ఉంటే భాష స్వరూపాన్నీ, పరిణామాన్నీ, స్థల-కాల మితుల్లో సమగ్రంగా తెలుసుకోవచ్చు. కాలానుగుణంగా వచ్చిన మార్పులు, లేదా ప్రాంతీయంగా చోటుచేసుకున్న మార్పులు లేదా ఏదైనా రంగంలో భాష/మాటల మార్పులు గమనించవచ్చు. భాషా శాస్త్రవేత్తలకు, నైఘంటికులకు ఇది గొప్పవరం అవుతుంది.

తెలుగులో సమగ్రమైన మాటదిద్దరి (స్పెల్ చెకర్) కావాలన్నా, వ్యాకరణ దిద్దరి కావాలన్నా ఇలాంటి పదనిధి అత్యవసరం. అప్పటికప్పుడు తెలుగులో ఒక యాస నుండి మరొక యాస లోనికి, మాండలికం లోనికి మార్చిచెప్పే 'మాండలిక పరివర్తనం' వంటి అనువర్తనాలకూ ఇలాంటి పదనిధే ఆధారం. తెలుగు "కృత్రిమ మేధ" తయారీకి ఇదే తొలిమెట్టు అవుతుంది.

ఎంతటి సమాచారాన్నైనా నిల్వ చేసుకోగలిగే వీలు, దాన్ని మధించే, శోధించే, విశ్లేషించే సంగణన శక్తి (కంప్యూటింగ్ పవర్) కూడా లభ్యమవుతున్న ఈరోజుల్లో ఇలాంటి పదనిధి తయారీ సాధ్యమే!

### 2. సమగ్ర, నిత్యనవీకృత నిఘంటువు

మాటలు, వాటి రూపాలు, అర్థాలు, వ్యుత్పత్తి, వాడుకలతో సహా తెలియజేసే నిఘంటువు ఒకటి ఉండాలి. ఉదాహరణ వాక్యాలు, బొమ్మలూ, ఆడియో, వీడియోలు కూడా తగిన మాటలకు ఉండాలి. కొత్త మాటలు, కొత్త వాడుకలు దీనిలోకి ఎప్పుడూ చేరుతూ ఉండాలి.

ఈ సమగ్ర నిఘంటువు ప్రధానంగా రచయితలకు, సంపాదకులకు, భాషా పరిశోధకులకు, భాషావేత్తలకు ఉపయోగపడుతుంది. జనబాహుళ్యానికి వీలుగా దీని సంక్షిప్తరూపం అందుబాటులో ఉండొచ్చు. లేదా దీన్నుండి ఒక్కో రంగానికి ప్రత్యేకించి, లేదా ఒక్కో ప్రాంతానికి, మాండలికానికి ప్రత్యేకించి పిల్ల నిఘంటువులను తయారుచేసుకోవాలి.

పైన చెప్పిన పదనిధి ఉంటే, ఈ సమగ్ర తెలుగు నిఘంటువు తయారీకి కావలసిన ముడిసరుకు ఉన్నట్టే.

### 3. తెలుగు నేర్పే వనరులు

వివిధ భాషల వారికి, వివిధ స్థాయిల్లో తెలుగు నేర్పడానికి (వారంతటవారు నేర్చుకోడానికీ) పలు రకాలైన వనరులు అందుబాటులో ఉండాలి. అక్షరాలు వ్రాయడం నేర్పేవి, మాటలను నేర్పేవీ, వాక్యాలు వ్రాయడం నేర్పేవి, మాట్లాడటం నేర్పేవీ ఇలా అన్ని రకాలూ వివిధ రూపాల్లో (అంటే పుస్తకాలు, వెబ్‌సైట్లు, ఆటలు, వీడియోలు, కంప్యూటర్ ఉపకరణాలు, మొబైలు అనువర్తనాలు, గట్రా) లభ్యమవాలి.

వివిధ రంగాలకు సంబంధించి ఆయా రంగాల్లో తెలుగు వాడకానికి సూచనలు, వివరణలతో మార్గదర్శినులు కూడా ఉండాలి.

### 4. తెలుగులో విజ్ఞాన సర్వస్వం

ఈ లోకం లోని సమస్త విజ్ఞానమూ తెలుగులో లభ్యమవాలి. అది వ్రాయడానికి ప్రతీ రంగంలోనూ నిష్ణాతులైన తెలుగువారు ముందుకురావాలి. అందువల్ల వివిధ భావనలనూ, ఆలోచనలనూ తెలుగులో వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తాం. తద్వారా ఎటువంటి భావాన్నైనా, మాటలలో వ్యక్తపరచగలిగే శక్తి భాషకు సమకూరుతుంది. సమస్తమూ తెలుగు లోనే ఉన్నప్పుడు (ఎప్పటికప్పుడు కొత్త విషయాలు, సమాచారమూ అందుబాటు లోనికి వస్తున్నప్పుడు) జనబాహుళ్యం పరభాషలపై

సేవకు గుర్తింపు

# సన్నిధానం నరసింహశర్మకు పాతూరి పురస్కారం



ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమ నాయకులు 'కళా ప్రపూర్ణ' పాతూరి నాగభూషణం 111 వ జయంతి సందర్భంగా పాతూరి పురస్కారం

రాజమండ్రిలోని ప్రసిద్ధ గౌతమీ గ్రంథాలయానికి పూర్వ గ్రంథపాలకుడు రచయిత, కవి సన్నిధానం నరసింహశర్మగారికి అందజేశారు. ప్రదాన సభ అగస్టు 20వ తేదీ సాయంత్రం 6 గం.లకు విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరిగింది.

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ అధ్యక్షులు కె. చంద్రశేఖర కల్కూర సమావేశమునకు అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ శాసన సభా ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, ఆం.ప్ర. గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు దాసరి రాజామాస్టారు ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఆం.ప్ర. గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు, బండారు హనుమంతరావు పాల్గొన్నారు. కవి, విమర్శకులు పన్నాల సుబ్రహ్మణ్యభట్టు సన్మాన గ్రహీతను పరిచయం చేశారు.

కల్కూరా తమ ప్రసంగంలో ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమాన్ని ప్రభావితం చేసిన త్రిమూర్తులలో పాతూరి నాగభూషణంగారు ఒకరని, అయ్యంకివారి వారసులుగా ఆయన గ్రంథాలయోద్యమాన్ని బహుముఖాలుగా విస్తరింపజేశారని, వారి పేరుతో యిస్తున్న పురస్కారానికి సరైనటువంటి వ్యక్తిని ఎంపిక చేయటం పట్ల హర్షం వెలిబుచ్చారు.

మండలి బుద్ధప్రసాద్ తన ప్రసంగంలో అయ్యంకి, వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణంగార్ల జీవనశైలి, గ్రంథాలయ రంగానికి వారు అందించిన సేవలు తనకు చిన్ననాటి నుండి తెలుసునని అంటూ, పాతూరి పురస్కారం అందుకొనుటకు సన్నిధానం నరసింహశర్మ అన్ని విధాల అర్హులని అన్నారు. నరసింహశర్మ గౌతమీ గ్రంథాలయానికి పర్యాయపదంగా నిలిచారని, తన అపారమైన మేధస్సుతో పాఠకులు కోరిన సమాచారం లక్షలాది గ్రంథాలలో ఏ పుస్తకంలో లభిస్తుందో తెలిపి, దానిని వెంటనే అందజేయటం వారి నిత్యకృత్యమని, అందుకు తానే సాక్షినన్నారు. అంతేకాక యీ గ్రంథాలయాన్ని సాహిత్య, సాంస్కృతిక కేంద్రం తీర్చిదిద్దటమేగాక, పండితులు మేధావుల నిలయంగా మార్చటానికి కృషి చేశారన్నారు.

అనంతరం సన్నిధానం వారిని ప్రత్యేక ఆసనంపై ఆశీనులనుచేసి శాలువ, నూతన ఖద్దరు వస్త్రాలు, ఫల పుష్పాదులతో అతిధులు ఘనంగాసత్కరించి పురస్కార జ్ఞాపిక, సన్మాన పత్రాన్ని అందించారు.

పాతూరి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద తన స్వాగతోపన్యాసంలో ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమాన్ని స్థూలంగా వివరిస్తూ, పాతూరి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద తన స్వాగతోపన్యాసంలో ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమాన్ని స్థూలంగా వివరిస్తూ, పాతూరి నాగభూషణంగారి శతజయంతి అనంతరం గ్రంథాలయ, వయోజన విద్యారంగాలకు విశిష్టమైన సేవలను చేసినవారిని గుర్తించి, గత 10 సం.లుగా పాతూరివారి పేర పురస్కారాలను అందిస్తున్నామని, పాతూరి వారికి అత్యంత ప్రీతిపాత్రుడు మాత్రమేగాక వారి భావాలను, సేవలను పుణికి పుచ్చుకున్న నరసింహశర్మగారిని ఎంపిక చేయటం తమకు సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.

పురస్కారాన్ని స్వీకరించిన తర్వాత సన్నిధానం నరసింహశర్మ మాట్లాడుతూ పెద్దల సాంగత్యంతో తాను తెలుసుకున్న విషయాలతోపాటు, పాతూరి వారి శిష్యరికంలో వారికి గ్రంథాలయాలపట్ల నిబద్ధత, నిరాడంబరత, తపన ప్రత్యక్షంగా చూశానని, తనపై వారి 'ప్రభావం ఉన్నదంటూ యీ పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

---

ఆధారపడాల్సిన పరిస్థితి ఉండదు. ఆయా రంగాల్లో నిపుణులు మాత్రం బహుభాషా వ్యవహర్తలయితే సరిపోతుంది.

తెలుగులో మౌలిక, ప్రాథమిక పరిశోధనలు జరగాలి. వేరే చోట్ల జరిగిన వాటి గురించిన సమాచారమూ తెలుగు లోనికి వస్తూండాలి. వివిధ రంగాలకు సంబంధించి సైద్ధాంతిక ప్రతిపాదనలూ, వాటిపై చర్చోపచర్చలూ తెలుగులో జరుగుతూండాలి.

తెలుగులో విజ్ఞాన సర్వస్వాల, సంగ్రహాల నిర్మాణానికి గతంలో కృషి జరిగింది. అది కొనసాగాలి. తెలుగు వికీపీడియా విస్తృతి లోనూ నాణ్యత లోనూ క్రమేపీ మెరుగవుతోంది. దీనిలో మన పాల్గోలు ఇంకా చాలా పెరగాల్సివుంది. వికీపీడియాలోని సమాచారం వాడుకునేవారు ఉన్నారు గానీ, దానిలో మనందరమూ వ్రాయవచ్చు అన్న స్పృహ అంతగా లేదు.

పై మూలస్తంభాల పరిధి విస్తృతమైనది. ఇందుకు మనం సాంప్రదాయ పద్ధతులను మాత్రమే నమ్ముకోలేము. ఇంత ప్రాముఖ్యత ఉన్న ఈ మూలస్తంభాల తయారీ ప్రయత్నాన్ని కేవలం అకాడమీలకో, ప్రభుత్వం మీదనో, లేదా మరో సంస్థకో వదిలివేయలేము. తెలుగు వారందరూ లేదా కనీసం వీటిపై ఉత్సాహం చూపించేవారు, ఆయా సంస్థలు ఈ ప్రయత్నంలో పాలుపంచుకునేలా, లేదా దీనికి తోడ్పడేలా ఉండే సమీకృత, సహకార నమూనాను రూపొందించుకోవాలి. ఈ మూలస్తంభాల తయారీకి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, పనిముట్లను ఒడుపుగా, నేర్పుగా వాడుకోగలగాలి



Unfiled Notes Page 26

భాషోద్యమ కథానిక

సంకేపల్లి నాగేంద్రశర్మ,
సెల్ : 9441797650.

# ఓ నిరుద్యోగి ఆక్రందన



రాజశేఖర్ తన బతుకుచక్రాన్ని సరి దిద్దుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నాడు. తరతరాల నుండి చేనేతకు కేంద్రమైన సిరిసిల్లాలో తన బతుకు ఇకనైనా చిగురుస్తుందని ఆశపడ్డాడు. మూడు దశాబ్దాల తరబడి కొనసాగుతున్న చేనేత కార్మికుల ఆకలికేకలు, ఆత్మహత్యలు ఆగి పోతాయని అనుకున్నాడు. తెలంగాణా వచ్చి నాలుగేళ్ళు గడిచినా, తన నిరుద్యోగం తనకే ఒక సవాలై పోతుందని, తన మాతృభాషే తనకు ఆజన్మ శత్రువై పోతుందని, తన బతుకు అవిటిదై, బతుకు జట్కా బండి ఇక ఎలా ముందుకు నడవాలన్న ఆందోళనలో వున్నాడు. శిశిరాలు వచ్చి పోతున్నా, ఆ తదుపరి తన జీవితంలో వచ్చే జీవన వసంతాల్ని సరిగా చూడలేక పోతున్నాడు. కార్తీక పున్నమి వెన్నెలలు కురుస్తున్నా, తనకెపుడూ చంద్రగ్రహణాలు ఎదురవుతుంటాయని, పాముల తలకాయలు అడ్డువస్తూ, నోరు తెరచి మింగేస్తుంటాయని కలలోనైనా ఊహించుకోలేదు. ఎన్నాళ్ళు ప్రయివేట్ టీచర్ గా అరకొర జీతంతో సంసారం నడుపుకోవాలని తెలియక సతమతమై పోతున్నాడు. తనకు ఆంగ్లం అనర్గళంగా రావడం వల్ల, తనను పరీక్షించి, మరీ ప్రయివేట్లో టీచర్ నౌకరీ ఇచ్చారు. తన బతుకును సరిదిద్దే ప్రభుత్వ ఉద్యోగం అందని పండై పోతుండటం పట్ల, కలవరంతో వున్నాడు. తన భార్యా, ఇద్దరు పిల్లల ఆలనాపాలనా, సంసారం, వారి భవిష్యత్తు ఏమిటని తనలో తాను ప్రశ్నించుకుంటున్నాడు. రాత్రుల వేళల్లో ఇంటి వద్ద నిద్రలో పలుసార్లు ఆందోళనతో కలవరింతలకు గురవుతున్నాడు. భార్యాపిల్లలు, తన బంధువులు, తన వైఖరిని చూసి లబోదిబోమంటున్నారు.

ఒకసారి తన జీవితాన్ని వెనక్కి మళ్ళించుకున్నాడు. 14 ఏళ్ళ తెలంగాణా ఉద్యమంలో

మాతృభాషైన తెలుగులో చదివినవారు ఇంగ్లీష్లో అనర్గళంగా మాట్లాడినా, బోధించే సత్తావున్నా తాను అయోగ్యుడినని ఎలా మచ్చ వేస్తారని పాలకవ్యవస్థను సూటిగా ప్రశ్నించాడు. తీరా పరిశీలిస్తే, రాజశేఖర్ వాదన, సమాధానం లేని అరణ్యరోదనై పోయింది. అయినా వెగటు చెందక, తన ఉద్యమ సత్తాను మళ్ళీ చూపాలనుకున్నాడు. విశ్రాంత ఉద్యోగులను, తెలుగుపండితులను, రచయితలు, కళాకారులను కలిసి, ఉద్యమించాలని గట్టినిర్ణయం తీసుకున్నాడు.

చురుకుగా పాల్గొన్నాడు. లేలేత యువకుడిగా ఆకులో ఆకునై, మొగ్గలో మొగ్గయి, తెలంగాణా ఉద్యమానికి తన సర్వస్వాన్ని ధారపోశాడు. తనకు వచ్చే బంగారు భవిష్యత్తుకై బంగారు తెలంగాణా వాకిలి తెరిచి వుంటుందని కలలు కన్నాడు. ఛలో హైదరాబాద్, రోడ్ల పైన వంటా వార్పు, నగరంలో ధర్నా, రైల్ రోకో, బస్రోకో, రాస్తారోకో, సాగర హారం, చలో హైదరాబాద్, చలో వరంగల్, పట్టణ బంద్‌ల వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడు. 53రోజులు జరిగిన సకల జనుల సమ్మెలో అన్నీ తానై, తానే అన్నయి పాల్గొన్నాడు. ఉద్యమ కాలంలో తానే అన్నిటికి ముందు నిలిచి, నాలుగైదు సార్లు అరెస్టు కూడా అయ్యాడు. పోలీసులచే లాఠీదెబ్బల రుచి కూడా చూశాడు. హైదరాబాద్, కరీంనగర్‌లో జెఎసి ఆధ్వర్యంలో జరిగిన భారీ బహిరంగసభల్లో పాల్గొని, స్ఫూర్తి పొందాడు. ఎంతోమంది తన సహచరులను వెంట తీసు కెళ్ళి, ఉద్యమాన్ని తీవ్ర తరం చేయడంలో తన వంతు పాత్రను బేష్గా పోషించాడు. తాను దాచు కున్న చిన్నమొత్తాల డబ్బును ఉద్యమం కోసం సైతం ధారపోశాడు. ఇప్పుడు తనకు 32ఏళ్ళ వయస్సు దాటిపోతున్నది. వయస్సు రోజు రోజుకు ముదిరిపోతున్నది. బిసి బి కావడం వల్ల, తనకు మరో ఐదేళ్ళపాటు ఉద్యోగావకాశాలుం టాయి. ఈలోగానైనా, తన బండి చక్రాన్ని సరి చేసుకోవాలని అనుకున్నాడు. ఇంటర్, బిఎల తోపాటు, ఎంఎ హిస్టరీ తెలుగులో కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కాలేజీ నుండి పూర్తిచేశాడు. అన్నింటిలోను మెరిట్ మార్కులు పొంది, మొదటి శ్రేణిలో నిలిచాడు. తన తెలుగు మాధ్యమ సత్తాను రుజువుచేసుకున్నాడు. చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా తనను కాదని ఎవ్వరికీ ఇవ్వరన్న ఆశలో వున్నాడు. తన తల్లితండ్రులు సాధారణ చేనేత కుటుంబం నుండి వచ్చిన వారైనా, కూలీలుగా మారి, తన చదువులు అతి కష్టంగా పూర్తికావడానికి వారు తమ కాల్ రెక్కలను ధారపోశారు. అర్ధాకలి తోనైనా బాధపడుతూ, చెమటోడ్చి చదివించారు. తన చదువుకు, తన చెల్లెలు లలిత చదువుకు ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా, ఉన్నత చదువులు పూర్తిచేయించారు. ఈలోగా రాజశేఖర్ పెళ్లి సజావుగానే జరిగిపోయింది. చెల్లెలి పెళ్లి కూడా ఒక చేనేత కుటుంబానికి చెందిన ఒక ఆసామితో జరిగిపోయింది. అతను జోళ్ళ (పవర్ లూమ్స్) కార్ఖానాను కొంత పెట్టుబడి వెచ్చించి, సొంతంగా చూసుకుంటున్నాడు. పీజి అనంతరం తదుపరి భువనగిరి కళాశాలలో బిఇడి కూడా రాజశేఖర్ పూర్తిచేశాడు. తన చదువులన్నీ తెలుగు మాధ్యమంలోనే, విజయవంతంగా పూర్తిచేశాడు.

2009లో అప్పటి కేంద్ర దేశీయాంగ మంత్రి చిదంబరం తెలంగాణా ఇస్తున్నట్లు ప్రకటించి, తర్వాత వెనక్కి తీసుకున్నాడు. తర్వాత తిరిగి ఉద్యమం ఉధృతమై, తెలంగాణా వచ్చే దాకా, పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందే దాకా, రావణకాష్టంలాగా కొనసాగింది. రాజశేఖర్ చలో అసెంబ్లీ, చలో పార్లమెంట్ పిలుపుకు కూడా స్పందించి, ఢిల్లీకి వెళ్ళాడు. ఉత్తేజిత ప్రసంగాలను, పాటలను విని తెలంగాణ తల్లి విముక్తి కావాలని, కోటి దేవతలకు మొక్కుకున్నాడు. వేములవాడ జనదైవం రాజేశునికి వంద కొబ్బరికాయలు కొడతానని మొక్కు మొక్కాడు. నూల పున్నమి నాడు వేయి మందికి తెలంగాణ తల్లి రాఖీలను కట్టి తన తెలంగాణా ఉద్యమాభిమానాన్ని వ్యక్తం చేసుకున్నాడు. ప్రత్యేక తెలంగాణా ఏర్పడ్డాక, భారీగా వివిధ ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలు వెల్లువలా వస్తాయని సగటు తెలంగాణా నిరుద్యోగ విద్యావంతుడైన జీవిగా ఆశపడ్డాడు. బంగారు కలలు గన్నాడు. జిల్లాల వారీగా నైనా, ఖాళీలుగా వున్న వందలాది టీచర్ల పోస్టులైనా భర్తీ చేస్తారని కలలుగన్నాడు.

అందులోనైనా తాను ఒక టీచర్ ఉద్యోగం చిక్కి, హాయిగా వెళ్ళిపోతానని అనుకున్నాడు. కేసీఆర్ అయితే తాము అధికారంలోకి వస్తే, కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యనందిస్తానని, ఖాళీలుగా వున్న మూడు నాలుగు లక్షల పోస్టులను భర్తీ చేస్తామన్న హామీని పదేపదే గుర్తు చేసుకుంటున్నాడు. ఉద్యోగాల భర్తీకి ఎంత బడ్జెటైనా ఖర్చు పెడతామని హామిల వర్షం కురిపించారు. పసందైన తెలంగాణా యాసలో, భాషలో మాట్లాడి సభికుల నుండి చప్పట్ల దుప్పట్లు అందుకున్నాడు. తెలంగాణా భాషకి తెలంగాణా ప్రజలు పలు చోట్ల జరిగిన ఎన్నికల సభల్లో బ్రహ్మరథం పట్టారు. అధికారంలోకి తెచ్చారు. వాడెవడయా, వీడెవడయా, వాని అమ్మ సొమ్మా, అయ్య సొత్తా అంటూ దండి దండిగా డైలాగులు కొడుతుంటే, చప్పట్లేచప్పట్లు జడివానై కురిసాయి. తెలంగాణా భాషలోనే సిలబస్ ఉండి, వాచకాలుంటాయని, పాలన కూడా తెలంగాణా భాషలోనే వుంటుందని హామీల పూల వర్షం కురిపించాడు. ఉరూరా తిరుగుతూ, అమరవీరులకు పిడికిలి బిగించి, తెలంగాణ తల్లికి ఉద్యమ నీరాజనాలను అర్పించాడు. తెలంగాణా ప్రజల బతుకులన్నీ, పసుపుపచ్చని పూల తంగేడులై, పూ బంతులై తెలంగాణ తల్లికి పూలదండలై పోతాయని అన్నాడు. వాడవాడనా, ఉరూరా తెలంగాణా తల్లుల విగ్రహాల ప్రతిష్టలు, చాకలి ఐలమ్మవిగ్రహాల ప్రతిష్టలు, భారీ బహిరంగసభలు వేడుకగా, పోటా పోటీగా జరిగాయి. బోనాలు, బతుకమ్మలకైతే విరామం లేకుండా ఆడపడుచులు నీరాజనాలు పట్టారు. చివర బ్రహ్మాస్త్రంగా కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్షలు ఫలించి, కేంద్రం దిగిరాక తప్పలేదు.

తాను, తనతోపాటైన సహచరులు బాలాజీ, శచీందర్, మునీశ్వర్, ప్రభాకర్, ఆనంద్, రుషీకేష్, విశ్వ, కైలాస్, ధీరజ్, వసంత, అరుణ, సాగర్, ప్రమీల, ప్రేమల, సబీనా, సరళ, మాధురీ, క్రిస్టినా, జమీల వంటి వారికి సైతం ఉద్యోగాలు రావచ్చునని తెలంగాణా విద్యార్థి ఉద్యమ జీవైన రాజశేఖర్ ఆశపడ్డాడు. కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీలలో జరిగిన జెఎసి విద్యార్థి సంఘ ఉద్యమ ర్యాలీలలో, బహిరంగసభల్లో సైతం పాల్గొని, ఉత్తేజం పొందాడు. ఉస్మానియాలో విద్యార్థి నాయకుడు కాలిబూడిదై పోయిన అమరజీవి శ్రీకాంతాచారికి నీరాజనాలర్పించాడు.

తెలంగాణా వచ్చింది, నాలుగేళ్ళు గడిచి పోయాయి. జిల్లాల విభజన జరిగి, కొత్త జిల్లాలు వచ్చాయి. బంగారు తెలంగాణాను సాధించడానికి కృషి చేస్తున్నట్లు, నాటి ఉద్యమనేత కేసీఆర్ నేడు ముఖ్యమంత్రి హోదాలో పదే పదే అంటున్నాడు. తెలంగాణా చిన్న బిడ్డ, దాన్ని అభివృద్ధి చేయడానికి తగిన సమయం కావాలి అని అంటున్నాడు. ఉద్యమకాలపు నేతలు కొందరు, కేసీఆర్ మంత్రి వర్గంలో మంత్రులుగా కనబడుతున్నారు. బుగ్గకారుల్లో తిరుగుతూ, పరిపాలనలో ప్రధాన భాగస్వాములుగా కనబడుతున్నారు. కొందరు నేతలు, రచయితలు

వాడని భాష వాడిపోతుంది...భాష నశిస్తే జాతి నశిస్తుంది.

వివిధ హోదాల్లో ప్రభుత్వ రంగంలో చైర్మన్లుగా పనిచేస్తున్నారు. తెలంగాణా రాష్ట్రంలో జరిగే అధికారిక సభల్లో, సమావేశాల్లో వీరే ఎక్కువగా కనబడుతున్నారు. తెలంగాణా ఇస్తం తెస్తమన్న వివిధ పార్టీల నాయకుల ముఖాలు కళతప్పి, గుట్టకోడు, చెట్టుకోడు లాగా పట్టుకోల్పోయి, అవతారాలు మారిపోయినట్లుగా, పొద్దుతిరుగని పువ్వులాగా ముఖాలు మాడ్చుకొని కనబడుతున్నారు. గాడెవడు, గీడెవరురా అన్న భైసాబ్ల ఇషాబులన్నీ కల్లబొల్లి కబుర్లయి పోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో డా.వైఎస్సార్ ముఖ్యమంత్రిగా వున్న కాలంలో కేంద్ర ప్రభుత్వ గ్రాంటులతో ఏర్పాటైన మండలానికో మాడల్ స్కూల్ వంటి విద్యాసంస్థలు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ వంటి గురుకుల విద్యాసంస్థలు బలోపేతమై పసందుగా కనిపిస్తున్నాయి. అట్టడుగు, బలహీన వర్గాల వారి పిల్లలతో కళకళలాడుతున్నాయి. బ్రిడ్జి స్కూళ్ళయితే, ఏకంగా కస్తూరిబా స్కూళ్ళయి పోయి, అవి నేడు జూనియర్ కాలేజీల స్థాయి దాకా ఎదిగిపోయాయి. ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, హైస్కూల్ వంటి విద్యాసంస్థలలో పిల్లలు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. తెలుగులో బోధించే ఉపాధ్యాయులు, ప్రయివేట్ సెక్టర్ పాఠశాలల్లాగా ఆంగ్లంలోనే బోధిస్తూ, తమ ఉద్యోగాలను కాపాడుకుంటున్నారు. రేషనలైజేషన్ గండం నుండి బయట పడాలని చూస్తున్నారు. కార్పోరేట్, ప్రయివేట్ రంగంలోని ఇంటర్ కోర్సుగల జూనియర్ కాలేజీలు తెలంగాణా వచ్చాక, మరింతగా శోభాయమానంగా వెలిగిపోతున్నాయి. పాలకులను మచ్చిక చేసుకొని, తమ సంస్థల్ని సజావుగానే నడుపుకుంటున్నారు. కార్పోరేట్ చేతి వాటం పోతుందన్న వాదనలు, పుకార్లకి తెగబడ్డాయి. కార్పోరేట్ విద్యాసంస్థల్లో సంస్కృతం బదులు తెలుగు సబ్జక్టు పెడదామని జోరుగా ప్రచారాలు చేసి జీవోలు తెచ్చిన పాలకులు, ఆచరణ సాధ్యం కాదని చేతులెత్తేశారు. రాజశేఖర్ వివిధ ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో పడిన సుమారు రెండువేల పోస్టుల భర్తీకోసం పడిన ప్రకటనలు చూసి, ఉబ్బి తబ్బిబ్బయి పోయాడు. తన చేదు బతుకు బంగారు బిస్కట్ గా మారి పోతుందని, జుంటి తేనెలు ఇహ తాగవచ్చునని అనుకున్నాడు. అమావాస్య చీకట్లో వెన్నెలలు కురిసే పున్నమి పండుగ వేళలు వచ్చాయని అనుకున్నాడు. ఈనాలుగేళ్ళలో, మరో ఆరు వందల గురుకుల పాఠశాలలు వెలిసాయి. ఇందులోని పోస్టులన్నీ కాంట్రాక్టు పద్ధతిన భర్తీచేస్తారని ప్రకటనలు ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలలో తెలుగు మాతృభాషగా పెద్దపీట వేస్తారన్న ఆశతో రాజశేఖర్ తెలుగుమీడియంలోనే తన పిజి వరకు కోర్సులు పూర్తి చేశాడు. మాతృభాషకు పొరుగున వున్న తమిళం, కన్నడ, కేరళ వంటి రాష్ట్రాలలో ఐదు మార్కులు ఎక్కువగా ప్రోత్సాహకంగా ఇచ్చి, ఉద్యోగాల భర్తీలో అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిసి మురిసిపోయాడు. ప్రాచీన హోదా తెలుగుకు రావడానికి మద్రాస్ కేసులో వేసిన తమిళుల వ్యాజ్యం వీగిపోయిందని తెలిసి మరింతగా ఆనందించాడు. దానికి తెలంగాణా ప్రభుత్వమే ముందుపడి వకీళ్ళను నియమించి, తగిన కృషి చేసిందని తెలిసి మరీ సంతోషపడ్డాడు.

జిల్లా వారీగానైనా డిఎస్సీల ద్వారానైనా పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. తీరా ప్రకటనలు చూశాక రాజశేఖర్ నోరు వెళ్ళబెట్టాడు. డిగ్రీలో ఆంగ్లమీడియంలోనే చదివిన అభ్యర్థులే దరఖాస్తులు చేసుకోవాలన్న కఠినమైన షరతును ఒకటి విధించారు. గురుకులాల్లో కేజీ నుండి పీజీ వరకు ఆంగ్లంలోనే బోధించాలట. అలాగే మాతృభాషైన తెలుగులో మాట్లాడితే, పంతుళ్ళకు, విద్యార్థులపైన కఠిన శిక్షలు, జరిమానాలు వుంటాయని, ఆయా విద్యాసంస్థల బాధ్యులు చెబుతున్నారు. రాజశేఖర్ తన మాతృభాష తెలుగు మాధ్యమంలో చదవడం పెద్ద తప్పిదంగా భావించుకున్నాడు. తాను పీజీలో ఆంగ్లమీడియంలో చదివినా, ఆ టీచర్ల పోస్టుల భర్తీకి తాను యోగ్యుడ్ని కాదని తెలుసుకున్నాడు. మాతృభాషైన తెలుగుకు తెలుగు రాష్ట్రంలో ఉద్యోగ యోగం లేకపోవడం విచిత్రమైన గడ్డు పరిస్థితి కాదాయని తర్కించుకున్నాడు. డిసెంబర్ లో జరిగిన ప్రపంచ మహాసభల్లో ఒక రచయితగా పాల్గొని వచ్చి, మాతృభాషైన తెలుగు మీద మరింత అభిమానం పెంచుకున్నాడు. తీరా ఉద్యోగ ప్రకటనలు చూసిన రాజశేఖర్‌కు మతి తప్పిపోయింది. ఏం చేయాలో పాలుపోక నోరెళ్ళపెట్టుకున్నాడు. తెలుగుగడ్డమీద, తెలంగాణా గడ్డమీద తెలుగు భాషకు పట్టిన దుర్గతిపై, తన అయోగ్యతపై తనకు తానే నిందించుకున్నాడు. పాలకుల తీరు చూసి కుంగిపోయాడు. తెలంగాణ తల్లికి, భాషకి నీరాజనం పట్టించేలా చేయాలని, నిఖార్సైన తెలుగు భాషోద్యమానికి తెరలేపాలని నిర్ణయించుకున్నాడు.

మాతృభాషైన తెలుగులో చదివిన వారు ఇంగ్లీష్లో అనర్గళంగా మాట్లాడినా, బోధించే సత్తావున్నా తాను అయోగ్యుడినని ఎలా మచ్చ వేస్తారని పాలకవ్యవస్థను సూటిగా ప్రశ్నించాడు. తీరా పరిశీలిస్తే, రాజశేఖర్ వాదన, సమాధానం లేని అరణ్యరోదనై పోయింది. అయినా వెగటు చెందక, తన ఉద్యమ సత్తాను మళ్ళీ చూపాలనుకున్నాడు. విశ్రాంత ఉద్యోగులను, తెలుగు పండితులను, రచయితలను, కళాకారులను కలిసి, ఉద్యమించాలని గట్టినిర్ణయం తీసుకున్నాడు.

---

**కవిత**

## శబ్దం

శబ్దాలు
వెంటనే నిశ్శబ్దంగా మారిపోతాయి,
అర్థాలు మరణించవు.
సందర్భాలను అతికించుకొని
భావాలై బతుకుతాయి.

శబ్దాలకు ఆశ స్వాభావికం
కలకాలం కోసం
కలలు గంటాయి.
అందుకే
అక్షరాలను ఆశ్రయిస్తాయి.
అక్షరాలు తమ ఒడిలో
వాటిని భద్రపరుస్తాయి.

శబ్దం శబ్దత్వాన్ని కోల్పోవచ్చు
కాని పర్యవసానం వ్యర్థం కాదు
అది అనేక రూపాల్లో అవతరిస్తుంది.
క్రమంగా నిశ్శబ్దమే
మాట్లాడటం ప్రారంభిస్తుంది.

శబ్దం ఒక దీపమైతే
నిశ్శబ్దం దాని వెలుగు.

– డా॥ఎన్.గోపి
9391028496

**ఓట్లు అడిగేది తెలుగులో... ఉత్తర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?**

సందర్భం

వేములపల్లి సత్యవతి
8106705017

# గణనీయుడు తెలుగుబిడ్డ సి.ఆర్.రావు



మహానగరాలన్నీ సముద్రాలకు దగ్గరలో, నదుల తీరాల ప్రక్కన నిర్మించబడినవి. సింధు నాగరికత, సింధునదీ పరీవాహక ప్రాంతాలలో, నిర్మించబడిన నగరాలలో వెల్లివిరిసింది. విజయవాడ కృష్ణానది తీరాన, రాజమహేంద్రవరము గోదావరి తీరాన, కలకత్తా, వారణాసి గంగానది ఒడ్డున, దేశ రాజధాని యమున ప్రక్కన, ముంబయి, మద్రాసు, విశాఖపట్టణం సముద్రాలకు దగ్గరలో ఏర్పడినవి.

విశాఖపట్టణపు ప్రభుత్వ పాఠశాలలో 11 ఏండ్ల బాలుడొకడు చదువుకోవటానికి చేరాడు. తెలుగు బోధించే పంతులుగారు ఆ బాలుడిని వ్యాకరణంలో ప్రశ్న అడిగారు. బాలుడు జవాబు చెప్పలేకపోయాడు. మరో ప్రశ్న అడిగినా జవాబు చెప్పలేదు. పంతులుగారు కోపంతో నీ జీవితంలో 'తెలుగు రాదుపో' అన్నారు. తరగతిలోని పిల్లల ముందు పంతులుగారన్నమాటకు, ఆ బాలుని అభిమానం దెబ్బతింది. అవమానంగా భావించాడు. బడి వదలగానే ఇంటికెళ్లి డబ్బులు తీసుకుని పుస్తకాల దుకాణానికి వెళ్లి, తెలుగు వ్యాకరణం కొని తెచ్చుకున్నాడు. ఆ రాత్రంతా వ్యాకరణం అధ్యయనం చేసి, వ్యాకరణ సూత్రాలను కంఠతాపట్టాడు. మర్నాడు బడికి వెళ్లి ఆ బాలుడు తెలుగు పంతులుగారిని, వ్యాకరణములో ప్రశ్నలడగమన్నాడు. పంతులుగారు ఆశ్చర్యపోయారు. ప్రశ్న తర్వాత ప్రశ్నలడిగారు. అన్నిటికి ఆ బాలుడు ఠకీమని జవాబులు చెప్పాడు. ఆ బాలుడెవరనుకున్నారు! భవిష్యత్తులో, గణిత శాస్త్రవేత్తగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సి.ఆర్.రావుగారు. పూర్తిపేరు కల్యంపూడి రాధాకృష్ణారావు 10– సెప్టెంబర్ – 1920న పుట్టారు. తండ్రి దొరైస్వామినాయుడు. పోలీసు శాఖలో ఉన్నతాధికారి. తల్లి లక్ష్మీకాంతమ్మ. సంపన్న కుటుంబం. వారికి ఎనిమిదవ సంతానం సి.ఆర్.రావు. దొరైస్వామి నాయుడు విశాఖలో పనిచేస్తున్నప్పుడు, పదవీ విరమణ చేసి, అక్కడే స్థిరపడ్డారు. అప్పటికి సి.ఆర్.రావు 11 ఏండ్లవాడు.

ప్రాచీన గణిత శాస్త్రవేత్త భట్నాగర్ పేరున అవార్డు పొందటం భారతీయ గణిత శాస్త్రవేత్తలు గౌరవంగా, గర్వంగా భావిస్తారు. 1962లో జరిగిన చైనా యుద్ధంతో భారత ఆర్థిక వ్యవస్థ కునారిల్లింది. ఆలాంటి సమయంలో సి.ఆర్.రావుగారు 1961 లో ఆనాటి భారత రథసారధి జవహర్‌లాల్ నెహ్రూ చేతులతో భట్నాగర్ అవార్డు అందుకున్నారు. అవార్డుతోపాటు, పదివేల రూపాయల నగదు కూడ ప్రదానం చేశారు. సి.ఆర్.రావుగారు వెంటనే, అక్కడే ఆ నగదును ప్రధాని నిధికి విరాళంగా ఇచ్చివేశారు. ఆ డబ్బు, వ్యక్తిగా నాకంటే, ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశానికి ఎంతో అవసరమని చెప్పారు. మొదటి నుండి గణితంలో సి.ఆర్.రావుగారికి తండ్రి ప్రోత్సాహం అధికంగా వుండేది. ఆంధ్రయూనివర్సిటీలో గణితంలో ఎంఎ పూర్తి చేశారు. పిహెచ్‌డి చేయాలని తలచారు. అప్లికేషన్ ఇవ్వటంలో, గడువుదాటిపోయినందున ప్రిన్సిపాల్‌గారు అప్లికేషన్ తీసుకోవటానికి తిరస్కరించారు. వైస్ ఛాన్సలర్ సి.ఆర్.రెడ్డిగారిని రికమండేషన్ కోసం కలిశారు. రెడ్డిగారేమో ఎక్కడా ఉద్యోగం దొరకనందున, రిసెర్చ్ చేయటానికి వచ్చాడని తలచి సిఫారసు చేయలేదు. ఆ తర్వాత కాలంలో రిసెర్చ్‌లో సీటు ఇవ్వటానికి నిరాకరించిన ఆంధ్ర యూనివర్సిటీయే డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించింది. ఆ సందర్భంలో సి.ఆర్.రావుగారు 'రిసెర్చ్‌లో సీటు ఇవ్వటానికి అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు పళ్లెంలో పెట్టి డాక్టరేట్ అందిస్తున్నారని' చమత్కారంగా చురకలేస్తూ, సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీటు తిరస్కరించిన తర్వాత కోల్‌కతాలో ప్రొఫెసర్ మహాలనోబిన్‌ను కలిశారు. ఆయన ప్రెసిడెన్సి కాలేజీలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. రెండు చిన్నచిన్న గదుల్లో ప్రొఫెసర్ ఒక ఇన్‌స్టిట్యూట్‌ను నిర్వహిస్తున్నారు. లెక్కల యంత్రాలతో, అంకెలతో సాగుతున్న కార్యక్రమాన్ని గమనించి సి.ఆర్.రావుగారు ముగ్ధులయ్యారు. అక్కడ రెండు సంవత్సరాల స్టాటిస్టిక్స్ కోర్సులో చేరి ఎమ్ఏ పూర్తి చేశారు. ఎంఏలో ఆయన పొందిన మార్కులు, ఆరు – ఏడు – దశాబ్దాలు దాటినా ఇప్పటికీ రికార్డుగానే ఉన్నవి. అంటే ఎవరూ ఆయనకన్న ఎక్కువ మార్కులు సాధించలేక పోయారు. మహలనోబిన్ సూచన ప్రకారం ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. తర్వాత కేంబ్రిడ్జినుంచి ఆఫర్ వచ్చినందున వెళ్లి, అక్కడ పిహెచ్‌డి పూర్తి చేసి తిరిగి వచ్చారు. 1922లో మహలనోబిన్ చనిపోయే వరకు ఆయన దగ్గరే పనిచేశారు. 28వ ఏండ్ల వయసులో ప్రొఫెసర్ పదవినలంకరించారు. కొన్ని చేదు అనుభవాలను చవి చూశారు. మేధావులు, శాస్త్రవేత్తలు అమెరికా మొదలగు విదేశాలకు ఎందుకు పోయారో, పోతున్నారో స్వానుభవం వలన తెలుసుకున్నారు.

పదవీ విరమణ గడువు ఒక సంవత్సరం ఉందనగా, ఒక సంవత్సరం కొఱకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమెరికా వెళ్లారు. అమెరికాలోని ఫిట్‌బర్గ్ యూనివర్సిటి, ఉపన్యాసం కొఱకు సి.ఆర్.రావు గారిని ఆహ్వానించింది. ఉపన్యాసం (లెక్చర్) అయిన తర్వాత ముందు వరుసలో కూర్చున్నవారిలో నుంచి ఒక వ్యక్తి లేచి వచ్చి రావుగారితో కరచాలనం చేస్తూ, మా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తారా? అని అడిగారు. అడిగిన వ్యక్తి ఫిట్‌బర్గ్ యూనివర్సిటి డీన్. రావుగారు అవాక్కయి,

వెంటనే తేరుకుని, విజిటర్‌గా మాత్రమే వచ్చానని, తన పిల్లలు ఇండియాలో చదువుకుంటున్నారని చెప్పారు. యూనివర్సిటి డీన్ రావుగారిని వదులుకో తలచలేదు. పిల్లల చదువుకు నష్టం జరగకుండ, ఇండియాలో చదువుతున్న మూడేళ్ల ఇంజనీరింగ్‌కు, క్రెడిట్ యిచ్చి ట్యూషన్ ఫీజు లేకుండ, తమ యూనివర్సిటిలో చేర్చుకుంటామని చెప్పారు. దీనిని బట్టి రావుగారు ఎంత ప్రతిభావంతుడో తేట తెల్లమవుతున్నది. పెరటిలోని చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్టు. భారత్‌లో మన ప్రతిభావంతులను గౌరవించటం, గుర్తించటం జరగలేదు. జరగటం లేదు. తెలుగు వాడైన పావులూరి మల్లన – పద్యాలలో లెక్కలు చెప్పిన గణిత శాస్త్రవేత్త ఉదా :

> "ఖర్జూర ఫలములు గణికుండు కొనితెచ్చి
> సగపాలు మోహంబు సతికి నిచ్చె
> అందు నాల్గవ పాలు అనుగు తమ్మునకిచ్చె
> అష్టభాగంబిచ్చె అనుజ సతికి
> తన తొమ్మిదవ పాలు తన, తనయునకిచ్చె
> తన చేత నాల్గున్న తల్లికిచ్చె
> మొదట తెచ్చినవెన్ని? మోహంబు సతికెన్ని?
> అనుగు తమ్మునకెన్ని? అతని సతికి
> ఎన్ని యిచ్చె? సుతునకెన్నిచ్చె? మరియును
> తల్లికెన్నియిచ్చె? తగ వచింప
> గణిత మెరిగినట్టి కరణాల పిలిపించి
> అడగవలయుదేవ! అవధరింపు.

డీన్‌గారిని, రావుగారు తనకు కొంత సమయమివ్వమని అడిగారు. వారు అంగీకరించారు. ఇండియాలో ఎదుర్కొన్న చేదు అనుభవాలతో, బంధు మిత్రుల, కుటుంబ సభ్యుల వత్తిళ్లతో, మరో ఆలోచనకు చోటివ్వకుండ పిట్స్‌బర్గ్ యూనివర్సిటిలో చేరిపోయారు. పెన్సిల్వేనియాలో కూడ పనిచేసి, అమెరికాలో స్థిరపడినారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి గణాంక శాస్త్రవేత్తలలో సి.ఆర్.రావుగారు ఒకరు. గత నాలుగు వందల సంవత్సరాల చరిత్రలో గణిత శాస్త్ర వికాసానికి, అభివృద్ధికి దోహదం చేసిన (57) యాభై ఏడుమంది ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తలతో యూనివర్సిటి ఆఫ్ టెక్సాస్ ఒక జాబితాను తయారు చేసింది. అందులో ఏకైక భారతీయుడు సి.ఆర్,రావుగారున్నారు. సర్ సి.వి.రామన్, శ్రీనివాస రామానుజన్, హరగోబింద ఖురానా మొదలగువారిని టైమ్స్ ఆఫ్ ఇండియా 1988లో విజ్ఞానానికి సంబంధించిన పదిమందితో కూడిన జాబితాలో ఆ ముగ్గురు భారతీయ శాస్త్రవేత్తల పేరులను పేర్కొన్నది.

2010 అక్టోబర్ 19న హైదరాబాద్‌లోని. హైటెక్ సిటి సమీపంలో ప్రతిష్టాత్మకమయిన 'థర్డ్ వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' మహాసభ జరిగింది. ప్రారంభోత్సవ వేడుకలతో సభ కోలాహలంగా, సందడిగా ఉంది. అప్పటి భారత ప్రధాని మన్‌మోహన్ సింగ్‌ను ముఖ్య అతిధిగా ఆహ్వానించారు. ప్రధాని, ముఖ్యమంత్రి రోశయ్య, గవర్నర్ నరసింహన్‌గారలు, 30 దేశాల నుంచి వచ్చిన 350 మంది విజ్ఞాన శాస్త్రవేత్తలు హాజరయ్యారు. శాస్త్ర విజ్ఞాన ప్రపంచంలో సంచలనాలు సృష్టించి, కొత్త ఆవిష్కరణలు చేసినవారికి ప్రధాని మన్‌మోహన్‌సింగ్ అవార్డులు ప్రదానం చేశారు. కరతాళ ధ్వనులతో సభ మారు మ్రోగింది. 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్' ప్రెసిడెంట్ మాధవన్ నాయర్, మైక్ ముందుకు వచ్చి గణితం, గణాంక శాస్త్రాలలో అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ప్రముఖ శాస్త్రవేత్త సి.ఆర్.రావు, ప్రతిష్టాత్మకమైన 'ఇండియా సైన్స్' అవార్డును అందుకుంటారని ప్రకటించారు. అప్పటికి రావుగారి వయసు 90 సంవత్సరాలు. అంత ముదిమిలోను ఏమాత్రం పట్టు సడలని శరీర ధారుఢ్యంతో, ఆ వృద్ధ శాస్త్రవేత్త అవార్డును స్వీకరించటానికి వేదిక మీదకు వెళుతుంటే చప్పట్లతో ధ్వని, ప్రతిధ్వనించింది. ప్రధాని తానే ముందుకొచ్చి, రావుగారికి అవార్డు అందజేశారు.

రావుగారికి మాతృదేశమన్నా, తెలుగునేల అన్నా అత్యంత ఆప్యాయత, అనురాగం. ఎనలేని గౌరవం. కోల్‌కతాలో ఉన్నంతకాలం తెలుగు అసోసియేషన్‌లో రావుగారిదే ప్రథమ స్థానం. కూచిపూడి నృత్యాన్ని శాస్త్రీయ నృత్యాలలో చేర్చలేదన్న కోపంతో వెంపటి చినసత్యంగారి సారధ్యంలో 'కూచిపూడి డాన్స్ అకాడమీ'ని స్థాపించారు. ఎంతోమంది శిక్షణకు ఆ అకాడమీలో చేరి ఉన్నత శిఖరాలనధిరోహించారు. మీనాక్షి శేషాద్రి ఆ అకాడమీ నృత్యకారిణియే. రావుగారి కుమార్తె తేజస్విని కూడ మంచి నృత్యకారిణిగా పేరుగాంచారు.

తెలుగు గడ్డకు, దానిపైనున్న మమకారంతో ఇంకా ఏమో చేయాలన్న తపన రావుగారిలో ఉండేది. ఆ కారణంగా హైదరాబాద్‌లో గణితం, స్టాటిటిక్స్, కంప్యూటర్లకు సంబంధించిన 'అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పాలన్న సంకల్పం కలిగింది. ప్రయత్నాలు ప్రారంభించారు. అంతకు ముందే చాలా సంవత్సరాలక్రితం ఉస్మానియా యూనివర్సిటీవారు రావుగారిని వారి ఆంగణములోనే అయిదు ఎకరాల స్థలము ఇస్తామని మాట ఇచ్చి ఉన్నారు. దానికి కావలసిన ధనం సేకరించిన తర్వాత మొండి చేయి చూపారు. నేడు ఆ యూనివర్సిటీకి సంబంధించిన ఎన్నెన్నో ఎకరాలు కబ్జాకు గురయినది. పట్టించుకున్న నాథుడు లేడు. యూనివర్సిటి వారు మాట తప్పిన తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటి స్థలం ఇవ్వటానికి ముందుకు వచ్చింది. రావుగారి సంకల్పం, చేస్తున్న ప్రయత్నాలను గురించి విన్న ప్రధాని మన్‌మోహన్ సింగ్ పదిహేను కోట్ల రూపాయలు గ్రాంటు మంజూరు చేశారు. గొప్ప అంతర్జాతీయ సంస్థగా తీర్చి దిద్దాలన్నది రావుగారి తపన. రావుగారి కల సాకారమయింది. భవన నిర్మాణ పనులను రావుగారు దగ్గరుండి పర్యవేక్షించారు. సెంట్రల్ యూనివర్సిటీలో స్థాపించబడిన 'ఇంటర్‌నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ' దగ్గర నుంచి లింగంపల్లిదాకా, సి.ఆర్.రావుగారి మీద, సి.ఆర్.రోడ్ అని పేరు పెట్టబడింది.

(సి.ఆర్.రావు. 98వ పుట్టిన రోజు సందర్భంగా రాసిన వ్యాసం)


## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి'**,
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

రచయిత : కీ.శే.దుర్గానంద్

# శబ్దగాండీవి వేమన



(ఆగస్టు సంచిక తరువాయి)

తిట్టు భాషను వాడటంలో మనమే అగ్రగణ్యులమనుకుంటున్నాము. వేమన తిట్టు శబ్దం ముందు మనమెంత!

*ఎన్ని తపములేడ్చి యెన్ని నోములు నోచి / యెంత కష్టపడిన నేమి ఫలము!*

ఎన్ని తపములేడ్చి అని ఇంత సందర్భోచితంగా తిట్టగల గుండె ధైర్యం మన కుందా! మన తిట్లను ధ్వంసానికి ఉపయోగించుతున్నాము తప్ప నిర్మాణానికి కాదు. కాని వేమన నిగ్రహానుగ్రహ సంపన్నుడు. ఆయన కనుసన్నల్లో సమాజం విలువలు నాట్యం చేస్తుంటాయి. ఆయన నాలుక కొనపై పదాలు చిందులు తొక్కుతుంటాయి. ఆయన తిట్టగలడు, శపించగలడు, అనున యించగలడు, నయ బోధచేయగలడు. గుణ వంతునికి విద్య ఇస్తే అది గోరంతైనా కొండంత అవుతుందట.

*గుణికి విద్య భువిని గోరంత యిచ్చిన / గొండయగును వాని గుణముచేత / కొండ యంత విద్య గుణహీను దెలుగడు.*

మందుడి బుద్ధి మృత్పిండము వంటిదని, కాళిదాసో భవభూతో అన్నారు. కాని ఈ అందము వాళ్లలో రాలేదు.

ధన మదాంధుల్ని గురించి వేమన సన్నిపాత జ్వరగ్రస్తులన్నాడు. ధనికుడు మనం చెప్పేది వింటూ కూడా నోరు విప్పి మాట్లాడడు, విననట్లు ఉంటాడు.

*కనియు గానకుండ కదలింపడా నోరు / వినియు వినకయుండు విస్మయంబు / సంపదగలవాని సన్నిపాతంబిది*

మూడు నాలుగు పరిస్థితుల్ని ఒక్క చోట గ్రుదిగ్రుచ్చి వేమన తన లోకాను భవాన్ని వెల్లడించేటప్పుడు నిజంగా ఆయన కవిత్వ శక్తికి జోహారులర్పింప బుద్ధి పుడు తుంది. ఆయన కొందరితో పలకవద్దన్నాడు. ఎవరు వాళ్లు...

హీన నరులతోడ నింతుల తోడను / పడుచువాండ్రతోడ బ్రభువుతోడ / బ్రాజ్ఞ జనులతోడ బలుకంగ రాదయా!

హీన నరులతో మాట్లాడగూడదట. చెడ్డ వాళ్ల జోలికి పోవద్దంటూ రహీమ్ కుక్క దృష్టాంతం ఇచ్చాడు. కుక్క నాకినా నష్టమే ముద్దు పెట్టుకున్నా నష్టమే అంటాడు. వేమన హీన నరులతో మాట్లాడవద్దని, వెంటనే స్త్రీలతో కూడా మాట్లాడవద్దన్నాడు. ఎక్కడ హీనులు! ఎక్కడ స్త్రీలు! మళ్లీ పడుచు వాండ్రతో కూడా మాట్లాడవద్దు అన్నాడు. రాజులతో కూడా మాట్లాడవద్దు ఎందువల్ల? వీళ్లంతా వివేక శూన్యులు అందువల్ల మాట్లాడవద్దని అని ఉంటాడు. తరువాతి మాట విచిత్రమైంది. ప్రాజ్ఞులతో కూడా మాట్లాడవద్దని అన్నాడు. అక్కడ ఈయన భావం ఎదురు తిరిగింది. పై ముగ్గురుతో మాట్లాడవద్దు అనడం వాళ్ళు ఫూల్సు అని, ప్రాజ్ఞుడితో మాట్లాడవద్దనడం అక్కడ మాట్లాడితే మనం ఫూల్సు అయిపోతామని. లార్డ్ బెర్నార్డుషా దగ్గరకు ఒక సినిమా తార వెళ్ళి మీరు నన్ను పెళ్లి చేసుకోండి మీ తెలివి తేటలూ నా అందం వస్తే పుట్టే పిల్లవాడు ఎంచక్కానో ఉంటాడు అన్నదట. ఆయన వెంటనే మొహం మీద కొట్టినట్టు ఆ పిల్లవాడికి నా అందం వచ్చి నీ తెలివితేటలు వస్తేనో అన్నాడట. ఆ మాటకు ఆవిడ ఫూల్ అయి తిరిగి వచ్చింది. ప్రాజ్ఞులతో ఇందుకనే మాట్లాడగూడదు.

'స్థాన బలిమికాని తన బల్మి కాదయా' అన్నట్టే వేమన 'అనువుగాని చోట అధికుల మనరాదు' అంటున్నాడు. కొంచెముండు టెల్ల కొదువగాదు, కొంచెంలో ఉంటే తప్పే మీ లేదులే. దానికి ఎంత గొప్ప ఉదాహరణ ఇస్తున్నాడో చూడండి. 'కొండ యద్దమందు కొంచెమై యుండదా' అంత పెద్ద కొండా అద్దంలో చూస్తే చాలా చిన్నదిగానే కనిపించుతుంది. ఒకచోటి మన గొప్పతనం రెండవచోట అంత చిన్నదై పోతుంటుంది. ఇలా బాగా జీవితానికి హత్తుకుపోయే మాట లన్నప్పుడు వేమన ఆ స్థితిని అనుభవించా డేమోననిపిస్తుంది. సర్వ సంగ పరిత్యాగియై ఊళ్ళూ ఊళ్ళూ తిరుగు తుండవచ్చు. ఒక చోట గొప్ప ఆదరం లభించి ఉండవచ్చు. వేరొక చోట అమర్యాద కలిగి ఉండవచ్చు.

కోపాన్ని గురించి చెబుతూ – కోపం వల్ల ఘనత తరుగుతుంది. కోపం వల్ల గుణం తరిగి పోతుంది. కోపమునకు బ్రదుకు కొంచెమై పోవును అంటాడు. వేమన దుష్టులను ఎంత తిరస్కరించాడోసజ్జనులను అంతమెచ్చుకున్నాడు. ఖలులు ఒక వేళ మనల్ను తిడితే మన మేమీ అనుకోకూడదు. వాళ్ల తిట్ల వల్ల మనకేమీ తగలదు. కాని సజ్జనుడు తిట్టాడో 'సజ్జనుండు తిట్ట శాపంబదేను' అంటాడు. సజ్జనులకు భయ పడుతూ ఉండాలి. అల్లాఉద్దీను ఖిల్జీలాంటి పరస్త్రీ లోలుడు, దుష్టుడూ అందరికీ మద్య పాన నిషేధం అమలు పరచాడుగాని ప్రాజ్ఞు లకు మాత్రం స్వేచ్ఛ యిచ్చాడు. మూర్ఖులు త్రాగితే లోకానికి అపకారం చేస్తారు, ప్రాజ్ఞులూ కవులు మొదలైనవారికి అది రిలీఫు. తాము ఆరాధించే కళకు కొంత ప్రోద్బలం. కాని వేమన – ఇక్కడ సత్పురుషుల విషయంలో చెబు తున్నాడు. మంచి వాడిని కష్టపెడితే అతని ఉసురు మనకు ఎలాగూ తగులుతుంది.

లోగడ యుద్ధాలు ఒంటిమీద జరుగుతూ ఉండేవి. ఇప్పుడు నీళ్లమీదా ఆకాశం మీదా జరుగుతున్నాయి. ఒంటిమీద శస్త్రం పడి, రక్తం చింది, కండలు వ్రీలిపోతేనే యుద్ధం మానుకునే వాళ్ళు. ఇప్పుడు అమె రికా నావ మన సముద్రం అంచు రాచుకుంటూ పోయిందంటేనే ఆయుధం అవతల పార వేస్తున్నాము. ఒంటి మీద యుద్ధాలు మనస్సు మీదకు వచ్చినాయి. యుద్ధభయం ఇప్పుడు భటులది కాదు రాజకీయ నాయకుడిది. యుద్ధానికి కాదు అతడు భయపడేది యిజానికి. 'భయము వేళ జూడు బంటుగుణము. పేదవద్ద వెనుక



Unfiled Notes Page 32

పెండ్లాము గతి జూడు' అని వేమన్న అన్నాడు. యుద్ధభయం అప్పుడు భటునిదీ, ఇప్పుడు సగటు మానవుడిదీ, నాయకుడిదీ.

కవిత్వాలు రెండు రకాలు

ఒకటి చీకటి కవిత్వం, ఒకటి పగటి కవిత్వం. ఒకటి నిద్రపుచ్చే కవిత్వం, ఒకటి మేల్కొల్పే కవిత్వం. మత్తు ఇచ్చే కవిత్వం, ముందడుగు వేయించే కవిత్వం. మేల్కొన్న దగ్గర నుంచీ మనం పనులు చేయాలి, ఏ పనులు చేయాలి. చదవాలి. ఏమి చదవాలి! మాట్లాడాలి ఏమాట మాట్లాడాలి?. ఇవన్నీ సమస్యలే. ఇవన్నీ తల్లిలా నేర్పే మనిషి కావాలి. తల్లి ఎంతకాలం ప్రక్కనుంటుంది! పంతులు ఎంత సేపు ఉంటాడు? వేమన్న నే నుంటాను అన్నాడు. ఒక పనిచేయలేక అది కాక నిరుత్సాహ పడి కూర్చున్నాం. అప్పుడు భుజం తట్టి వేమన అంటున్నాడు. 'కాని పనులు కానెకావు భువిని. మహిమ వేఱు గలదు మనతోడ నున్నదా!'

వేమన శబ్ద సాధకుడూ అర్థ శోధ కుడూ. ఆయన దగ్గర శబ్దాల ఆయుధాగారం ఉంది. ఎప్పుడు ఏ ఆయుధం విసరుతాడో తెలియదు. అర్థం అతని శత్రువు. దాన్ని గురిపెట్టి కొట్టుక తీసుకు రావడమే శబ్దం పని. ఆయన భాషనెప్పుడూ భాషగా వాడు కోలేదు. అగ్గి పుల్ల గీచి వెలిగే ఎడం కూడా సహించలేనంత దాహకతత్వాన్ని తూటాకె క్కించి కూర్చునేవాడు.

వేమన పాలక పక్ష కవిగాదు. ప్రతి పక్షాల కవి. మన శాసన సభల్లో ప్రతిపక్షాల వారు మంత్రులను ప్రశ్నలు వేసి నిగ్గదీసి నానా యాతనలు పెట్టినట్టు వేమన, వేడివేడి చురకలతో, వ్యంగ్యంతో ఎత్తి పొడుపుతో తిట్లతో ఆ యుగాన్ని నానా రకాలుగా ఉక్కిరి బిక్కిరి చేసిన మహానుభావుడు. అప్పటి వరకు పైపై పటాటోపాలతో ధార్మిక దంభ ప్రదర్శనలతో చాడీ కోరులతో అసత్య వాదు లతో నిండివున్న ఆ సమాజానికి ఆయన ఘాటైన శస్త్ర చికిత్స చేశాడు. అయినా క్లోరోఫారం ఇవ్వకుండా చేయలేదు. ఆయన కవిత్వంలో ఉన్న మాధు ర్యమే ఏ చదువురాని వాడు విన్నా ఆనం దించ గలిగిన చక్కని కవితా శిల్పమే ఆయన దగ్గరున్న క్లోరో ఫారం. దాన్ని చాటుగా బెట్టుకుని ఆయన ఈ సమాజాన్ని చీల్చి చెండాడాడు. ముక్కలు ముక్కలుగా కోశాడు. అయినా ఆయన వేసిన కుట్లు తరతరాలుగా నిలిచి తరతరాల ఆరోగ్యాన్ని ఇచ్చింది జాతికి. అలాంటి మహాయోగి మళ్లీ పుట్టలేదు.

ఆయన దృష్టిలో ప్రాణికోటి అంతా ఒక్కటే. జీవుడు, పరమాత్మ అనే విభాగం తప్పితే రెండో భేదం లేదు. పురుషులు సజ్జ నులూ దుర్జనులూ అని రెండు తెగలు.

స్త్రీలు కులసతులు గుణహీనలు అని రెండు తెగలు.

*గుణము గలిగియున్న కులసతి నెవ్వారు / నిందజేయలేరు నీతి జూచి / గుణము లేక యున్న గుణ హీనురాలయా*

అంటాడు. ఇప్పటిలాగా అప్పుడు స్త్రీని ఎన్నో విభాగాల క్రింద విభజించి చూడలేదు సమాజం. వివాహిత, అవివాహిత, చదువు కున్న స్త్రీ, చదువురాని స్త్రీ, సంఘ పరాయ ఋరాలు, స్వతంత్ర భావుక, ఉద్యోగిని, నిరు ద్యోగిని ఇలా ఎన్నో రకాల స్త్రీ రూపాలు ఇప్పుడు ఏర్పడ్డాయి. అప్పుడు ఇవన్నీ లేవుగాని సంఘ బాహ్యరాలుగా ఉండే ఒక స్త్రీ ఉండేది. ఆమె వేశ్య. వేశ్యను వేమన కొంత వరకు సహించాడు. పతిని ఆరాధిం చని స్త్రీని మాత్రం సహించలేదు.

పతిని భావమందు పరమాత్మగా నెంచమని ఆయన వాక్కు'. 'పతిని దూరునట్టి పడతి దుర్గ' అన్నాడు. ఇలాగని భర్తల్ను ఆయన స్వేచ్ఛగా వదలలేదు. 'పరసతి గమ నంబు ప్రత్యక్ష నరకంబు' ఆయన దృష్టిలో.

ఆయన భాష మొరటుగా పరుష పదజాలంతో కూడి ఉండేది. మరీ ఘోర అన్యా యాలు జరుగుతుంటే చూచి సరైన సంఘ సంస్కర్త యెవ్వడూ సహించలేడు. రోడ్డునబడి తిడతాడు. వేమన కూడా రోడ్డున బడ్డాడు. ఆయన నోటికి వచ్చేవి మంచి తిట్లుగావు. కుక్క గాడిద, బానిస కొడుకు అనడానికి కూడా జంకలేదు.

*గాడ్దె యేమెఱుంగు గంధపు వాసన / కుక్క యేమెఱుంగు గొప్ప బుద్ధి / అల్పుడేమెఱుంగు హరిని, గొల్చెడు రక్తి*

ఇలా ఉండేది ఆయన భాష.

ఆయనది ఆరోపణల కవిత్వం, పిటీ షనుల కవిత్వం. ఈ సమాజమంతా దురంత క్రూరతాండవ నృత్యమై జాతిని దద్దరిల్ల జేస్తుంటే ఆయన ప్రజల తరఫు నుండి కవిత్వం పిటీషన్లు పంపుతూ ఉండేవాడు. ప్రజల సమస్యలూ, దుః ఖాలూ తనకు అందిన సూచనమేరకు సేకరించి వాటికి తన కవితా జ్యోతిని మేళవింపజేసి ఒక్కొక్క కరపత్రాన్ని వెదజల్లుతూ పోతూ ఉండేవాడు.

ఇంటి సమస్యల మీద ఆయన కర పత్రం ఇది -

*ఓర్పులేని భార్య ఉన్న ఫలంబేమి / బుద్ధిలేని బిడ్డ పుట్టి యేమి / సద్గుణంబులేని చదువది యేలరా!*

భార్య ఓర్పు గలిగి ఉండటంతో ఇంటి లోని ఒక గొప్ప సమస్య తీరిపోతుంది. కొడుకు అల్లరి చిల్లరిగా తిరుగుతుంటే ఇంటిలో ఎంత శాంతి ఉన్నా శాంతి గాదు. పిల్లవాడు బుద్ధి మంతుడై ఉండాలి. అంతేగాదు అతడు చదువు కోవాలి. ఆ చదువు సద్గుణాలు నేర్పాలి. గృహ జీవితానికి ఒక చక్కని ప్రాతిపదిక వేసి యిచ్చాడు వేమన. వేమనది నిష్క్రియమైన ఉపదేశం కాదు. ప్రతిపదం అమలు జరిపి చూపించడానికి అనువైంది. వేమన రూపించిన ఇలాంటి ఇల్లు కట్టాలని ప్రభుత్వం ప్రణాళిక వేసు కుంది అనుకోండి అప్పుడు ఏమి చేయవలసి ఉంటుంది? ఇంట్లో భార్యను ఓర్పు ఉన్న భార్యగా చేయాలంటే భర్తకు మంచి ఉద్యోగం ఇవ్వాలి. పిల్లవానికి చక్కని పాఠశాల కట్టించి క్రమశిక్షణలో ఉంచాలి. అతను చదువు తాడు. కాని అతని చదువు సద్గుణాలతో ఉండాలంటే జీవనభృతికీ కేవలం బుద్ధి వ్యాయామక్రీడలే ఉద్దేశించిన ఈ చదువు మూల మట్టాన్నే మార్చి వేసి సరికొత్త పునాదులమీద పాఠ్యక్రమం నిర్ణయించాలి. ఇలా అతని ప్రతి సూక్తీ నిర్మాణాత్మకమైంది. వేమన ఇంకో కరపత్రం వేశాడు.

*వేరు పురుగు జేరి వృక్షంబు చెరచును / చీడపురుగు జేరి చెట్టు చెరచు / కుత్సి తుండు జేరి గుణవంతు జెరచురా*

వేమన ఈ కరపత్రం వేయడంలో ఉద్దేశం ఇప్పటి పార్టీలను దృష్టి పెట్టుకునే అయి ఉంటుంది. ఒక మంచి పార్టీలోకి ఇంకొక పార్టీ వాడు వచ్చి చేరతాడు. ఆ మేసే గాడిదను కూసే గాడిద వచ్చి చెడగొట్టినట్టు మొదటివాడు చెడిపోతాడు. చెడ్డగుణం చీడ పురుగులాంటిదే. చీడ పురుగుల్ని మనం ఏరివెయ్యాలంటాము. ఈ 'చీడపురుగు' అనే పదాన్ని వేమన్నే ప్రజాబహుళం చేశాడు. వేరు పురుగు వృక్షాన్ని చెరిపేస్తుంది. చీడ పురుగు చెట్టును చెరచి వేస్తుంది. వృక్షము అనే మాట ఎంత గొప్పమాట! ఈ సమా జము ఒక వృక్షము ఈ ప్రభుత్వము

ఒక వృక్షము. ఈ సంస్థ ఒక వృక్షము చరిత్ర ఒక వృక్షము. ఈ మహా వృక్షాలు ఎందుకు కూలిపోతున్నాయి. అక్కడ ఎవడో ఒక కుత్సితుడు చేరి ఉంటాడు. అంభిరాజు వల్ల ఒక రాజ్య వృక్షం కూలింది. జయచంద్రుడు వల్ల ఒక చరిత్ర కూలింది. శకుని వల్ల ఒక వంశం కూలింది. ఇప్పటి ప్రభుత్వాలూ సంస్థ లూ కూలి పోవడానికి కారణం అక్కడ ఒకే ఒక కుత్సితుడు చేరి ఉండటం వల్ల. అతడి ద్వారా అన్ని వర్గాల్లోను అన్ని శాఖల్లోనూ విషబీజాలు వ్యాపించి పోతుంటాయి.

నాస్తికులూ, హేతువాదులూ వేమ నను తమ పార్టీనాయకుడుగా భావిస్తారు. హేతు వాదులకు తమ బలమే గొప్పది, వేమ నకు దైవబలం గొప్పది. అసలు నాస్తికులకు వేమన పూర్తిగా వ్యతిరేకం. సంఘాన్ని తిట్టి నందుకు వీళ్లు ఆయన్ను తమ వానిగా భావి స్తున్నారు. మతపరుల్నీ ఛాందసుల్నీ ఆయన తిట్టాడంటే వాళ్ళు భగవంతుని చేరువకు రాలేక పోతున్నారని తిట్టాడు. నాస్తికులు భగవంతుణ్ణే తిడుతున్నారు. ఆయనెందుకు తిట్టాడో వీళ్లెందుకు తిడుతున్నారో. నక్క ఒకందుకు పాడమన్నది. కాకి ఒకందుకు పాడింది. ఆయనకు పరం కావాలి, వీళ్లకు ఇహం కావాలి. వీళ్లు అహం వాదులూ, ఆయన అహమస్మివాది. మన ప్రేరణలు చాలా సాంకర్యంగా ఉంటున్నాయి. ఆయనే మన్నాడు...

*'చీమకుట్టెనేని జీవు కన్పించును / చీమ యెంత దాని సృష్టి యెంత / చీమ వంటి వాని సృష్టిలో ఎఱుగును'*

– చీమవంటి వాణ్ణి తెలుసుకోవ డానికి ఆయన తపన.

*'వెండికొండ పసిడి కొండయు దనకొండ / దేవుడేల పోయి తిరిపెమెత్తె / దైవ బలము కాని తన బల్మికాదయా'* – ఇదీ ఆయన బలం.

*'మాలవాని నేల మహిమీద నిందింప / నొడల రక్తమాంస మొకటి కాదె'.* – ఇది గాంధీగారికి ఉపయోగ పడింది.

మానవజాతిలో ఒకజాతి అంటరానిదిగా ఉండి మహా నికృష్టాలకు లోనవుతుంటే చూచి సహించలేక వేమన పై మాట అన్నాడు. దీనిని గాంధీగారు తన రాజకీయా నికి ఉపయోగ పెట్టుకున్నారు. హిందూ జాతిని ఆంగ్లేయులు రెండుగా విభజించి మాలవారిని విడదీయాలని చూస్తుంటే మాలను గోసిన రక్తము రాదా నీలోనున్నవి పాలా అన్నట్టు ఆయన దాన్ని వేమన ఇచ్చిన తర్కం తోనే అడ్డుకున్నాడు. గాంధీగారు ఈ పని దేశం కోసమే చేశారనుకోండి. అయినా ఆయనకు ఈ రకమైన ఊహ కలగడానికి కారణం ఈ జ్ఞాన కవులే. వేమన లాగానే ఇలాంటి మాట ఏ జ్ఞాన దేవుడో! తుకారమో కబీరో అని ఉండవచ్చు. వీళ్ళే అని ఉండాలి కూడా. ఎందుకంటే ఈ జ్ఞాన కవులందరూ ఎక్కువ భాగం కడజాతి వాళ్ళు. బలహీన వర్గాల నుండి వచ్చిన వాళ్లు. వీళ్ళు సవర్ణుల మీద యుద్ధాల్ని ప్రకటించారు. తమ జాతి మానవ జాతిలో ఒక భాగమే. మానవులందరూ ఒకటే అనడానికి వీళ్లు ఎన్నో తర్కాలు తయారు చేసుకున్నారు. ఎన్నో ఊహలు వాళ్ల మెదళ్లు నుండి బయల్వె డలినాయి. ముందు ఊహ రావడం కష్టం. ఊహ వచ్చిన తరువాత అది ఉద్యమంగా వికసిస్తుంది. దున్నేవాడిదే భూమి అనేది మొదట ఒక కవిలాంటి మనిషి నుండి వచ్చిన ఊహే. అది ఇప్పుడు మహామేరు పర్వతంలాంటి ఉద్యమం అయింది. సమాజం అంతవరకు మాలవాణ్ణి అంటరాని వాడు అనుకుంటుంది; అతడు వేరే మానవుడు అనుకుంటుంది. కాని వేమన అన్నాడు. అతడిది మాంసం కాదా. ప్రజలు అర్థం చేసుకున్నారు. అతడిదీ మాంసమే మనదీ మాంసమే. దానితో ఉద్యమం ఆరం భమైంది.

తరువాయి వచ్చే సంచికలో...

## మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి' పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక–

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.

2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్/మెయిల్ గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు.5000/లు) గాని, 5 సం॥ల చందా (రు.1000/లు) గాని, 3 సం॥ల చందా (రు.700/లు) గాని పంపి పత్రికకు ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥చందా రు.240/లు పంపించి ఏటా పునరుద్ధరించుకొనవచ్చు.

**–ప్రచురణకర్త,** అమ్మనుడి

గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష

మధురాంతకం నరేంద్ర
9866243659

# తెలుగు వచన రచన – సాహిత్య ప్రభావం

**1940 ప్రాంతాల్లో విద్వాన్ విశ్వంగారు ప్రసిద్ధ అమెరికన్ రచయిత జాన్ స్టెయిన్‌బెక్ రాసిన నవల "ది మూన్ ఈజ్ డౌన్" ను 'ఆక్రమణ' అనే పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. అందులో ఆయన అనేక అనంతపురం జిల్లా మాండలికాలను వాడారు. చాలా క్రియా పదాలను గూడా వాడారు.**

1950 ప్రాంతాల్లో కే. సభాగారు అదివరకూ పత్రికల్లో వాడుతూ వుండిన వొక రకమైన ప్రామాణిక తెలుగు వచనాన్నే రాయడం మొదలు పెట్టారు. ఆ తరువాత వచ్చిన రాయలసీమ రచయితలందరూ దాదాపుగా ఆ రకమైన వచనంలోనే కథలూ, నవలలూ రాశారు. అప్పుడు ప్రాచుర్యంలో ఉండే పత్రికల్లో అదే భాషను వాడుతూ వుండడం, ఆ పత్రికలకు మొత్తం తెలుగు ప్రదేశాలన్నింటిలోనూ ప్రాచుర్యం వుండడమూ అందుకు కారణం కావచ్చు. అయితే విజయనగరంలోంచీ చాసోగారూ, విశాఖనుంచీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారూ కళింగాంధ్ర మాండలికానికి ఆనాటి ప్రామాణిక వచనపు తొడుగుల్ని తొడుగుతూనే వాడుక భాషను సాహిత్య భాషగా మార్చే తొలి అడుగులు వేశారు. యీ పద్ధతి రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి 'సొమ్ములు పోనాయండి' లో పూర్తిగా విప్పారింది. అయితే ఆ కథ చెప్పే వ్యక్తి (పాత్ర) కళింగాంధ్ర ప్రాంతపు నిరక్షరాస్యుడుగావడం చేత, అప్పటివరకూ కథను ప్రామాణిక వచన రచనలో చేస్తూ పాత్రల చేత మాత్రం పాత్రోచితమైన మాండలికాన్ని వాడుతూ వుండడం చేత, 'సొమ్ములు పోనాయండి' ని పూర్తిగా మాండలికంలో రాయడం సాధ్యమయ్యింది. యిదే పద్ధతిలో చాసోగారు యెక్కువగా ప్రథమ పురుషలోనూ, వుత్తమ పురుష ధోరణిలోనూ మౌఖిక సంప్రదాయపు కథలు రాయడంతో మాండలిక రచన చేయడం సులభమయ్యింది. వ్యక్తులు మాట్లాడేటప్పుడు వ్యాకరణ నియమాలు పాఠించరనే సంగతి వాళ్ల రచనల్లో అర్థమవుతుంది.

కథల్లో కవిత్వాన్ని ప్రవేశపెట్టిన తొలి తెలుగు కథకుల్లో కొనకళ్ళ వెంకటరత్నంగారు ముఖ్యులు. "యెప్పుడో రావలసిన ముసలితనం పదేళ్ళు యెదురొచ్చి, తారసిల్లి, చిన్న చిన్న గుడారాలు వేసుకుని విడిసినట్టు, అతడి ఒడలంతా ముడతలు పడింది. గర్భగుడిలో చమురు దీపం లాగా ప్రాణాలు ఎక్కడో లోతుగా మినుకుమినుకు మంటున్నాయి" అంటూ రాస్తాడాయన. అందమైన తెలుగు నుడికారం ఆయన కథల్లో పరుచుకుంది. 'అప్పుడే ఆ తండ్రి దరియాప్తు చెయ్యా, ముద్దుల కూతురికి వివరించా, అమ్మాయిగారప్పుడే ఒక నిర్ణయానికి రివ్వున దూకనూ, ఆ నిర్ణయం తుది నిర్ణయంగా పైసలైపోనూ, అంతా జరిగి పోయిందన్నమాట' అని రాస్తారింకో కథలో...

కథానిక అనే ఇంగ్లీషు ప్రక్రియకు మధురాంతకం రాజారాం, సత్యం శంకరమంచి, ముళ్ళపూడి వెంకటరమణ వంటి కథకులు తెలుగుదనం నేర్పారు. 'కమ్మ తెమ్మెర' అనే 1957లో రాసిన కథలో మధురాంతకం రాజారాంగారెలాంటి పాండిత్యపు వచనం రాస్తారో గమనించండి...ఆ మేళంలో ప్రత్యేకించి చెప్పుకోదగిన ముఖ్యాంశం డోలు. మేలుమేలు! అది డోలు కాదు – శివతాండవాన్ని చూస్తూ పరవశుడై తలాడిస్తున్న నందీశ్వరుడి గంగడోలు! మెడలోని బంగారపు గొలుసు జిగేల్ జిగేల్మని మెరుస్తుండగా, పై కెగిరి, పాయలుగా చీలి, సుళ్లు తిరిగి రకరకాలుగా రోజుకుంటూ గిరజాలు పున్నమనాటి సముద్ర తరంగాల్లా కల్లోల పడుతుండగా, ఆ డోలు వాద్యగాడు మనసిచ్చి, లాలించి, బుజ్జగించి, బుగ్గలు చుంబించి, అంతలో మూతి బిగించి, నుదురు చిట్లించి, పెడముఖం పెట్టి సాధించి, చిట్ట చివరకు 'ఉపాయాంతరం లేక దాసోహ' మన్నట్టుగా తలవంచి, పెళ్ళాన్ని ఏలుకోవడంలో వున్న వెయ్యి ఒడుపుల్ని తన వాద్య విద్య మూలంగానే విశదీకరిస్తున్నాడు. ..

తెలుగు వాక్యానికి యింగ్లీషు దుస్తులను తొడిగిన కథకుల్లో బుచ్చిబాబు మొదటివాడు. ఆయన వాక్యాలు యింగ్లీషు వాక్య నిర్మాణంతో (సింటెక్స్) బాటుగా యింగ్లీషునుడికారాలనూ అనుసరిస్తాయి.

ముకుందాన్ని బెంగుళూరు పిచ్చాసుపత్రిలో పెట్టారన్న వార్త విన్నప్పుడు కాలచక్రం నిలిచిపోయినట్టనిపించింది అంటూ ఆయన వో కథను ప్రారంభిస్తాడు. "చటుక్కున నా మనస్సుని వో భావం స్ఫురించింది. అదేమిటో చెప్పేసి, పాఠకుల కాలం వృథా పర్చడం అన్యాయమని వొదిలేస్తున్నా". యింగ్లీషు భాషా ప్రభావం లేని రచయిత యిలా రాయడం కుదరదు. 'అయితే యీ యింగ్లీషు ప్రభావం చేత బుచ్చిబాబు వాక్యాలకు వింత అందం రావడం గమనించవలసిన విషయం. ఆయన వాక్యాలు సహజసిద్ధంగా పుట్టినవిగా కనిపించక పోవచ్చు. అయితే విదేశీ ఆభరణాలతో అవి కొత్త అందాలను చిమ్ముతాయి. ఆ పచ్చటి పర్వత శిఖరాలు నీలి ఆకాశం మేలి ముసుగులా కప్పుకున్న తెల్ల మేఘాన్ని అన్వేషించి, అందుకోలేక అలసి, కిందికి క్రుంగి, లోయగా సాగి, నగ్నంగా పవళించిన ఏకాంత కన్య విషాదంలో జుట్టు ఆరబోసుకున్నట్టు చుట్టూ దట్టమైన అడవి. పెనవేసుకున్న ముంగురుల్లా వికృతమైన చెట్ల మానులు. విరిగిన మొదళ్ళు వర్షపు నీటికి చారలు తేరిన నల్ల కొండరాతి బీటలు. ఆశకు భ్రమించి కళ్ళు తెరచినట్టు, శిఖరాల మధ్య విరిగిన నల్ల మబ్బులు – వృక్షాల మధ్య బాధతో జారిన కన్నీరు మాదిరి, వంకరలు తిరిగి, అదృశ్యమయ్యే రోడ్డు, సగం ఎండిన పిల్ల నదీ – తమ అందానికి సిగ్గుతో తలలు వంచి, పాదాలకేసి చూసుకున్నట్టు కిందికి, యింకా కిందికి, యింకా యింకా కిందికి, అధోలోకంలోకి దిగజారిపోతున్న ఆ దృశ్యం,ఆ అనుభవం అరకులోయ. అదీ అరకు లోయలో కూలిన శిఖరం అనే కథ ప్రారంభమయ్యే తీరు. యీ వాక్యంలోని అనేక వ్యక్తీకరణలు విదేశీయమైనవని తోచకపోవడానికి ఆ వాక్య విన్యాసంలోని సొగసులే కారణం.

తెలుగు భాషకిలా విదేశీ ఆభరణాలు తొడిగిన మరో రచయిత త్రిపుర. యింగ్లీషు మాటల్ని తరచుగా వాడడంతో ఆయనొక మిశ్రమ భాషను తయారు చేశాడు. "సిగరెట్ వెలిగించేను. నల్లగా మారుతూ మండుతుంది వర్జీనియా. 'ఏడో నెంబర్ బస్ బాగా బలిసిన ఊరకుక్కలాగా

దూరం నుంచీ వస్తూంది. స్టాప్ దగ్గర ఆగి ఒక డజను మందిని పోసింది. అలా సాగుతుంది 'భాగవతం కోసం' అనే త్రిపుర కథ.

ఇంగ్లీషు నుడికారాలను తెలుగులోకి అనువదించడం ద్వారా తెలుగుకు కొత్త అందాలను సంతరించిన మరో కథకుడు ఇచ్ఛాపురపు జగన్నాధరావు. ఆయన కథలో వో పాత్ర మీకు నమస్కారాలూ, ధన్యవాదాలూూ అంటుంది. ఆమె చిరునవ్వు ముళ్లపొదలా గుచ్చుకుంది. మౌనంగా ఆమెను ఆశీర్వదించాను. దేనికి ఈమె దారి తీస్తున్నది? అలా వుంటాయి ఆయన వాక్యాలు.

తెలుగు వాక్యానికి రంగూ, రుచి, వాసన అద్దిన కథకుడు రాచకొండ విశ్వనాథ శాస్త్రి. ఆయన వాక్యాలు గుర్రాల్లా దౌడు తీస్తాయి. స్పాట్‌లైట్ స్టేజీ రాజులా చంద్రుడు ధగధగ వెలుగుతున్నాడు. శభాష్! డాబామీద వెన్నెల్లో నీ ప్రియురాలి సిల్కు చీరలా గాలి చల్లగా వుంది. శభాష్! మొనలు తేలిన జేబు కొండలు ఎలా ఉన్నాయో మరి లెక్కేసు కోండి! వారెవ్వా అద్గదీ! జీబుగా పెరిగిన తుమ్మ మొక్కలు నీలి ముసుగుల మేల్వంశపు అభిసారికల్లా ఉన్నాయా లేదా! బలేబలే!


తెలుగు వాక్య రచనల్లో నూతన వరవడికి దారి చూపిన ఆధునిక రచయితల్లో వడ్డెర చండీదాస్ ప్రముఖుడు. 'హిమజ్వాల' కు అనుబంధంగా రాసిన అర్ధానుస్వారం అనే మలి మాటలో ఆయన తాను అచ్చులైన ఇ, ఈ, ఎ, ఏ, ఒ, ఓ ఔ లను ఎందుకు వాడలేదో చెప్తాడు. స్నానం అన్నమాట నుంచీ 'స్నానించి' అనే క్రియనూ, స్వప్నం నుంచీ 'స్వప్నించి' అనే క్రియనూ మొదట్లో ఆయన వాడినప్పుడు పెద్ద దుమారమే చెలరేగింది. అయితే క్రమంగా ఆ మాటలు వాడుకలోకి వచ్చేశాయి. అనుక్షణికం, ప్రస్రవించి మొదలైన కొత్తమాటలను తయారు చేయడంతోబాటూ ఆయన 'బూడిద బుడ్డీ' (ఆష్ట్రే) వంటి కొత్త పదాలనూ వాడుకలోకి తేవడానికి ప్రయత్నించారు.

గురజాడ నుంచీ మాండలిక రచనలు ప్రారంభమైనా రాయలసీమ తెలంగాణాల నుంచీ కథకులు మాండలిక రచనలు మొదలు పెట్టే వరకూ వివాదాలు రాలేదు. అయితే తొలి రోజుల్లోని రాయలసీమ కథకులు కర్ణ సుభగమైన మాండలిక భాషను రాయగలిగారు. వుదాహరణకు పైన పండిత భాషలాంటి వ్యవహారికాన్ని రాసిన మధురాంతకం రాజారాంగారు 1975 వ నాటికి ఫక్తు మాండలికంలో రాయడం మొదలుపెట్టారు.

"ఇక్కడ మేమంతా క్షేమం" లో "బంగారు తల్లి మాటాడతా, మాటాడతా కన్ను మూసింది. మీ నాయిన మాత్తరం? ఆయినా ఆ తల్లికి దగిన కొడుకే! మాటిస్తే తప్పడు. మనసిస్తే యిడవడు. 'బుద్ధిలో దరమరాజు' అని రాస్తే అన్ని ప్రాంతాల వాళ్ళూ తలూపారు. అలాగే డాక్టర్ కేశవరెడ్డి, నామిని సుబ్రహ్మణ్యం నాయుడూ అచ్చమైన రాయలసీమ మాండలికంలో రాస్తే తెలుగు వాళ్ళందరూ ప్రేమగా దగ్గరయ్యారు. కానీ కొందరు తెలంగాణా రచయితల రచనలు యితర ప్రాంతాల వాళ్ళకు కొరుకుడు పడలేదు. కొన్ని రచనలకు తెలుగు అనువాదాలు అవసరమయ్యాయి. మలితరం రాయలసీమ కథకులు గూడా వీరమాండలిక వాదులై పోయి బిన్యా, చెప్పిన్యా, వచ్చిన్యా మొదలైన మాటల్ని రాయసాగారు. వైపని సమజాయించు మొదలైన తెలంగాణా పదాలు వివరణలు లేకపోతే అర్థంగాకుండా పోయాయి. పైగా **యిటీవల యెలా మాట్లాడుతున్నామో అలాగే రాస్తామంటూ కొంత వ్యావహారికమూ, కొంత ప్రామాణికమూ అయిన కృత్రిమ భాషనూ తయారు చేస్తున్నారు. ఈ విపరీత ధోరణుల కారణంగా తెలుగు వచనం తెలుగువారికే అర్థంగాని పరిస్థితి తయారయ్యింది. తొలినాటి తెలుగు రచయితలు తమతమ ప్రాంతాల నుడికారాలనూ, మాండలికాలనూ, పాత్రోచితంగా, అర్థవంతంగా వాడుతూ, వాటికి ప్రాచుర్యం తెచ్చారు. ఆ మార్గాన్ని అనుసరించినప్పుడే తెలుగు వచనం తన ప్రత్యేకతను నిలుపుకుంటూనే సార్వజనీనంగా గూడా రూపొందగలుగుతుంది.**



తెలుగువారంతా చదువవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన



**ఎల్లలు లేని తెలుగు**
వెల : రు.200/-లు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**
వెల :రు. 100/-



**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**
వెల : రు.350/-


విద్యార్థులు,
ఉపాధ్యాయులు,
పరిశోధకులు,
సామాజిక కార్యకర్తలు
రచయితలు,
భాషోద్యమకారులు,
ఆసక్తిగల వారంతా
ఈ రచనలను చదివి
ప్రయోజనం
పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ. చేస్తే వాటిని కొరియర్ / రిజిష్టర్డ్ బుక్ పోస్ట్‌లో పంపిస్తాము.
**తెలుగుజాతి (ట్రస్టు)** – జీవక భవనం, 8-346, **అంగలకుదురు** పోస్టు **తెనాలి** – 522211ఫోన్ : 9440448244


పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

సన్నిధానం నరసింహ శర్మ
9292055531

# కొత్త తరాన్ని ప్రోత్సహించే ఉత్తమ ప్రోత్సాహశీలి వావిలాల



వీరేశలింగంగారు మొదట్లో నవతరం వారినీ, యువతరం వారినీ తన పనులకు బలంగా చేసుకున్నారు. చివరి దశలో ఆయన వారికి దూరమయ్యారు. కొన్ని కష్టాల్ని చవి చూశారు. ఈ అంశాలు మనకు జాన్ లియోనార్డు ఆంగ్లంలో రాసిన 'కందుకూరి వీరేశలింగం' గ్రంథం విశద పరుస్తుంది.

నిస్వార్థ నాయకుడు, గాంధేయ వాది వావిలాల గోపాల కృష్ణయ్యగారు నవతరాన్ని ప్రోత్సహించడంలో ముందుండేవారు.

ఆంధ్ర పత్రిక దినపత్రికలో అడపాదడపా నేను కొన్ని గ్రంథాలయాల గురించి పెద్దగా విశ్లేషణలు లేకపోయినా చరిత్రనీ గ్రంథ సంపదనీ పరిచయం చేస్తూ వ్యాసాలు రాసేవాణ్ణి – పత్రికవారు ఫలానా వ్యాసం అందిందని, వేస్తామని, వేయలేక పోతున్నామని కార్డులు రాసేవారు. పత్రిక ప్రతిని పంపేవారు. పారితోషికాన్ని పంపేవారు. ఈ అంశాలలా ఉంచితే... నాబోటి యువకుల వ్యాసాలు కూడా వావిలాల చదివి ప్రోత్సాహక లేఖలు రాసేవారు. చిన్న చిన్న అక్కరాలతో ఆయన కార్డులు బ్రహ్మరాతను తలపించేవి. హృదయం తెలిసేది కానీ అక్షరాలు కొన్ని ఇట్టే తెలిసేవి కాదు. గ్రంథాలయాల కమిటీ పెద్దగా ఆయన శ్రీ గౌతమీ గ్రంథాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడే సందర్భంలో నాతో ఆయన మీరు రచయిత కదా! నా పుస్తకంపై మంచి విమర్శ రాసారు. ఆ ప్రతి నా దగ్గర లేదు. మీ దగ్గరుంటే ఇస్తారా అన్నారు. తర్వాత దాని ప్రతిని ప్రయాణీకుల వసతి బంగ్లాకు వెళ్ళి ఇచ్చాను. నా పై మంచి విమర్శ రాసారు అని మళ్లీ అనడంతో అవాక్కయ్యాను. కొంచెం ఇబ్బంది పడినట్లయింది. అసలు సంగతేమిటంటే 'ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమం' అనే ఒక గ్రంథాన్ని వావిలాల వారు రాశారు.

భారతి సాహిత్య పత్రికలో సమీక్ష చేయమని 'పత్రికాధిపతులు నాకే పంపారు. నేను ఒళ్ళు దగ్గర పెట్టుకు మరీ రాశాను. అందులో 'ప్రయివేటు గ్రంథాలయాల గురించి ఎక్కువ తెలిసింది వావిలాల వారికే కాని ఇందులో తక్కువగా రాశారు అనే ఓ వాక్యం వుంది. సమీక్షలో పొగడికలు వదలి, లోటును తెలిపే వాక్యాన్ని పట్టుకోవడం ఆయన పెద్దరికపు పరిమళ గుణం.

ఆ మధ్య బాటమీద వెడుతూంటే పిల్లలెందుకో ఓ చోట తిట్టుకుంటూ కొట్టుకుంటూ కనిపించారు. నే నాగి వారించాను. ఆ చిన్నవాళ్ళలో కొంచెం పెద్దోడు అంకులూ మేము కొట్టుకోవడం లేదండి అసెంబ్లీ ఆట ఆడుకుంటున్నాం అన్నాడు. అసెంబ్లీ ఆటంటే తిట్టు కోవడమూ కొట్టుకోవడమూ అన్నమాట! గుండెను కలచి వేసింది. ఏం చేస్తాం కేవల పక్ష ప్రతినిధులుగానే భావిస్తే ఎలా? ప్రజా ప్రతినిధులుగా భావించక పోతే ఎలా?

మరి, అచ్చమైన ప్రజా ప్రతినిధులుగా పుచ్చలపల్లి సుందరయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, తెన్నేటి విశ్వనాథం వంటి వారు గణాంకాల భోగట్టాతో సమస్యల అధ్యయన బలాలతో శాసన సభలోకి అడుగిడుతూంటే పాలక, ప్రతిపక్ష సభ్యులంతా ఆదర భావంతో సోదరభావంతో ముచ్చట పడేవారు.

రాజమహేంద్రవరంలో వావిలాల రోటరీ లిటరరీ అవార్డును వి.ఎల్.ఎన్. వెంకట్రామయ్య, బేబియ్యంవేంకట్రామయ్య, పట్టపగలు వేంకట్రావు వంటి పెద్దలు ఏర్పాటు చేశారు. ప్రథమపురస్కారాన్ని వావిలాలవారి కరకమలాల ద్వారా నాకు ఇచ్చి వారి మెచ్చు మాటల్ని పలికింపజేయడం మరువలేని మరువరాని తీపి తలపు. ఒక వెండి పూల సజ్జను నగదు సహితంగా ఈదు చేశారు. నవతరాన్ని ప్రోత్సహించడంలో ఆయన ఎల ఉంటారో ఆనాడు చాలా తెతిసింది. వావిలాలవారు తమకు ఎ.సి. వసతి ఏర్పాటు చేసినా నేను శర్మగారింట్లోనే ఉంటానని చెప్పి మా యింటిని పావనం చేశారు. ఆవాళ నేను మా ఇంట్లో పిల్లల్ని బళ్లకి సెలవులు పెట్టించి గాంధీగారి వంటి ఓ పెద్దాయన మన ఇంటికి వస్తున్నారు. ఆయనతో గడుపుదాం అన్నా" అలా గడిపాం. అదే సందర్భంలో స్వాతంత్ర్య సమర శీలి, మద్దూరి అన్నపూర్ణయ్య శిష్యుడు తులసి గంగాధర రామారావుగారి 'స్వాతంత్ర్య సమిధలు' పొత్తానికి వావిలాలవారు చెప్పగా ఆయన పీఠికకు లేఖకుణ్ణయ్యాను.

మరో సందర్భం : రవళి అని శ్రీరామచంద్రమూర్తి రాసిన ఓ కథా సంకలనానికి నేను సంపాదకుణ్ణి. ఆ పుస్తకాన్ని వావిలాలవారు రాజమహేంద్రిలో ఆవిష్కరించారు. ఆ సభలో నేను మాట్లాడిన ప్రసంగానికి చప్పట్లు బాగా వినవచ్చాయి. అయితే ఆ ఉపన్యాసం విన్న వావిలాలవారు సాత్వికంగా ఓ చురక అంటించారు. శర్మగారూ కొత్త జ్ఞానాంశాలు, చెప్పడం మంచిదే. కానీ మనం మాట్లాడే అంశానికి సంబంధితాలా? కావా? అని చూసుకోవాలి. మనకున్న విజ్ఞానాన్ని అంతా ఒంపేసుకోనక్కర్లేదు. మీ ఉపన్యాసం బాగుంది. అన్నారు ఏం బాగుందో



Unfiled Notes Page 37

# “తెలుగు భాష – మాండలికాలు”పై గుంటూరులో జరిగిన సదస్సు



తెలుగుభాష – మాండలికాలు అను సాహితీ సదస్సు– సన్నపనేని పున్నయ్య, లక్ష్మీనరసమ్మ ట్రస్టు, గుంటూరువారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం, బృందావన్ గార్డెన్స్, గుంటూరులో అన్నమయ్య కళావేదిక మీద 30.07.18న సోమవారం సాయంత్రం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు సన్నపనేని అయ్యన్‌రావు కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా॥ పాపినేని శివశంకర్ సభకు అధ్యక్షత వహించారు.

తమ ముందుమాటలో నిర్వాహకులు సన్నపనేని అయ్యన్‌రావు “ప్రపంచవ్యాప్తంగా అనేక భాషలు అంతరిస్తున్న ప్రస్తుత తరుణంలో, వేలాది సంవత్సరాల చరిత్ర గల మన తెలుగు నుడి, తెలుగుభాష, మరుగున పడిపోయే పరిస్థితి వచ్చింది. భాష నశిస్తే జాతి నశిస్తుంది. జనసంఖ్య రీత్యా, ప్రపంచంలోని మొదటి పది పెద్ద భాషలలో మన మాతృభాష – తెలుగు ఉన్నా, మన భాషకు సంబంధించిన వాస్తవ స్థితి, ప్రమాదకర స్థితికి చేరి, ఆందోళనకరంగా వుంది. అందరి మదిలోకి, తెలుగుభాష ఆవశ్యకతను గుర్తుకు తీసుకువచ్చి, కనీసం మన పిల్లల ప్రాథమిక విద్యాభ్యాసాన్ని తెలుగులో చేయించే విధంగా ప్రోత్సహించాలనే ఆశతో ఈ కార్యక్రమ ఏర్పాటుకు పూనుకున్నాను” అని చెప్పారు.

సభాధ్యక్షత వహించిన డా॥ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ, కొన్ని ప్రాంతాలలో, ఆ ప్రాంతం వరకు మాత్రమే వినిపించే భాషను మాండలికం అంటారని, దాన్ని పొరుగు ప్రాంతం వారే గుర్తించగలుగుతారని అన్నారు. స్వర్గీయ మాధవపెద్ది గోఖలే కథల్లో గుంటూరు భాష ఎలా వుంటుందో స్పష్టంగా తెలుస్తుందని, తాను కూడ ‘చింతలతోపు’ మొదలైన కొన్ని కథల్లో గుంటూరు మాండలికాన్ని ప్రత్యేకంగా ఉపయోగించినట్టు చెప్పారు. ప్రాచీన కవుల్లో గుంటూరు వాడైన మహాకవి తిక్కన సంస్కృత పండితభాషకు భిన్నంగా తెలుగునుడికారాన్ని భారతంలో పొందుపరిచాడని వివరించారు. గుంటూరు భాషలోని వైవిధ్యాన్ని, మాధుర్యాన్ని సోదాహరణంగా వివరించారు. ఆంగ్లభాషపై ఉన్న మోజుతో మన మాతృభాష అయిన తెలుగును ప్రజలు, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటికీ పాలకులు మాతృభాషకు సముచితమైన ప్రాధాన్యతనివ్వడం లేదని విమర్శించారు. సాంస్కృతిక సంపదను, అలాగే భాషను విస్మరిస్తే అనేక విపరిణామాలు సంభవిస్తాయని, అంతేకాకుండా మన అస్తిత్వాన్ని కూడా కోల్పోతామన్నారు.

శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య మాట్లాడుతూ, భాషా ఉనికి విస్తృతి ప్రాంతానుగుణంగా ప్రభావితమవుతాయన్నారు. ఎవరు మాట్లాడే భాష వారికి అత్యంత విశేషమైనదని, ఈ ప్రాథమిక సత్యాన్ని అందరూ గ్రహించిన నాడు భాషా వైషమ్యాలు ఉండవని అన్నారు. తెలుగుభాష తేట తెలుగు పదాలను ఇప్పటికీ తెలంగాణా మరువలేదంటే అతిశయోక్తి కాదన్నారు.

విజయనగరం నుంచి వచ్చిన ప్రముఖ కవి, విమర్శకుడు గంటేడ గౌరీనాయుడు ఉత్తరాంధ్ర మాండలికాలు, యాసపై, యానాం నుంచి వచ్చిన ప్రముఖ సాహితీవేత్త డా॥ శిఖామణి, కోస్తాంధ్రభాషపై, చివరగా రాయలసీమ నుంచి ప్రత్యేకంగా ఆహ్వానించబడిన యువ సాహితి ఉపాధ్యక్షురాలు డా॥ విజయలక్ష్మి (కడప) జన బాహుళ్యంలో రాయలసీమ భాషపై ప్రసంగించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీ మస్తానయ్య, శ్రీ ఊటుకూరి నాగేశ్వరరావు, అనేకమంది సాహితీ అభిమానులు సభలో పాల్గొన్నారు.

---

కన్నా ఏం బాగులేదో తెలిసొచ్చింది.

రాజమండ్రిలోనే ప్రకాశం జయంతి ఉత్సవాలు పురపాలక సంఘ భవన ప్రాంగణంలో జరిగాయి. ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యాన జరిగాయి. తెన్నేటి విశ్వనాథం, వావిలాల గోపాలకృష్ణయ్యగార్లు ప్రకాశోపన్యాసాలు అద్భుతంగా చేశారు. రాత్రి వారి ప్రసంగాల తరువాత ఇప్పటి ఆంధ్రప్రభ సీనియర్ సబ్ ఎడిటర్ చల్లా అనంత పద్మనాభస్వామి, నేను–తెన్నేటివారిని, వావిలాల వారిని దర్శించుకొన్నాం. అనంత పద్మనాభస్వామి బోళాబోళి మనిషి. విశ్వనాథంగారి వద్దకు ఆయన వెనకాలే నేనూ వెళ్లాను. పద్మనాభం అయ్యా విశ్వనాథంగారూ దేశభక్తులైన మీకై ఏం చేసినా ఋణం తీరదు. మీరు పడుకుంటే కాళ్ళు నొక్కుతాను. అన్నాడు. (నాకు భయం వేసింది. ఇతడి వెనకాలే నేనున్నాను. నాకు కాళ్లు నొక్కడం అదీ ఇష్టం ఉండదు ఎలా అని!) వెంటనే విశ్వనాథంగారు ఆయనతో “కాళ్లు నొక్కించుకునే అవసరం లేదు. బయట కూర్చోండి అవసరమైతే పిలుస్తానన్నారు. ఆ రాజసంలో ప్రకాశంగారు దర్శనమిచ్చారు నాకు.

తరువాత పద్మనాభంతో వావిలాలవారి దగ్గరికి మరో గదిలోకి వెళ్ళాం. పద్మనాభం అదే డైలాగు వావిలాల వారితో అంటే వావిలాల వారు కోప్పడ్డారు. ఒకళ్ళ కాళ్ళు నొక్కుతాను అనడం మంచిదా?. నీవు నీవులా ఉండాలి. కాళ్ళనెప్పులు అవసరమైన ఎవరికైనా నొక్కొచ్చు. అంతే కాని అది సరదాగా అనుకో కూడదు –అని ధ్వనించేలా అన్నారు. మొత్తం మీద ఈ పద్మనాభంతో ఏ పెద్దోళ్ళనీ చూడకూడదనిపించింది.

వై.యస్.నరసింహారావుగారితోపాటు ఓసారి వావిలాల వారికి వీడ్కోలు ఇవ్వడానికి రాజమండ్రి స్టేషనుకు వెళ్ళాం. బండి వచ్చింది. మామూలు పెట్టెలో ఆయన్ని ఎక్కించాం. వావిలాలవారిని చూసీ చూడగానే జనంలోంచి వాళ్ళు లేచి కూర్చోండి కూర్చోండి అని వావిలాలవారిని పిలిచారు. అదీ మరీ ప్రజానాయకుడంటే!

ఆయన చిన్న చిన్న మాటల్లో ఎన్నో గొప్ప సూక్తులు అనుభవ దీపాల్లా వెలిగాయి.

‘చిన్న హోటళ్లలో మనం తింటాం. పెద్ద హోటళ్లు మనల్ని తింటాయి’ అనేది ఒకటి. ఈ దేశానికి కావలసినదేమిటి? అని నేనాయనని అడిగితే –‘ఎవరిపని వారు అంకితమై చేయడం ఒకటే అన్నారు. వావిలాల వారిని చూడ్డం, ఆయనతో మాట్లాడడం నిజంగా ఒక మహా అదృష్టం.

ధారావాహిక



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 17. బ్రాహ్మణులా ? క్షత్రియులా?

నిజంగా - పరిణామక్రమంలో తొలిగా స్త్రీ, పురుష జీవులు ఏర్పడ్డ క్రమాన్నే బుద్ధుడు చెప్పాడు. ఇటు జంతువుల్లో మార్పులు, అటు మొక్కల్లో మార్పులూ, సమాంతరంగా జంతు, వృక్ష జీవ జాతుల పరిణామ క్రమాన్ని చెప్పుకుంటూనే వచ్చాడు.

ఇలా వచ్చి వచ్చి - కామ సంబంధాలకు వచ్చే సరికి ఒక్కసారి గెంతువేసి మానవ సమాజంలోకి వచ్చేశాడు. బిగ్‌బ్యాంగ్ జరిగి, భూమి పుట్టి, దాని మీద స్త్రీ, పురుష జీవులు ఏర్పడే వరకూ ఉన్న క్రమాన్ని దాదాపుగా 70 శాతం ఆధునిక పరిణామ క్రమానికి దగ్గరగానే చెప్పాడు. ఆ తర్వాత వెన్నెముక గల జీవులు, పక్షులు, క్షీరదాలు, ఏప్స్, మానవులు - ఈ క్రమాన్ని గురించిగానీ, వీటిల్లో ఏదో ఒక అంశాన్ని గురించిగానీ చెప్పలేదు. ఒక్క సారిగా మానవ సమాజంలోకి వచ్చేశాడు.

ఇక - అక్కడి నుండి ఆయన చెప్పింది సామాజిక పరిణామమే.

అప్పుడు - ఒకడు - ఇలా అనుకొన్నాడు -

*"అలం భో సత్త! ఆహతో మే సాలి సకిందేవ ద్వేహాయా"తి!"* (దీ. నికాయం : 127)

"నేనెందుకు ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఈ ధాన్యాన్ని తెచ్చుకొని తినాలి? నేనికనుండి  రెండు రోజులకూ సరిపడే ధాన్యాన్ని ప్రోగుచేసుకోవాలి" అనుకొన్నాడు. ప్రోగుచేసుకున్నాడు.

అతనిని చూసి మరొకరు నాలుగు రోజులకు, ఇంకొకడు 8 రోజులకు సరిపడా ధాన్యాన్ని తెచ్చుకుని దాచుకున్నారు. ఇలా చేయడంవల్ల అప్పటిదాకా గింజలమీద పొట్టు లేని ధాన్యానికి పొట్టువచ్చింది. గింజల మీద పొట్టు ఉన్న వరి ధాన్యం పుట్టింది. విత్తనాలు ఒక్కొక్కటిగా కాకుండా కంకులుగా వచ్చాయి. అప్పుడు వారు ఆ కంకులున్న ప్రాంతాన్ని క్షేత్రంగా (పొలంగా) విభజించుకొని పంచుకున్నారు. మొదట్లో ఎవరి క్షేత్రంలో వారే ఉండేవారు. ఆ తర్వాత బలవంతులైన స్వార్థపరుడు తన ప్రక్కనున్న క్షేత్రాన్ని కూడా ఆక్రమించుకున్నాడు.

అప్పుడు అందరూ కలసి ఆ ఆక్రమణదారుణ్ణి నిందించారు. కొట్టారు. "ఇంకెప్పుడూ ఇలా చేయకు" అని హెచ్చరించారు.

"నేను ఇక చేయను" అన్నాడు వాడు. కానీ, మరలా మరలా అదే పని చేశాడు.

వాళ్ళు అతణ్ణి రాళ్ళతో కొట్టారు. కర్రలతో బాదారు" అని,

*"తదగ్గే ఖో, వాసెట్ఠ!...*

*అదిన్నాదానం పణ్ణాయతి, గరహ పణ్ణాయతి,*

*ముసావాదో పణ్ణాయతి, దండదానం పణ్ణాయతి"*

(దీ.నికాయం : 219)

"కాబట్టి ఓ వాసెట్ఠా! అలా దొంగతనం పుట్టింది. దోపిడి పుట్టింది. దాన్ని నిరోధించే పద్ధతీ పుట్టింది. అబద్ధాలు, మోసపు మాటలు పుట్టాయి. దానికి తగిన దండనలూ పుట్టాయి" అని చెప్పాడు బుద్ధుడు.

### క్షత్రియుడు,బ్రాహ్మణుడు....ఎలా  పుట్టారు?

ఇంకా బుద్ధుడు ఇలా చెప్పాడు -

"అప్పుడు వారందరూ కూర్చొని బాధపడ్డారు.ఇలా అనుకున్నారు-' తప్పుని తప్పుగా, ఒప్పుని ఒప్పుగా, కోపగించవలసిన వారిని కోపగిస్తూ, బహిష్కరించవలసినవారిని బహిష్కరించే శక్తిశాలి అయిన ఒక వ్యక్తిని మనం నియమించుకుందాం. అతనికి ఆపని చేసినందుకు మనందరం

మన ధాన్యంలో భాగం ఇద్దాం ' అని అందరూ కలసి ఒక క్షేత్ర పాలకుణ్ణి నియమించుకున్నారు. అందరూ నియమించుకున్నారు కాబట్టి అతణ్ణి "మహాసమ్మతుడు" అన్నారు. క్షేత్రాల్ని రక్షించేవాడు కాబట్టి "క్షత్రియుడు" అయ్యాడు. అలా "క్షత్రియవర్గం" పుట్టింది. ఆ క్షత్రియుడు కూడా అందరి కంటే భిన్నమైన వాడు కాదు. ఈ భూమ్మీద అందరి జీవుల్లానే అతనూ పుట్టాడు" – అని చెప్పాడు బుద్ధుడు.

బుద్ధుడు చేసిన ఈ విశ్లేషణ వేదాలకి విరుద్ధం. వైదిక సంప్రదాయం ప్రకారం బ్రాహ్మణుడే మొదటి వాడు. అగ్రజుడు. బ్రహ్మముఖం నుండి తొలుత పుట్టాడు. అందుకే కృత యుగంలో బ్రాహ్మణునికి అనంత గౌరవం ఉంది. అప్పుడు బ్రాహ్మణులే పాలకులు. ఆ యుగంలో ధర్మం నాలుగు పాదాల నడచింది అని చెప్తారు. దానిని బట్టే – ఇప్పుడు చాలా మంది "భారత దేశంలో బ్రాహ్మణ సంస్కృతి ఉంది, ఇది బ్రాహ్మణ సమాజం, బ్రాహ్మణ భావజాలం – అంటూ తొలి నింద బ్రాహ్మణుల మీదే వేస్తున్నారు.

కానీ, సామాజిక పరిణామం ప్రకారం చూస్తే క్షత్రియులే తొలి దోపిడీ దారులు. బానిస వ్యవస్థలో బానిస యజమానులే కాలక్రమంలో రాజులుగా రూపాంతరం చెందారు. మన దేశంలో గణతంత్ర రాజ్యాల్లో కూడా బానిసత్వం ఉంది. గణ రాజ్యాల నుండే ఏకకేంద్ర రాజ్యాలు పుట్టుకొచ్చాయి. కాబట్టి, దురాక్రమణల ఆద్యులు క్షత్రియులే.

మార్క్స్, అంబేద్కర్‌లు ఇద్దరిదీ ఇదే అభిప్రాయం.

'పాలకుల్ని భావజాలపరంగా రక్షించే వర్గమే పురోహిత వర్గం' అంటుంది మార్క్సిజం.

'ఒక గ్రంథం సమాజాన్ని "మీరు ఈ కులం, మీరు ఆ కులం" అని వర్గీకరించలేదు. చీలిపోయి ఉన్న కుల సమాజాన్ని తిరిగి కలవకుండా ఉంచగలదు. గృహ్యా సూత్రాలూ, మనుధర్మ శాస్త్రం అదేపని చేశాయి" అంటారు అంబేద్కర్.

పురోహిత వర్గం దోపిడీ వర్గాన్ని భావజాలపరంగా రక్షించే వర్గమే. వారు పాలకులకు ఏజెంటులే. అంతేగాని, అగ్రజులు కాదు. దోపిడీ ఉన్న వర్ణ వ్యవస్థలోగానీ, వర్గ సమాజంలోగానీ క్షత్రియులే అగ్రజులు –

బుద్ధుని ఈ సామాజిక విశ్లేషణలో ఎంత శాస్త్రీయత ఉందో!

## వైశ్య దిమ్మరులు – శూద్ర శ్రామికులు

ఆ తర్వాత "దొంగిలించడం, మోసగించడం, అబద్ధాలాడడం, దండనకు గురికావడంలాంటి చెడ్డ పనులకు దూరంగా ఉండాలి" అనుకున్నారు కొందరు. "బాహెంతి" అనే పదానికి అర్థం దూరంగా ఉండటం. కాబట్టి వారు బ్రాహ్మణులు అయ్యారు. అడవుల్లోకి వెళ్ళి పోయారు. అక్కడ ఆహారం దొరకనినాడు జనావాసాలకి వచ్చి యాచించేవారు. అందుకే వారిని "ఝూతుకులు" అంటారు. అటు అడవుల్లోని పర్ణశాలల్లో, ఇటు గ్రామాల్లోనూ జీవించలేనివారు కొందరు నగర శివార్లలో ఉండి గ్రంథాలను రచించేవారు. అలా వారు "అజ్ఞాయకులు"(అధ్యాపకులు) అయ్యారు. అలా బ్రాహ్మణ కులం పుట్టింది.

ఇక, మిగిలిన కొందరిలో ఒకరిద్దరు, అంతకంటే ఎక్కువ మంది కలసి గ్రామాల మధ్య తిరుగుతూ వ్యాపారం చేశారు. "విస్స" అంటే "కలసినవారు" అని అర్థం. అందుకే వారు వైశ్యులయ్యారు.

వేట మీద, కూలి పనుల మీద జీవించేవారు శూద్రులయ్యారు. "సుద్ధ" అనే పదానికి అర్థం "నీచమైన" అని. తక్కువగా చూడబడ్డారు కాబట్టి వారు శూద్రులయ్యారు.

కాబట్టి వాసెట్గా! కులాల్ని బట్టి చూస్తే క్షత్రియులే ప్రథములు (బ్రాహ్మణులు కాదు. కాబట్టి మీ బ్రాహ్మణులు చెప్పింది చెల్లదు అని అర్థం)వారే అగ్రగణ్యులు. కానీ, శీలం, గుణం ఉన్నవాడే అందరికంటే అధికుడు. ఉత్తముడు" అని చెప్పాడు బుద్ధుడు.

'బ్రాహ్మణులు శ్రేష్ఠులు. ప్రథములు. వారు బ్రహ్మ ముఖం నుండి పుట్టారు' అని బ్రాహ్మణులు వశిష్ఠునితో చెప్పింది తప్పు అని చెప్పడం కోసం బుద్ధుడు సృష్టి ఆవిర్భవించిన తీరు గురించి క్రమంగా చెప్పుకొచ్చాడు.

## భూమ్మీదే జీవం ఉందా?

'విశ్వానికి' లోకం అనే పదం బౌద్ధం ఉపయోగించింది. బౌద్ధంలో లోకాలు అనంతం. "గంగానది తీరంలో ఎన్ని ఇసుక రేణువులున్నాయో వాటికి మించి లోకాలున్నాయి" అంటాడు బుద్ధుడు ఒకచోట. వాటిలో అనేక లోకాల్లో రకరకాలు జీవులుంటాయి. మనకంటే దిగువ స్థాయి జీవులు కొన్ని చోట్ల, మనకంటే అధిక స్థాయి జీవులు కొన్ని చోట్ల ఉంటాయంటాడు. జీవం కూడా ఒక లోకాన్నుండి మరో లోకానికి చేరుతుంది అంటాడు. అంటే ఒక గ్రహాన్నుండి మరో గ్రహానికి.

భూమ్మీద జీవం ఎలా పుట్టింది? అనే విషయంలో రెండు మూడు అభిప్రాయాలున్నాయి. వాటిల్లో ఇతర గ్రహాల నుండి జీవం భూమ్మీదికి వచ్చింది అనే వాదం ఒకటి. అంగారక గ్రహం నుండి వెలువడిన శకలాలు (ఆస్టరాయిడ్స్) జీవాన్ని భూమ్మీదికి తెచ్చాయనేది దానిలో ఒకటి. అంగారక గ్రహానికీ, గురు గ్రహానికీ మధ్య ఇప్పుడు గ్రహ శకలావరణం (ఆస్ట్రరాయిడ్ బెల్ట్) ఉంది. ఇక్కడ ఒకప్పుడు ఒక గ్రహం ఉండేదని, దానిలో జీవం ఉండేదని, సూపర్‌నోవా తాకిడికి అది బ్రద్దలైందని అంటారు. దానిలోని శకలాలు కొన్ని ఇప్పటికీ భూమ్మీదికి వచ్చిపడుతుంటాయి. కాబట్టి వాటిల్లో ఉన్న జీవాణువులే (కొయసర్వేట్స్) భూమ్మీదికి వచ్చి చేరాయని అంటారు కొందరు.

ఇప్పుడు అంగారక గ్రహం ధృవాల వద్ద, శని గ్రహానికి ఉన్న ఉన్నో ఉపగ్రహాలలో ఒక ఉపగ్రహం 'టైటాన్'. దాని మీద నీరు, వాతావరణం ఉందని, కాబట్టి అక్కడ జీవులు ఉంటాయని దాదాపు అందరూ నమ్ముతున్నారు. వాటి ఉపరితలాన్ని తీసిన ఫొటోలు ఔననే అంటున్నాయి.

కాబట్టి, ఈ విశ్వంలో జీవం కూడా ఒక లోకాన్నుండి మరో లోకానికి (గ్రహాన్నుండి గ్రహానికి) "వలస పోతూనే" ఉంటుంది అనేది అసత్యం కాదు.

కాబట్టి బుద్ధుడు చెప్పిన "లోక" సిద్ధాంతం "జీవ" సిద్ధాంతం, ఆ తర్వాత చెప్పిన సామాజిక పరిణామ సిద్ధాంతం – ఇవ్వన్నీ ఒక గొప్ప పరిణామవాదాన్ని మనముందుంచుతాయి.

ఐతే –

బుద్ధుడు జీవ శాస్త్రవేత్తకాదు. భూగోళ శాస్త్రవేత్త కాదు. ఖగోళ శాస్త్రవేత్త కాదు. ఒక గొప్ప నైతిక తత్త్వవేత్త. ధర్మ ప్రబోధకుడు. ఆయన తనకున్న తాత్త్విక దృక్పథంతో ఆలోచించే ఇవ్వన్నీ చెప్పాడు. ఆయన ఏమి చెప్పినా సరే అవ్వన్నీ ఈనాటికీ శాస్త్రీయంగా ఎందుకు నిలిచాయంటే ... ఆయన దృక్పథమే శాస్త్రీయం కాబట్టి. ఆయన

ప్రవచించిన ప్రతీత్య సముత్పాద సిద్ధాంతం "మార్పు"ని మాత్రమే నమ్మిన పరిణామ సిద్ధాంతం కాబట్టి.

'ఎవరో ఒక సృష్టికర్త ఈ సృష్టినీ, ఈ లోకాల్నీ , ఈ జీవుల్ని, మనుషుల్ని సృష్టించ లేదు' అని నమ్మాడు కాబట్టి.

అందుకే బుద్ధుడు ఒక శాస్త్రీయ గతితార్కిక భౌతికవాద పితామహుడు.

సృష్టివాదాన్ని వేద భావనలకి భిన్నంగా ప్రవచించిన ప్రగతికారుడు.

బౌద్ధం ప్రకారం ఈ విశ్వం సృష్టించబడలేదు. ఆవిర్భవించింది.

**అండ పిండ బ్రహ్మాండం అంతా....!**

"అండ, పిండ బ్రహ్మాండం అంతా ఆ శివుడే... శివుడు" అంటారు శైవులు.

"చూపితివట నీ నోటను బాపురే

పదునాల్గు భువన భాండములు" అంటూ "నారాయణుడే సర్వం. విశ్వంలో ప్రతి అణువణువును వ్యాపించి ఉంది నారాయణుడే" అంటారు వైష్ణవులు.

వీరే కాదు ప్రపంచంలో ప్రతి మతం వారు వారి వారి ఇష్ట దైవాలే. అండ, పిండ, బ్రహ్మాండం అంతా వ్యాపించి ఉన్నాయంటారు.

ఇదంతా – "ఎవరో ఒక మహా శక్తిపరుడైన వ్యక్తే (దేవుడు) ఈ సృష్టిని చేశాడని నమ్మేవారి అభిప్రాయం.

బౌద్ధంలో సృష్టి ఉంది. దాని ఆవిర్భావం ఉంది. కానీ, సృష్టి కర్త లేదు. సృష్టి అనేది విశ్వ నిర్మాణ ధర్మంలో భాగమే. ఈ విశ్వానికి కొన్ని ధర్మాలు, నియమాలు ఉన్నాయి. కాబట్టి ఈ విశ్వంలో ప్రతిదీ ఆ నియమాలకి కట్టుబడే ఉండాలి. ఉంటుంది. దానికి భిన్నంగా ఉండదు. ఉంటే...మనలేదు.

చాలా చిన్న విషయం చూద్దాం. కొండ ఆకారం శంఖువు. అంటే క్రింది భాగంలో విశాలంగా ఉండి, పైకి పోయే కొద్దీ ఏటవాలుగా ఉండి, చివరికి కొనతేలుతుంది. ఈ భూమ్మీదే కాదు, ఈ విశ్వంలో ఏ గ్రహం మీద కొండలు ఉన్నా అవన్నీ ఇలాగే ఉంటాయి. అంతేగాని క్రింది భాగం సన్నంగా ఉండి పైకి పోయే కొద్దీ విశాలంగా వుండవు.

ఇదే గురుత్వాకర్షణ నియమం. శంఖువులా ఉండే నిర్మాణాలు దాటి పీఠం వెడల్పు మీద దీని విత్తు, వాలు తలల మీద ఆధారపడి స్థిరత్వాన్ని పొందుతాయి.

మనం ఒక ట్రాక్టర్ ట్రక్కులో ఇసుక తెచ్చి ట్రక్కులేపి నేలమీద పోస్తే, ఆ ఇసుక గుట్ట కూడా శంఖువు ఆకారంలోనే ఏర్పడుతుంది. అలాగే కంకరు రాళ్ళు తెచ్చి పోసినా, ఇటుక రాళ్ళు పోసినా , తూర్పోత పోసి వడ్లు రాశిపోసినా – ఏది పోసినా అంతే...ఆ గుట్ట 'శంఖువు' ఆకారంలోనే ఏర్పడుతుంది. అలా ఈ భూమ్మీదే కాదు.... ఏ గ్రహం మీద పోసినా అంతే...!

**గుడెసైనా గుడిగోపురమైనా**

అందుకే మనం నిర్మించుకునే ఇళ్ల నిర్మాణాలుగానీ, గుడిసెలే గానీ, గుడి గోపురాలుగానీ అన్నీ ఈ నియమానికి లోబడే ఉంటాయి. ఎంతో మహిమగల దైవం అనుకున్నా – ఆ గుడి ముందు కట్టే గోపుర నిర్మాణాన్ని క్రింది సన్నగా, పైకి పోయే కొద్దీ వెడల్పుగా నిర్మిస్తే...రపీమని కూలి పోతుంది! ఎందుకంటే ఆ నిర్మాణం తీరు విశ్వనియమాలకి విరుద్ధం కనుక!

కాబట్టి మనం తెలుసుకోల్సింది ఏమంటే...ఒక "విశ్వనియమం" ఎక్కడైనా, ఎప్పుడైనా ఒకటే...!

ఈ విషయం ఎందుకంటే...బుద్ధుడు ఆవిష్కరించిన సిద్ధాంతం...

విశ్వ గురుత్వం అనే ఈ విశ్వ నియమాలకి భిన్నమైంది కాదు. అందుకే అది భౌతిక శాస్త్రానికైనా, నైతిక శాస్త్రానికైనా, ధార్మిక శాస్త్రానికైనా, సామాజిక శాస్త్రానికైనా, చివరికి పరిణామ శాస్త్రానికైనా చక్కగా సరిపోతుంది. ఇందుకే...ఈ శాస్త్రాలన్నీ బౌద్ధం పరిధిలో ఇమిడి పోతాయి!

బౌద్ధంలో "సృష్టి ఆవిర్భావం ఉంది. సృష్టికర్త లేదు" అనే విషయం గురించి ఇప్పటిదాకా చర్చించుకున్నాం. అలాగే 'భవ చక్రం' గురించి కూడా మొదట్లోనే కొంత తెలుసుకున్నాం. భవచక్రంలో 12 దశలు ఉన్నాయనీ, అవి కేవలం 'నిర్వాణం' పొందడానికే సోపానాలనీ భావించే వారు ఉన్నారు. మనం ఇంతకు ముందే చెప్పుకున్నట్లు "ఒక విధానం" ఈ విశ్వనియమానికి సరిపోయిందైతే...అది అన్ని రంగాల్లో ఒదిగిపోతుంది గదా! అలాగే ఈ భవచక్రం కూడా మానవ పరిణామ క్రమంలో అలాగే ఒదిగి పోతుంది.

అదెలాగో వచ్చే సంచికలో చూద్దాం...

కవిత

## అమ్మ గుండెల్లో బాకు!

నాడు
తెలుగుభాషను శిఖరంలా మలచిన రాయలు
నేడు
తెలుగు వెలుగుకు తెరలాగిన సందర్భం
ఊరించి మొఖం చాటేసిన మేఘంలా
ఆశలు రేకెత్తించి ఉసూరనిపించిన రాజకీయంలా
తెలుగుభాషకు గండి కొడుతున్నవైనం
దిక్సూచిలేని నావలా తెలుగు తల్లి
ఆసరాకోసం ఎదురుతెన్నులు
వేదికపై తెలుగుభాషపై వల్లమాలిన ప్రేమ
ఆచరణలో మాత్రం శూన్యం
పొరుగు రాష్ట్రాలనుండైనా పాఠాలు నేర్చుకోండి
ఎంత కాలమా భాషా సంకెళ్ళు
స్వ ప్రయోజనాలు కొంతమాని
జన ప్రయోజనంపై దృష్టి పెట్టండి
విజయవాడ వినియోగదారుల ఫోరం
తిను బండారాలపై తెలుగులో తీర్పు ప్రశంసనీయం
తెలుగుభాషంటే
ఉగ్గుపాలతో రంగరించి పోసిన అమ్మభాషరా
అమ్మ నిన్ను కన్నతల్లి అయితే
భాష నిన్ను పెంచిన తల్లిరా
తెలుగుభాషను మరచినవాడు
అమ్మ గుండెల్లో బాకును దించినవాడు

గుర్రాల రమణయ్య
9963921943

ధారావాహిక

# మౌనంలోని మాటలు

11

**సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ**

కన్నడ మూలం:
**డా. ఆర్.వి.బి.కుమార్**

తెలుగు అనువాదం :
**రంగనాథ రామచంద్రరావు**
9059779289



**జోలెకూ నోరు పెట్టేవారు :**

మా జాతి ఆడపిల్లలు ఈవాళ బిచ్చం అడగటానికి వెళ్ళటం తగ్గించుకుంటున్నారు. వాళ్ళంతా చెత్తలో ప్లాస్టిక్ వస్తువులు ఏరుకోవడానికి, కడవల వ్యాపారం చేయడానికి వెళతారు. ఏ పనీ లేకపోతే బిచ్చాటనకు వెళతారు. మా ఆడపిల్లలు తమ సంపాదనలో కొద్దికొద్ది పొదుపు చేస్తూవున్నారు. ఈ పొదుపు చేయడానికి మునిసిపాలిటి వారే కారణం. అక్కడున్న ఒక అధికారి స్త్రీ శక్తి సంఘం ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం కూడా కొంత ధన సహాయం చేస్తుందని చెప్పారు. మా వాళ్ళంతా 20 మంది కలిసి ఒక గ్రూపు అయ్యారు. మొదట వారానికి పొదుపు సొమ్ముగా పది రూపాయలు కట్టేవారు. అందులో నా భార్యలు సభ్యులు. అటు తరువాత వారానికి వంద రూపాయలు కట్టడం మొదలుపెట్టారు. అందులోంచి అప్పు తీసుకునేవారు. తిరిగి చెల్లించేవాళ్ళు. ఇలా చేస్తూ సుమారు అయిదు లక్షలరూపాయలు కూడబెట్టారు. దీని లెక్కంతా నాకు పరిచయం ఉన్న క్రిస్టియన్ వ్యక్తి రాసేవాడు. అతడు లెక్క రాసినందుకు నెలకు ఎంతో కొంత ఇచ్చేవాళ్ళం. ఇది ఇలా సరళంగా సాగుతూ ఉండింది.

ఇలా ఉండగా ఈ డబ్బుమీద మునిసిపాలిటిలోఉద్యోగస్థురాలైన బసంతమ్మ కళ్ళు పడ్డాయి. ఆ సొమ్మును ఎలాగైనా కాజేయాలన్న ఆలోచనతో ఆమె మా జనం తలపాడుచేయడం మొదలుపెట్టింది. అయితే ఆమె ప్రయత్నం ఫలించలేదు. దాంతో ఆమె ఒక కుతంత్రం పన్నింది. మీ జనాల ఇళ్ళకు పాయిఖానా కట్టించి ఇస్తాను. మీ ఇంటి పన్నులు కట్టండి అని నాతో చెప్పింది.

"అమ్మా, మా వాళ్ళంతా ఊళ్ళూళ్ళూ తిరుగుతున్నారు. వాళ్ళంతా వచ్చిన తర్వాత కడతాం" అన్నాం.

"మీ ఆడవాళ్ళ స్త్రీ శక్తి గ్రూపులోంచి ఒక పదివేలు తీసి కట్టెయ్. అటు తరువాత మీ జనంతో ఇప్పించుకుని ఆ గ్రూపుకు ఇవ్వచ్చు" అని ఆమె అంది.

"వాళ్ళు ఇవ్వాలి కదా తల్లీ" అన్నాను.

"మీ జనం అభివృద్ధి కోసమే కదా ! మీ వాళ్ళెందుకు ఇవ్వరు. వాళ్ళకు నేను చెబుతాను. మీరు కట్టిన డబ్బుకు రసీదు ఇస్తాంకదా!" అని చెప్పింది.

"అలాగేనమ్మా" అంటూ ఆ గ్రూపు ప్రతినిధులకు విషయం చెప్పాను.

ఆమె రాసిన చెక్కు మీద ప్రతినిధులు వేలుముద్ర వొత్తి ఇచ్చారు. దాన్ని తెచ్చి బ్యాంకులో డబ్బు డ్రా చేసి ఆమె చేతికి ఇచ్చాను. అక్కడ డబ్బు కట్టించుకున్న మరొక ముస్లీం వ్యక్తి సలీమో? అలాంటి ఏదో పేరున్నవాడో అతడికి ఆమె డబ్బు ఇచ్చింది.

అటు తరువాత మా ఇళ్ళకు పనికిరాని పాయిఖానాలు కట్టించి ఇచ్చారు. అయితే ఇంటి పన్ను కోసం నేను ఇచ్చిన పదివేలకు రసీదు ఇవ్వలేదు. రసీదు ఇవ్వమని అడిగినప్పుడంతా 'తొందరేముంది, ఇస్తాంలే' అని ఆమె తప్పించుకుని తిరిగింది. డబ్బు ఇప్పించుకున్న వ్యక్తి ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. అటు తరువాత ఈమె వల్ల సమస్య మొదలైంది. గ్రూపు నుంచి అప్పుల రూపంలో పొందిన డబ్బును తలాకు ఒకింత వేసుకుని కట్టేద్దామని మా వాళ్ళను అడిగాను. అయితే మా వాళ్ళు నువ్వు కట్టిన డబ్బుకు రసీదు చూపించమని అడిగారు. రసీదు ఇస్తే కదా చూపించడానికి? ఈమె అసలు రూపం కొద్ది కొద్దిగా అర్థమవసాగింది.

అంతలో ఈమె గ్రూపుకు కట్టిన డబ్బును నేను మోసం చేశానని మా జనానికి చాడీలు చెప్పింది.

లెక్కలు రాస్తున్న క్రిస్టియన్ వ్యక్తిని మాన్పించి తనే లెక్క రాయసాగింది.

అటు తరువాత మా అమాయక జనాన్ని మోసం చేయడం మొదలుపెట్టింది. చివరికి ఏమేమో చేసి ఆ గ్రూపును విడదీసింది. సబ్సిడి మూడు లక్షలు వస్తాయి. ఒకటిన్నర లక్ష ఇవ్వండని మా స్త్రీ శక్తి గ్రూపు నుంచి డబ్బు డ్రా చేసుకుని తీసుకుపోయింది. ఆ డబ్బు ఎక్కడికి పోయిందో తెలియలేదు.

ఇలాంటి అధికారులు తాము దొరకకుండా మా అమాయక జనంతో ఆటలాడి మాలాంటి జనాన్ని వాడుకుని ఎలా డబ్బు కాజేసి తప్పించుకుంటారో అనటానికి ఆమె కన్నా వేరే సాక్షి అవసరమా?

**హంపి కళాభివృద్ధి ట్రస్ట్ :**

మాలాంటి సంచారులకు వేదిక ఒకటుంటే మంచిదని ఆలోచించిన కుమార్‌సార్, ఆయన స్నేహితుడు తిప్పేస్వామి హంపి కళాభివృద్ధి ట్రస్ట్ అనే ట్రస్ట్‌ను



Unfiled Notes Page 42

స్థాపించారు. ట్రస్ట్‌కు శికారి రాము, మాధవ రావుసార్, కె. రాము, ఆయన తమ్ముడు దుర్గాప్రసాద్, రాము అనే బుడ్గ జంగమ వ్యక్తి, చెన్నదాసరుల గిరీశ, కుమార్‌సార్, తిప్పేస్వామి మెంబర్లు అయ్యాం. ఇందులో మాధవరావ్‌గారిని అధ్యక్షుడిగా, కడ్డిరాంపుర రామన్నను సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఇక మిగిలిన మేమందరం నిర్దేశకులయ్యాం. అందరూ అయిదువేల రూపాయల ప్రకారం సభ్యత్వ రుసుం కట్టాం.

అయితే ట్రస్ట్ పని చేయడానికి మాలోనే ఒక వ్యక్తి సహకరించలేదు. తన స్వార్థంతో ట్రస్ట్‌ను నిర్వీర్యం చేశాడు. ఈ విషయంగా శికారి రాము, మాధవరావ్, గిరీశ, తిప్పేస్వామి చాలా వ్యతిరేకించారు. అయినా ఆ మనిషి ట్రస్ట్ గురించి పట్టించుకోకుండా ఉండి పోయాడు. మేమంతా ఒక్కటై ట్రస్ట్‌ను నడిపితే మంచిదని అనిపించింది. అయితే ఆ వ్యక్తి మనస్సు నొప్పించాల్సి వస్తుందని అందరూ మౌనంగా ఉండిపోయారు.

ఒక సంచారి తమ తెగకే చెందిన సంచారుల పట్ల ఈ విధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో ఈ రోజుకూ అర్థం కాలేదు. సంచారులు నాశనం కావడానికి మాలో ఉండే ఈ విధమైన కుయుక్తులే కారణమేమో అనిపిస్తుంది.

ఉండనీయండి, స్వార్థపూరితమైన మనస్సున్న వారికీ బుద్ధి వస్తుందని, బుద్ధిరావాలని ఈరనాగమ్మను వేడుకుంటాను.

**ప్రసార శాఖవారి డాక్యూమెంటరీ సినిమా :**

సంచార సముదాయాల గురించి ప్రసార శాఖవారు డాక్యుమెంటరీ సినిమా తీస్తారని తెలిసింది. ఈ కమిటీలో మైత్రిగారిని మెంబరుగా నియమించారట. డాక్యూమెంటరీ తీయడానికి టెండర్ పిలిచినపుడు ఏమీ తెలియనివారు తమ లాభానికి ఈ జాతులను వాడుకుని సినిమా తీయకూడదని, ఆ యా సముదాయాల వారికే సినిమాలు తీసుకునే హక్కు ఇవ్వాలని మైత్రిగారు వాదించారట.

అటు తరువాత మైత్రినో ఎవరో మా జాతుల గురించి కథ రాశారట. దాన్ని షూటింగ్ చేయడానికి యాలంకి అనే డైరెక్టర్, అతడి బృందం వచ్చింది. వాళ్ళంతా మా కంప్లికి వచ్చి మకాం పెట్టారు. యాలంకి ఒక్కరోజూ కూడా సినిమా తీస్తున్న స్పాట్ దగ్గరికి రాలేదు. తానేమో



తన తాగుడేమో అన్నట్టు కూర్చునేవాడు. అతడితోపాటు వచ్చిన అసిస్టెంట్ డైరెక్టరే మొత్తం షూటింగ్ చేసి ముగించాడు. షూటింగ్‌కు కంప్లి వదిలి మరోచొటికి అంటే మా జనం ఉన్న ఇతర ప్రాంతాలకు వెళ్ళనే లేదు. అన్నీ కంప్లిలో ముగించారు. సినిమా కథకు పుస్తక ప్రాధికార ప్రకటించిన పుస్తకమే వారికి ఆధారం. ఏమి సినిమా తీశారో? ఏం కథో? వచ్చిన రెండు మూడు రోజుల్లోనే అంతా ముగించుకుని చేతులు కడుక్కున్నారు. ఇక డైరెక్టర్ అయితే సారాలోనే చేతులు కడుక్కుని సారాతోనే నోరు పుక్కిళించుకునేవాడు.

అప్పటిదాకా బెంగళూరు జనం అంటే చాలా సున్నితమైన జనం అని నేను అనుకునే వాడిని. యాలంకిని చూసిన తరువాత మా సంచారులే ఈ చదువుకున్న సిటీజనం కన్నా వెయ్యిరెట్లు మేలు అనిపించారు. డాక్యూమెంటరీ సినిమా కోసం మా చేత్తో డబ్బులు ఖర్చు పెట్టించిన మహానుభావుడు. చివరికి డాక్యూమెంటరీ సినిమా క్యాసెట్ పంపుతానని చెప్పాడు. అయితే ఇప్పటికీ ఒక్క క్యాసెట్టునూ పంపలేదు.

ఆ యాలంకి అనే దర్శకుడు ఆ మధ్యన చనిపోయాడని తెలిసింది.

పాపం ! అతడి ఆత్మకు శాంతికలగాలి!

**అమ్మాయిలతో సహవాసం :**

కేవలం మా అమ్మ, అక్కల గురించి చెప్పి; నాకు ఇతర స్త్రీలతో ఉన్న సంబంధాల గురించి చెప్పకపోతే తప్పవుతుంది.

అప్పుడు నాకు పదహారేళ్ళు ఉండొచ్చు.

ఒక ఆడమనిషి ఉండేది. నా కన్నా పెద్దది. పెళ్ళి కూడా అయింది.

మా గుడారం పక్కనే ఉన్న గుడారంలో ఉండేది.

ఉదయం ఒక రౌండు బిచ్చాటనకు వెళ్ళి వచ్చేవాళ్ళం.

ఆమె కూడా మధ్యాహ్నం సమయానికి ఊళ్ళో బిచ్చానికి వెళ్ళి వచ్చేది.

ఆమె అటు తరువాత నాలాగే ఖాళీగా ఉన్న కుర్రవాళ్ళనంతా పోగుచేసి గవ్వలతో బారాకట్ట ఆడేది.

లేకపోతే చక్కగా కథలు చెప్పేది.

మేమంతా ఆమె చెప్పే కథలు వినటానికి ఆమె చుట్టూ చేరేవాళ్ళం.

ఒకసారి నేనొక్కడినే ఉండటం చూసి గవ్వలు ఆడటానికి పిలిచింది.

బయట ఎండ ఉంది. లోపల గుడారంలో ఆడుదాం రా అని పిలిచింది. లోపలికి వెళ్ళాను. కొద్దిసేపు బారాకట్ట ఆడిన తరువాత, చుట్టూ ఎవరూ లేకపోవటం చూసి గుడారం ముందు చీరను వేలాడదీసి నన్ను తన మీదికి లాక్కుంది.

నాకేమీ అర్థం కాలేదు.

ఆమే ఏమేమో చేసుకుంది.

నాకు భయం వేయసాగింది.

'ఏమక్కా ఏమక్కా' అని పలవరిస్తున్నాను.

ఇది జరిగిన తరువాత ఆమె గుడారం వైపు తిరగలేదు.

ఆడదానితో మొదటి అనుభవం అది.

అటు తరువాత ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళతో శారీరక సుఖాన్ని పంచుకున్నాను.

అయితే వాళ్ళెవరూ ఈ రోజు నా కళ్ళ ముందు లేరు.

కానీ వారితో పొందిన అనుభవం మాత్రం ఇంకా అలాగే జ్ఞాపకముంది.

**వేట జ్ఞాపకాలు:**

సంచారులకూ వేటకూ ఎక్కడలేని సంబంధం ఉంది. మేము కుర్రవాళ్ళుగా ఉన్నప్పుడు ఉడుతలు పట్టుకునేవాళ్ళం. ఉడుతలను రెండు విధాలుగా పట్టుకునేవాళ్ళం. ఒకటి క్యాటర్‌బిల్లుతో కొట్టి పట్టుకోవడం. రెండు, వల వేసి పట్టుకోవడం. క్యాటర్‌బిల్లును మేమే తయారుచేసుకునేవాళ్ళం. పాత సైకిల్ ట్యూబులను చిన్నగా కోసి ఒక చిన్న వై ఆకారపు కర్రకు కట్టేవాళ్ళం. ట్యూబు ముక్కల మధ్యన ఏదైనా చర్మపు పాత ముక్కను జతపరిచి కట్టేవాళ్ళం. బిచ్చానికి పోనీ, ఎక్కడికైనా పోనీ మా జోలెలో ఎప్పుడూ క్యాటర్ బిల్లు ఉంటుంది. ఎక్కడ ఉడుత కనిపించినా అక్కడ క్యాటర్ బిల్లు వాడేవాళ్ళం. లేకపోతే ఏదైనా పెద్ద చెట్టు చుట్టూ మా పెద్దలు అల్లిన వలలు కట్టి అక్కడక్కడ గింజలు రాల్చేవాళ్ళం. ఉడుతలను చెట్టుకిందికి తరిమేవాళ్ళం. ఒకచోట మా పాటికి మేము కూర్చోనేవాళ్ళం. ఇలా చాలాసేపు కూర్చుని వలలో చిక్కిన ఉడుతల మెడలు విరిచి జోలెలో వేసుకునేవాళ్ళం. వాటిని కాల్చుకుని భోజనంలో నంజుకునేవాళ్ళం.

ఇక చేపలను కూడా పట్టేవాళ్ళం. ఎక్కడైనా చిన్న నీటి గుంటలో నీళ్ళు నిలువ ఉంటే చాలు ! అందులో చేపలు ఉన్నాయేమోనని చూసేవాళ్ళం. చేపలు ఉంటే మా గిన్నె ఉపయోగించి నీళ్ళను బయటికి ఎత్తి పారబోసి చిన్న చేపలను పట్టుకునేవాళ్ళం. కొన్ని చేపలే దొరికితే అక్కడే కాల్చుకుని తినేవాళ్ళం. ఎక్కువ సంఖ్యలో దొరికితే ఇంటికి తీసుకుని వచ్చేవాళ్ళం.

మేము పెరిగి పెద్దవాళ్ళమవుతున్న కొద్దీ నక్కను వేటాడటానికి వెళ్ళటం మొదలుపెట్టాం. అటు తరువాత ముళ్ళపంది వేటకు, కుందేలు వేటకు, అడవి పిల్లి, ఊర పిల్లి వేటలకు వెళ్ళేవాళ్ళం. ఇలా ఒకసారి రామసాగర అడవిలో ముళ్ళపంది సంచరిస్తున్న జాడ వెదుకుతూ ఒక వలను కట్టి వచ్చాం. సాయంత్రం వలను కట్టి ఉదయమే వెళ్ళి చూస్తే జంతువు వలను తెంచుకుని పోయింది. జంతువు వచ్చిపోయిందనటానికి గుర్తుగా వలలో అక్కడక్కడ చిల్లులు కనిపించాయి. ఆ వలను తెంచుకున్నదని, అంతకన్నా బలమైన వలను కడితే దాన్ని కూడా తెంచుకుని పోయింది. ఇలా మూడు వలలు కట్టిన్నా మూడు వలలనూ తెంచుకుని పోయింది. పాపం, దాని ఆయుష్షు గట్టిదని అనిపించింది. అయితే నా వలల ఆయుష్షు ముగిసిపోయింది.

ఒక ముళ్ళపందిని పట్టుకోవడానికి ప్రయత్నించి మూడు వలలను పాడుచేసుకున్నాను.

ఈ మధ్యన వేటకు వెళ్ళడం మానుకున్నాను !

అడవిలో మునుపట్లా ఇప్పుడు జంతువులూ లేవు!

పైగా జంతువులను పట్టుకోవడం నేరమట !

ఇక ఎలా జంతువులను పట్టుకోవాలి? ఎప్పుడైనా తినాలనుకుంటే చేపల వేటకు వెళతాను. లేదా ఎండ్రకాయలు పట్టుకుని వచ్చి చారు చేసుకుంటాం. కోడిని వండుకుని తింటాం. వేట రుచి ఇప్పుడిప్పుడే తప్పిపోయింది. మేము సామాన్యంగా చేపల ప్రియులం. చేపలు, పీతలు, తాబేళ్ళు, పెద్ద తాబేళ్ళు (మంచినీటిలో ఉండే ఒక జాతి తాబేలు), మొసలి అంటే మా వాళ్ళకు చాలా ఇష్టం. మొసలిని నేనెప్పుడూ వేటాడలేదు. మా వాళ్ళు తెచ్చినపుడు ఒకటి రెండుసార్లు తిన్నాను. మొసలి మాంసం చాలా రుచిగా ఉంటుంది.

ఇక తాబేళ్ళయితే నాకు పంచప్రాణాలు. నక్క మీద మాకు ఎంత ప్రేమనో, పెద్ద తాబేళ్ళు అంటే కూడా అంటే ప్రేమ. తాబేళ్ళు వర్షాకాలంలో అక్కడక్కడ కుంటల్లో, నిలువనీటి మడుగుల్లో దొరుకుతాయి. అయితే పెద్దతాబేళ్ళు దొరకటం కష్టం. సామాన్యంగా ఇవి పదికేజీల నుంచి వంద కేజీల వరకూ తూగే భారీ ప్రమాణంలో ఉంటాయి. ఒక్కొక్క పెద్ద తాబేలు ఒక ఎద్దులబండి చక్రమంత పెద్దగా ఉంటాయి. మాంసం మాత్రం మాకు చాలా రుచి అనిపిస్తుంది. వాటిని పట్టుకోవడం కష్టం. ఆకస్మాత్తుగా చేపల కోసం వేసిన వలలో కొన్నిసార్లు ఇవి చిక్కుకోవటం జరిగేది. ఒక్కొక్కసారి అవి మొత్తం వలను కొరికి వేస్తాయి. తాబేళ్ళు ఎంతటి మృదువైన జీవులో పెద్దతాబేళ్ళు అంత ప్రమాదకరమైనవి. వాటిని చాలా చాకచక్యంతో పట్టుకోవాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అవి ఎక్కడ పడితే అక్కడ కొరికేస్తాయి. ఇప్పుడిప్పుడు పెద్దతాబేళ్ళు మా చెరువులో తగ్గిపోయాయి. నేనొకసారి పదికేజీల పెద్ద తాబేలును తెచ్చాను. చేపల వలలో పడింది. దాన్ని మేమంతా పంచుకుని తిన్నాం.

ఈ మధ్య కాలంలో పెద్దతాబేళ్ళు, అడవి జంతువులు మాకు కలగా మిగిలిపోయాయి !

**ఎలెక్షన్‌లో నిలబడాలనే కోరిక :**

కంప్లి ఎం.ఎల్.ఎ. నియోజకవర్గాన్ని ఎస్.టి.కి కేటాయించారు. ఈ నియోజక వర్గంలో గత ఎం.ఎల్.ఎ. ఎలెక్షన్‌లో ఎం.ఎల్.ఎ. అభ్యర్థిగా పోటీ చేయడానికి శికారి రామును మైసూరు కృష్ణయ్య, మేత్రి, భాస్కరదాసుగారు ఒత్తిడి పెట్టారు. శికారి రాముకు ఎలెక్షన్లో నిలబడటం ఇష్టం లేదు. వారి ఒత్తిడికి కాదని చెప్పడం రాముకు సాధ్యం కాలేదు. ఈ నియోజక వర్గం అంటే డబ్బున్న వాళ్ళ నియోజక వర్గం. ఇక్కడ శ్రీరాములు అల్లుడు సురేష్ బాబు అనే యువకుడు ఎలెక్షన్‌లో పోటీ చేస్తున్నాడు. ఇక్కడ ఎలెక్షన్ అంటే ఓట్లను కొనుక్కోవడమే. ధనవంతులకు వ్యతిరేకంగా డబ్బులేని వాళ్ళు ఎలెక్షన్‌లో పోటీ చేయడం ఎలా సాధ్యమో చెప్పండి? అయినా మాలాంటి బీదవాళ్ళు ఎందుకు ఎలెక్షన్‌లో నిలబడకూడదు? డబ్బు అహంకారం ముందు బిచ్చపు స్వాభిమానం తక్కువ అనిపిస్తుంది. చివరికి రాము ఎలెక్షన్‌లో నిలబడలేదు. నేను ఎస్.టి. అయివుంటే తప్పకుండా ఎలెక్షన్లో పోటీకి నిలబడి ఉండేవాడిని. డిపాజిట్ పోయినా చింతలేదని అనిపించింది. అయినా ఇదే మాటలు శికారి రాముకు చెప్పే ధైర్యం నాకు లేకపోయింది.

**రామసాగరలో జరిగిన గంటె హెళవరుల పంచాయితీ :**

ఈ మధ్యన గంటెహెళవర తెగవాళ్ళు రామసాగరలో గుడారం వేసుకున్నారు. వాళ్ళు ఆ ఊళ్ళో తమ కుర్రవాళ్ళ పెళ్ళి ఏర్పాటు చేసుకున్నారు. ఆ పెళ్ళికి గంటెహెళవర సురేష్ కూడా వెళ్ళాడట. ఇతడు కంప్లిలో స్థిర నివాసం ఉండి, ఊరూరూ తిరుగుతూ నాటుమందులు అమ్మి జీవనం సాగిస్తున్నాడు. ఇతనికీ, హిరియూరులో నివాసం ఏర్పరుచుకుని సంచారియైన హెళవరజాతి వ్యక్తి ఒకడితో జరిగిన ఘర్షణ వల్ల రామసాగరలో వారి కులపంచాయితీ జరిగింది.

18-5-15న రామసాగర బాహ్య వలయంలో హెళవర కుటుంబాలంతా చేరి ఆరు గొర్రెలను కోసి పెండ్లి జరిపించారు. అక్కడికి హిరియూరు వ్యక్తి పెండ్లికి వచ్చాడు. సురేష్ కూడా పెండ్లికి వెళ్ళాడు. ఇప్పటికి పదేళ్ళ క్రితం చిక్కమగళూరు దగ్గర ఎక్కడో వీళ్ళిద్దరికి చిన్నముక్క బంగారం దొరికిందట. దాన్ని పంచుకోవటంలో ఇద్దరిమధ్య గొడవ అయ్యిందట. దానికోసం అప్పట్లో కుల పంచా యితీ జరిగింది. ఆ సమస్యను పంచాయితీ పరిష్కరించలేదు. అప్పుడు తలా ఒక్కొక్కరు పంచాయితీకి 10,000/- రూపా యలు జమాచేశారు. ఆ సొమ్మును బళ్ళారికి చెందిన హెళవర వ్యక్తికి డబ్బు ఇచ్చారు. ఇద్దరూ పంచాయితీకి వెళ్ళకుండా పదేళ్ళు గడిచిపోయాయి. అప్పడు జరగాల్సిన పంచాయితీని ఇప్పుడు పెట్టుకున్నారు. పంచాయితీ చేరిన వాళ్ళు బళ్ళారి వ్యక్తిని పిలిపించారు. ఆ వ్యక్తి 5000 రూపాయలు వాడుకుని కేవలం 15000/- రూపాయలు తెచ్చి ఇచ్చాడు. పంచాయితీ సాగలేదు. మళ్ళీ పంచాయితీ చేరటానికి మళ్ళీ డబ్బు వేసుకో వటానికి ఇద్దరూ తయారుగా ఉన్నారు. వివిధ సంచార సముదాయాలకు చెందిన నలుగురు సభ్యులు సమన్య పరిష్కరించడానికి వచ్చారు. అందులో నేనూ ఒకడిని. వెనుకటి పంచాయితీకి వెళ్ళాను. ఇప్పటి పంచాయితీకి కూడా వెళ్ళాను.

**మళ్ళీ గుర్తుకొచ్చిన కథ :**

ఓ రాయచూరు అమ్మాయి కథ దాదాపు నా పాత కథను గుర్తు చేసింది.

ఇది ఈ మధ్యనే జరిగిన సంఘటన. 2004 సెప్టెంబరు 14 లేదా 15 కావచ్చు. మా వీధిలోని బంధువు డి. నాగప్ప కుమారుడు లక్షణకు దూరంలోని గుళేదగుడ్డలో నెలవున్న సిందోళ్ళ అమ్మాయిని తెచ్చి పెళ్ళి చేశారు. సంచారులకు ఏది ఊరు? ఏది వీధి? ప్రస్తుతం గుళేదగుడ్డలో ఉన్నారు. ఈ ఊరి బాహ్య వలయంలో కుంచి కొరవలూ, సింధోళ్ళు ఒకే చోట గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుంచి కొరవలు బిచ్చాటనమూ, చీపుర్ల వ్యాపారంతోపాటు, పందులను సాకడం చేస్తుంటారు. మా వాళ్ళు కేవలం బిచ్చాటనంతో జీవనం సాగిస్తారు.

అయిదారు సంవత్సరాల ఓ అమ్మాయి రాయచూరు నుంచి ఎలాగో తప్పించుకుని



బస్సులో వచ్చేసింది. ఆ అమ్మాయి ఎవరి పిల్లనో కండక్టర్‌కు తెలియదు. టికెట్ అడిగితే కేవలం ఏడవటమే తప్ప ఏమీ మాట్లాడటమే లేదు. పిల్ల ఏడుపు, నిస్సహాయత చూడలేక కండక్టర్ రెండు రోజులు తన వెంట పెట్టుకుని డ్యూటీ చేశాడు. ఇక ఆ పిల్లను సంభాళించడం సాధ్యం కాకపోవడంతో కండక్టర్ సంచారిగా కనిపిస్తున్న అమ్మాయిని బస్టాండు దగ్గరలో గుడారాలు వేసుకున్న కొరచల కుటుంబానికి ఇచ్చాడు. కొరచలు ఆ అమ్మాయిని తమ కూతురులా జాగ్రత్తగా చూసుకున్నారు.

పగలంతా బిచ్చాటనకూ, వ్యాపారానికి వెళుతున్న కొరచల కుటుంబం పిల్లను విడిచి ఎక్కడ తిరగడానికి సాధ్యం కాదని, అక్కడే ఉండే సిందోళ్ళ ముసలిదానికి ఆ పిల్ల బాధ్యత అప్పగించారు. ఆ పిల్ల గుడారంలో ఉన్న ఉరుమ, దేవుడి బుట్ట చూసింది.

"అవ్వా, మా ఇంట్లోనూ దేవుడి బుట్ట, ఉరుమ ఉండాయి" అని ముసలిదానితో అంది.

ఆ మాటలు విన్న ముసలిది సాయంకాలం గుడారానికి వచ్చిన కొడుకు, కోడలితో ఆ పిల్ల చెప్పిన విషయం తెలిపింది. దీంతో పిల్ల తమ కులానికే చెందిందని ఆ కుటుంబానికి అర్థమైంది. అందువల్ల ఆ పిల్ల గురించి ఇరుకులాలవారూ మేము సాకుతామంటే, మేము సాకుతామని వాదించుకున్నారు.

చివరికి ఆ పిల్ల ఏ ఊరికి చెందిందో ఆ ఊరికి పంపాలని నిర్ణయించుకున్నారు.

"మీ అబ్బ పేరేమి?" అని అడిగారు.

పిల్లకు తండ్రి పేరు తెలియదు. తండ్రి లేడని చెప్పింది. తల్లి పేరు, ఊరు అన్నీ విషయాలూ చెప్పింది. తమవీధిలో ఉన్న మారెప్ప అనే అతను తనను ఆటో ఎక్కించుకుని వచ్చి ఆ బస్సులో కూర్చోబెట్టి బస్ బయలుదేరేంత వరకూ ఉండి వెళ్ళిపోయాడని చెప్పింది. ఈ మాటలు విన్న వాళ్ళు, అదే ఊళ్ళో పెండ్లి చేసుకున్న లక్షణకు ఫోన్ చేసి ఎవరో తమజాతి పిల్ల తప్పించుకుని వచ్చిందని, నీ ఊరు ఏదంటే రాయచూరు అంటోందని చెప్పారు.

వెంటనే లక్షణ వచ్చి "మామా, ఎవరో ఆడపిల్ల దారి తప్పి గుళేదగుడ్డకు వెళ్ళిందట. నా భార్య అన్నలు చెప్పారు. ఆ పిల్ల తమ ఊరు రాయచూరు అంటుంది" అని చెప్పాడు.

నేను వెంటనే రాయచూరులోని మా వాళ్ళకు విషయం చెప్పాను. వెంటనే అక్కడి వాళ్ళు తమ పిల్ల కనిపించటం లేదని, ఎక్కడుందని అడిగారు. నేను గుళేదగుడ్డలో ఉన్న విషయం చెప్పాను.

మరుసటి రోజు ఇటు నుంచి నేను, లక్షణ గుళేదగుడ్డకు వెళ్ళాం.

రాయచూరు నుంచి ఆ పిల్ల తల్లిని పిలుచుకుని మా కులస్థులు టాక్స్ వేసుకుని వచ్చారు.

అక్కడ రాయచూరు వాళ్ళు తమ పిల్లను గుర్తుపట్టి పిలిచారు.

అయితే తల్లి అనే ఆ స్త్రీ ముఖం మీద కూతురు దొరికిందనే సంతోషమే నాకు కనిపించలేదు.

దూరంగా కూర్చుని రారా అని చేత్తో సైగ చేస్తోంది.

అది చూడగానే గతంలో మా అమ్మ జంబయ్య అనే వ్యక్తితో వెళ్ళిపోయే ఉద్దేశ్యంతో నన్ను లారీ ఎక్కించి పంపటం గుర్తు వచ్చింది.

పిల్లల్ని దూరం చేసుకునేంత మమకారం ఈ శారీరక సుఖంలో ఏముందో నాకు ఇప్పటిదాకా అర్థం కాలేదు !

**చదువు లేకుండానే గురువైన కథ :**

అదేదో జానపద అకాడెమీ అనే సంస్థ మాలాంటి వాళ్ళ కళలు నేర్పడానికి పెట్టిన ప్రత్యేక పథకానికి దరఖాస్తు కోరుతున్నట్టు తెలిసింది. దానికి దరఖాస్తు ఎక్కడ దొరుకుతుందో? ఎలా దరఖాస్తు పెట్టుకోవాలో? నాకు తెలియదు. ఇలాంటి వాటికంతా మేము కుమార్‌సార్ మీదనే ఆధారపడతాం.. దరఖాస్తు తెప్పించమని ఆయన్ను కోరాను. మా స్నేహితుల్లో ఒకరు కడ్డిరాంపుర రాము అని ఉన్నాడు. అతను అకాడెమీ మెంబరు అయ్యాడు. ఒకసారి నేను, కుమార్‌సార్ ఇద్దరం అతని దగ్గరికి వెళ్ళాం. కుమార్‌సార్ అతడితో నేను దరఖాస్తు పెట్టాలని అనుకుంటున్నట్టు చెప్పారు. అతడు ఒక దరఖాస్తు ఫారం ఇచ్చాడు. కుమార్‌సార్ దరఖాస్తు నింపారు. దానికి కావలసిన కులసర్టిఫికెట్ మొదలైనవి జతపరిచాను. శికారి రాము దరఖాస్తు పోస్ట్ చేశాడు.

అటు తరువాత నా పేరిట 'గురుశిష్య పరంపర యోజన' కార్యక్రమం కేటాయించారని కడ్డిరాంపుర రాము చెప్పాడు. దానికి సంబంధించిన ఉత్తర్వులు రావాల్సి ఉందన్నాడు. అయితే చివరి వరకూ నాకు ఆ ఉత్తర్వులు అందలేదు. కె. రామును అడిగితే తన దగ్గరున్నాయి, ఊరుకో అని చెప్పేవారు. ఒక రోజు అతనే దానికి సంబంధించిన కార్యక్రమం పెట్టుకుందామన్నాడు. కార్యక్రమానికి మైత్రి సార్, జక్కా పార్థసారథిసార్, కె. రాము. శికారి రాము, మా ఊరి హేమయ్యస్వామి, మా చిన్నబ్బ జి. మాధవరావ్, సుడుగాడు సిద్ధుల సణ్ణహులుగప్ప, మా వార్డు మునిసిపాలిటీ సభ్యులు రాజాసాబ్ మొదలైనవారంతా వచ్చారు. కార్యక్రమం జరిగింది. జనం కార్యక్రమానికి బాగా వచ్చారు.

ఇది జరిగిన తరువాత మా కులానికి చెందిన పదిపదిహేను మంది కుర్రవాళ్ళకు సిందోళ్ళ నృత్యం నేర్పే గురువయ్యాను.

చదువుకోకపోయినా గురువయ్యాను.

ప్రణాళిక ప్రకారం మూడునెలలు ముగిసిపోయినా గురుశిష్య పరంపర ఆదేశ పత్రం మాత్రం నాకు ఇవ్వనే లేదు.

చివరికి అకాడెమీ సభ్యుడు కె. రాము నన్ను ఏమార్చాడని తెలిసింది.

ఓ సంచారిని మరో సంచారే ఇలా మోసం చేస్తే ఎలా చెప్పండి?

నేను చదువుకుని ఉంటే ఎంత బాగుండేదోనని ఇప్పుడిప్పుడు అనిపిస్తోంది !

**ఎస్.సి./ ఎస్.టి. కమీషన్ ముందు ఉపన్యాసం :**

2004లో ఎస్.సి./ ఎస్.టి. కమీషన్ అధ్యక్షులు, సిబ్బంది బళ్ళారికి వస్తారనే విషయం శికారి రాము నాకు చెప్పాడు. మా కోరికలను ఆయన ముందు మనవి చేసుకోవచ్చని చెప్పాడు. శికారి రాము హక్కిపిక్కి జనాలకు సంబంధించిన అభ్యర్థనల పత్రం తయారు చేసుకున్నాడు. అదే విధంగా మా డిమాండ్ల గురించి ఒక మనవి పత్రం తయారుచేసి ఇచ్చాడు. మాధవరావ్ సార్‌కూ ఒక మనవి పత్రం తయారుచేసి ఇచ్చాడు. మేమంతా కలిసి ఆ రోజు బళ్ళారికి వెళ్ళాం. బళ్ళారి డి.సి. ఆఫీసులో సభ ఏర్పాటు చేశారు. మా అందరి అభ్యర్థనా పత్రాలను కమీషన్ అధ్యక్షుల చేతికి ఇచ్చాం. మా అభ్యర్థనలను గురించి ఏమైనా ఆలోచన ఉంటే తెలపమని చెప్పారు.

శికారి రాము తమకు మూలభూతమైన సౌలభ్యాలు లేవన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం 1908లో తమ సముదాయానికి సుగ్గేనహళ్ళిలో 120 ఎకరాల భూమి ఇచ్చింది. దానికి సంబంధించిన దాఖలాలు ఉన్నాయి. తమలాంటి అమాయక జనాన్ని ఏమార్చి ఉన్నవాళ్ళు భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దానికి సంబంధించిన డి.సి., ఏ.సి. తహసీల్దారులకు అందరికి మనవి సమర్పించినా తమ సమస్యలు పరిష్కారం కాలేదు. దాన్ని మీరు గుర్తించి మాకు న్యాయం చేయండని విన్నవించుకున్నాడు.

శికారి రాము మాట్లాడిన తరువాత నన్ను మాట్లాడమన్నారు.

సభలో ఎన్నడూ మాట్లాడటం తెలియదు నాకు.

అందువల్ల నాకు భయం వేసింది. అయినా ధైర్యం తెచ్చుకుని మాట్లాడాను. ఆ రోజు మాట్లాడింది ఇది–

"అయ్యా, మమ్మల్ని సిందోళ్ళు అంటారు. సంచారజీవులం మేము. ఊరి బయట గుడారం వేసుకుని ఉంటాం. బిచ్చానికి పోయినపుడు ఆడవాళ్ళు ఇచ్చిన చీరలను గోచిపోసుకుని కట్టుకుంటాం. చేతులు కోసుకుని రక్తం కారుస్తూ, ఈర్‌గోల్‌తో మమ్మల్ని కొట్టుకుని బిచ్చం అడుగుతాం. మా వేషంలో వస్తే మీలాంటి వాళ్ళు ఎవరూ లోపలికి రానివ్వరని ప్యాంటు, షర్టు వేసుకుని వచ్చాను. నేను వేసుకున్న ప్యాంటు, షర్టు నేను కుట్టించుకున్నవి కావు. ఎవరో మీలాంటి పుణ్యాత్ములు ఇచ్చినవి. అయ్యా, మాకు ఒక నెలవు లేదు. మా పిల్లలు ఇప్పటికీ బడికి పోవటం లేదు. వాళ్ళూ వీళ్ళూ పెట్టిన అన్నం తింటున్నాం. మాకు మా సొంతం అయిన నేల కావాలి. మేము ఇంకెన్నాళ్ళు అడుక్కుంటూ దేశదిమ్మరుల్లా తిరగాలి? అయ్యా, మా అవస్థ మా పిల్లలకు రాకూడదు. దాని గురించి ఆలోచించండి. మాకు ఒక నెలవు ఇప్పించండి. ఇది నా ఒక్కడి కోరిక కాదు. మా మొత్తం జాతి కోరిక. మాలాంటి సంచారుల అందరి పరంగా సమర్పిస్తున్న మనవి. తప్పులుంటే మన్నించండి" అని చెప్పాను.

నా మనవి గురించి చర్యలు తీసుకోవటానికి అధికారులకు సూచిస్తానని కమీషన్ అధ్యక్షులు భరోసా ఇచ్చారు.

ఇది జరిగి మూడు నెలల తరువాత కమీషన్ నుంచి ఉత్తరం వచ్చింది.

అయితే ఏ భరోసా ఈడేరలేదు !

మా కష్టాలు మాత్రం అలాగే ఉన్నాయి !!సారూ!

(ముగింపు – వచ్చే సంచికలో)

చలసాని నరేంద్ర
9849569050

# దేశానికే హెచ్చరిక–కేరళ వరదలు

'దేవభూమి'గా భావించే కేరళలో నేడు వందేళ్లలో ఎరుగని ప్రకృతి వైపరీత్యం ఊహించలేని విధ్వంసాన్ని సృష్టించింది. సుమారు పది రోజుల పాటు భారీ వర్షాలు, వరదలతో ప్రకృతి అందాలకు మారుపేరుగా నిలచే కేరళ రాష్ట్రం ఘోర విపత్తుకు గురైంది. మొత్తం 14 జిల్లాలు కూడా ఈ ఉపద్రవంలో చిక్కుకున్నాయి. అన్ని నదులు, రిజర్వాయర్లు పొంగి ప్రవహించడంతో ప్రజాజీవనం అతలాకుతలమై పోయింది. 80 శాతం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. గ్రామాలకు గ్రామాలు వరదల ముంపుకు గురయ్యాయి. రవాణా వ్యవస్థ స్తంభించి పోయింది. సుమారు 350 మంది మృతి చెందగా, 12 లక్షల మంది సహాయ శిబిరాలలో తలదాచుకున్నారు.



వర్షాలు తగ్గి, వరద నీరు వెనుకకు తిరిగినా ఈ ఉపద్రవం నుండి కేరళ ప్రజలు కోలుకోవడానికి దీర్ఘకాలం పడుతుంది. అందుకు పెద్ద ఎత్తున సహాయ, పునరావాస కార్యకలాపాలను చేపట్టవలసి ఉంది. అది ఒక ఎత్తయితే ప్రకృతి ఇంతగా విలయతాండవం చేయడానికి మానవ తప్పిదాలు, నేరపూరిత నిర్లక్ష్యాలే కారణమని అందరూ భావిస్తున్నారు. పర్యావరణ శాస్త్రవేత్తల హెచ్చరికలను లెక్కచేయకుండా రిజర్వాయర్లలో నీటిని నింపడం, భారీ ఎత్తున గనుల త్రవ్వకం జరుగుతూ ఉండటం, హరిత ప్రదేశం హరించి పోతూ ఉండటం వంటి అంశాలు మరోసారి ప్రస్తావనకు వస్తున్నాయి.

దేశంలో ఇటువంటి జల ప్రళయాలు పలు చోట్ల తరచూ వస్తూనే ఉంటూ ఉండటం గమనార్హం. పర్యావరణ సంబంధ హెచ్చరికలను పట్టించుకొనక పోవడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకొనక పోవడం వల్ల ప్రమాదాల నష్టాలు పలురెట్లు పెరగుతున్నాయి. గతంలో ఉత్తరాఖండ్ లో, తర్వాత చెన్నయి మహానగరంలో, ఆ మధ్య ముంబాయిలో, జమ్మూ కాశ్మీర్ లో, ఉత్తర ప్రదేశ్ లో, తాజాగా కేరళలో భారీ వర్షాలు ఏ విధంగా జలప్రళయాలు సృష్టిస్తున్నాయో చూస్తున్నాము. పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటూ ఉండడంతో ఇటువంటి ప్రళయాలు మరిన్ని ఎదురు కాక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దేశంలో వచ్చే పదేండ్లలో వరదల కారణంగా 16వేల మందికి పైగా ప్రజలు మరణించవచ్చని, రూ.47వేల కోట్ల మేరకు ఆస్తి నష్టం వాటిల్లవచ్చని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ) అంచనా వేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఎన్డీఎంఏ దేశవ్యాప్తంగా 640 జిల్లాల్లో సర్వే నిర్వహించి ఈ అంచనాకు వచ్చినట్టు తెలుస్తున్నది. వరదల వల్ల భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉన్న రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్, అసోం, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. వరదల కారణంగా ఈ రాష్ట్రాల్లో ప్రభావం పడనున్న భూ విస్తీర్ణం వివరాలు కూడా వెల్లడించారు.

ఇప్పటికే కేరళతోపాటు దేశంలోని అనేక రాష్ట్రాలు వర్షాలు, వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎన్డీఎంఏ అంచనాలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. అనేక రాష్ట్రాలు విపత్తు వల్ల జరిగే నష్టాన్ని తగ్గించేందుకు సరైన చర్యలు తీసుకోవటం లేదని ఆ సర్వే అభిప్రాయపడింది. వాస్తవానికి హిమాచల్ ప్రదేశ్ మినహా ఇతర రాష్ట్రాలు విపత్తుల వల్ల కలిగే నష్టంపై అంచనాలను కూడా రూపొందించలేదని పేర్కొంది.

దేశంలో విపత్తుల గురించి ముందుగానే హెచ్చరించి, తద్వారా జరిగే నష్టాన్ని నివారించేందుకు మనకు అత్యంత అధునాతన ఉపగ్రహాలు, హెచ్చరిక వ్యవస్థలు ఉన్నప్పటికీ, అధికారులు వాటిని సరైన రీతిలో ఉపయోగించుకొంటున్నట్లుగా లేదు. ఉదాహరణకు కేరళలోనే సాధారణ వాతావరణ హెచ్చరికలకు పరిమితం కాకుండా, జల విద్యుత్ కోసం రిజర్వాయర్లలో పరిమితికి మించి నీటిని నిల్వవుంచకుండా, ఒకే సారి నీటిని వదిలే పరిస్థితి లేకుండా చేయగలిగితే ఇంతటి ఉపద్రవం వచ్చి ఉండెడిది కాదని ఇప్పుడు అందరూ చెబుతున్నారు. విపత్తు ముప్పు తగ్గింపు, విపత్తు అనంతర పునర్నిర్మాణ చర్యలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు

కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప నిర్దిష్టంగా ఎటువంటి విధానాలను అమలు చేయడం లేదని ఈ సర్వే స్పష్టం చేసింది.

కేరళలో 40 వరకు గల డ్యామ్ లను అర్ధంతరంగా మూసివేసిన కారణంగానే వరదలు ఉగ్రరూపం దాల్చాయని, అపారమైన నష్టాలు కలిగాయని ఇప్పుడు పలువురు భావిస్తున్నారు. ఒక మాదిరి ప్రణాళికతో, ముందస్తు హెచ్చరికలతో ప్రజలను అప్రమత్తం చేయగలిగినా ఇంతటి ప్రళయం జరిగి ఉండెడిది కాదని స్పష్టం చేస్తున్నారు. ప్రమాదానికి ప్రజలను సిద్ధం చేయడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిన్నట్లు అర్థం అవుతున్నది. ఈ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై న్యాయ విచారణ జరిపించాలని రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎటువంటి ప్రణాళిక లేకుండా డ్యామ్ లను తెరవడం వల్లనేనని ఇంతటి అరిష్టం జరిగినదని భారతీయ జనతా పార్టీ ఆరోపించింది.

శాస్త్రవేత్తలే కాకుండా సాధారణ ప్రజలు కూడా నీటిని క్రమంగా విడుదల చేయాలని కోరినా లెక్క చేయకుండా, జల విద్యుత్ సరఫరా చేసుకొంటూ పరిస్థితులు విషమించే వరకు కాలం గడిపారనే విమర్శలు తలెత్తుతున్నాయి. గతంలో పర్యావరణ హెచ్చరికలను ప్రభుత్వాలు పట్టించుకొనక పోవడం వల్లనే ఇంతటి భారీ మూల్యం చెల్లించవలసి వచ్చినట్లు చెబుతున్నారు. పశ్చిమ కనుమల్లో పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలను ధ్వంసం చేయడం వల్లనే కేరళకు ఈ విపత్తు దాపురించినట్టు స్పష్టం అవుతున్నది.

కేరళలో ఐదేండ్లకోసారి అధికారాన్ని పంచుకునే ఎల్డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాలు పర్యావరణ నిపుణులు చేసిన హెచ్చరికలను బుట్టదాఖలు చేయడం వల్లనే మలయాళీలు నేడు జలప్రళయాన్ని ఎదుర్కొంటున్నట్టు విదితమవుతున్నది.

వరదల కారణంగా దెబ్బతిన్న కేరళలోని ఆయా ప్రాంతాలను భౌగోళికంగా విశ్లేషిస్తే, అవన్నీ పర్యావరణ పరంగా సున్నితమైనవని వెస్టర్న్ ఘాట్స్ ఎక్స్‌పర్ట్ ఎకాలజీ పానెల్ రిపోర్ట్ (డబ్ల్యూజీఈఈపీ) ఇంతకుముందే హెచ్చరించింది. అయితే, దీనిని ఆ రాష్ట్ర సర్కార్ పట్టించుకోలేదు.

పైగా, ఈ నివేదిక ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని పేర్కొంటూ ఇంతకుముందున్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రభుత్వం అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. వరదలతో గత పది రోజుల్లో వయనాడ్, ఇడుక్కి ప్రాంతాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటితోపాటు మున్నార్, తామరస్సేరి, వైతిరి, తిరువంబాడి కూడా సున్నితమైన ప్రాంతాలలోనే ఉన్నట్టు డబ్ల్యూజీఈఈపీ గతంలోనే హెచ్చరించింది. ప్రస్తుతం ఈ ప్రాంతాలన్నీ నీట మునిగి ఉన్నాయి.

కేరళలోని 15 తాలూకాలు అత్యంత ముప్పు ఎదురయ్యే మొదటిజోన్ పరిధిలో ఉన్నాయని, రెండు తాలూకాలు రెండో జోన్‌లో, మరో ఎనిమిది మూడో జోన్‌లో ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. అయినప్పటికీ మొదటి జోన్ పరిధిలో ఉన్న ఇడుక్కి జిల్లాలో భారీగా అక్రమ నిర్మాణాలకు పాలకులు అనుమతులిచ్చారు. ప్రస్తుతం ఇడుక్కితోపాటు మున్నార్, వయనాడ్‌లపై కూడా ప్రకృతి తన ప్రతాపాన్ని చూపింది. పశ్చిమ కనుమలకు సమీపంలో ఉన్న ఒకటవ జోన్‌లో కీలకమైన అటవీ ప్రాంతాలున్నాయి.

అక్కడి భూములను అటవీయేతర పనులకు లేదా వ్యవసాయానికి ఉపయోగించరాదని నిషేధం విధించారు. అయినప్పటికీ పెరుగుతున్న జనాభా కోసం అక్కడ నివాస గృహాలను నిర్మించారు. ఆ గృహాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా కల్పించారు. రెండో జోన్‌లో భారీగా హోటళ్లు, రిసార్ట్‌లు పుట్టుకొచ్చాయి. మూడో జోన్‌లో భూములను వ్యవసాయేతర పనులకు ఉపయోగించారు. దీనికితోడు నివాస ప్రాంతాలకు 50 మీటర్ల పరిధిలోనే క్వారీ తవ్వకాలకు అనుమతులిచ్చారు.

అడవులకు నివాస ప్రాంతాలకు మధ్యనున్న ప్రాంతాలను పరిరక్షించ లేకపోతే ఆ ప్రాంతం పేకమేడలా కూలిపోతుందని, కొండచరియలు విరిగిపడటం లేదా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశమున్నదని, వీటి వల్ల జీవనోపాధిని కోల్పోవడమే కాదు ప్రాణాలు కూడా పోతాయని అంటూ డబ్ల్యూజీఈఈపీ నివేదిక రూపొందించిన బృందం నాయకుడు ఆచార్య మాధవ్ గాడ్గిల్ అప్పుడే స్పష్టం చేసారు.

ప్రకృతిని ధ్వంసం చేయడం వల్లనే పశ్చిమ కనుమలు, తూర్పు హిమాలయ ప్రాంతాలలో కొండచరియలు విరిగి పడుతున్నాయని, ఇడుక్కి ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు. పెద్ద పెద్ద చెట్లను పెంచడం ద్వారా భూమి కోతను నివారించవచ్చని, తద్వారా కొండలు కూలిపోవడం తగ్గుతుందని సూచించారు.

**తాజాగా ముల్లపెరియార్ డ్యామ్ విషయమై కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు పరస్పరం ఆరోపణలు చేసుకొంటున్నాయి. అకస్మాత్తుగా నీటిని విడుదల చేయడమే ఈ ముప్పుకు కారణం అని కేరళ ముఖ్యమంత్రి పునరాయి విజయన్ స్పష్టం చేస్తున్నారు. ఒక దశలో అయితే ఈ డ్యామ్ ఎక్కడ పగిలి పోతుందో అనే ఆందోళనలు కూడా వ్యక్తం అయ్యాయి. పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నా తమిళనాడు ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతూ కాలం గడపడాన్ని చూసాము.**

**ఈ డ్యామ్ గనుక పగిలి పోతే జపాన్ లో హిరోషిమాలో అణుబాంబు వల్ల కలిగిన ఉపద్రవం కన్నా వంద రెట్లు ఎక్కువ ఉపద్రవం జరుగుతుందని గతంలో ప్రముఖ పర్యావరణ వేత్త మాధవ్ గాడ్గిల్ హెచ్చరించారు. అయినా అటువంటి సున్నిత అంశాల విషయంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడం దురదృష్టకరం. ఇటువంటి ప్రమాదకర సమయాలలో కేంద్ర ప్రభుత్వం సహితం ప్రేక్షక పాత్ర వహించకుండా క్రియాశీలకంగా వ్యవహరించ వలసి ఉంది.**

**దేశంలో ప్రతి ఏటా ఎక్కడో ఒక చోట జరుగుతున్న ఇటువంటి ఉపద్రవాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ అంశాల పట్ల ప్రదర్శిస్తున్న నేరమయ నిర్లక్ష్యమే కారణమని గుర్తించాలి. రాజకీయ ప్రయోజనాలను ప్రక్కన పెట్టి జాతి హితాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోగలగాలి.**

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లిభాష



Unfiled Notes Page 48

పొరుగు తెలుగు

# మహారాష్ట్ర తెలుగు కవుల అక్షరతోరణం




గత ఉగాది నాడు సంగెవేని రవీంద్ర సంపాదకత్వంతో వెలువడ్డ 'మహారాష్ట్ర తెలుగు కవుల శతాధిక సంచిక' మహారాష్ట్రలోని పలు నగరాల్లోని తెలుగు సాహితీ వేత్తల్లో ఒక నూతనోత్సాహాన్ని నింపింది. ఆ శతాధిక కవులతో నిత్యం కవితాభినివేశాల్ని పంచుకునేందుకు 'మహారాష్ట్ర తెలుగు కవులు' పేరుతో సంగెవేని రవీంద్ర ఒక వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఈ గ్రూప్‌లో ప్రముఖ లఘు చలన చిత్ర దర్శకుడు, ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్ వజ్రనాభ నటరాజ మహర్షి కూడా ఉన్నారు. రెండు నెలల క్రితం అక్షర తోరణం పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలనే ప్రస్తావన ఆయన తీసుకు వచ్చారు. అందుకు కావాల్సిన సెట్ డిజైనింగ్ ఆయనే చేస్తాననీ మాటిచ్చారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారమే నవీ ముంబయిలోని తెలుగు కళా సమితి సభా ప్రాంగణం అక్షరతోరణం కార్యక్రమం కోసం కనులు మిరుమిట్లు గొలిపే విధంగా రూపొందించారు.

26 ఆగస్టు 2018...రాఖీ పూర్ణిమ :

సభాధ్యక్షులు లేరు. ముఖ్య అతిథుల్లేరు. గౌరవ అతిథుల్లేరు. పొగడ్తల 'ఇచ్చిపుచ్చుకోవడాలు' లేవు. దండలు వేసి దండాలు పెట్టడం అసలే లేదు. అక్కడున్నదంతా తెలుగు కవిత్వమే...సకుటుంబ సపరివారంగా విచ్చేసిన తెలుగు కవుల ఆత్మీయ కలయికలే. సభా ప్రాంగణమంతా తెలుగు తనం వెల్లివిరిసే చిత్ర పటాలు...ఆ చిత్ర పటాల మీద ఆణిముత్యాల్లాంటి తెలుగు సూక్తులు...వేదిక మీద యజ్ఞగుండం రూపు ఆ యజ్ఞగుండంలో ఆత్మ గౌరవంతో తలెత్తి నిలబడ్డ పాళీ...పక్కనే శంఖం...తెలుగు ఘోషను ప్రతిధ్వనించే ఢమరుకాలు...తబలా వాయిద్యాలు...

ముంబయి, భీవండి, అంబర్‌నాథ్, పన్వేల్, నవీ ముంబయి, పుణే, షోలాపూర్, కర్జత్‌లాంటి పలు నగరాలకు చెందిన తెలుగు కవులంతా నవీ ముంబయిలోని తెలుగు కళా సమితికి చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు అక్షర తోరణం సిద్ధంగా ఉంది. ఆత్మీయ వాతావరణంలో తెలుగుదనం వెల్లి విరియగా తెలుగు సాహితీ వేత్తలంతా ఆసీనులయ్యారు. సభా ప్రాంగణం గోడల నిండుగా నటరాజ మహర్షి రూపొందించిన, అచ్చెరువు కలిగించే బ్యానర్లు ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. హాలులో ప్రవేశించిన ప్రతి ఒక్కరిని గులాబీ పూలతో స్వాగతం పలికారు.

ముందుగా, అక్షర తోరణం ఆవిర్భావ నేపథ్యం గురించి, వర్ధమాన కవులు పాటించాల్సిన కవి నియమాల గురించి, మహారాష్ట్రలో తెలుగు కవిత్వ ప్రస్థానం, చరిత్ర గురించి సంగెవేని రవీంద్ర సోదాహరణంగా ప్రసంగించారు. తెలుగు భాషాభివృద్ధి గురించి, వికాసం గురించి రవీణా చవాన్ ఉపన్యసించారు. గత వంద సంవత్సరాల మహారాష్ట్ర తెలుగు సాహిత్యం, కవిత్వ ప్రయోజనం, సామాజిక సందర్భాల గురించి ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త డా॥ తాటి నరహరి కీలక ఉపన్యాసం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగు కవులతోపాటు తెలుగు ప్రముఖులు, భాషాభిమానులు ఎందరో పాల్గొన్నప్పటికీ, సభాధ్యక్షులు, అతిథులు, వారికి స్వాగత సన్మానాలు లాంటివేవీ నిర్వహించకపోవడం విశేషం. కేవలం కవులను కేంద్రంగా చేసుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాఖీ పండుగ సందర్భంగా 'రాఖీ బంధనం' వేడుకల్ని కూడా వేదికపై నిర్వహించారు. పలువురు కవయిత్రులు తాము అభిమానించే వారికి ఆత్మీయంగా రాఖీ కట్టి సాంప్రదాయ బద్ధంగా పర్వదినాన్ని జరుపుకున్నారు. ఈ రాఖీ బంధన కార్యక్రమానికి యువకవి గాలి మురళీధర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

భోజనానంతరం కవి సమ్మేళనానికి శ్రీకారం చుట్టారు. మహారాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 మంది కవులు ఈ సమ్మేళనానికి విచ్చేసి తమ కవితల్ని పరిశీలన కమిటీకి అందించారు. సుమారు 50 మంది కవులు సమ్మేళనంలో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. కవులు రావడం, చదవడం, సన్మానం పొందడం, వెళ్లిపోవడంలాంటి ఊకదంపుడు వ్యవహారంగా కాకుండా, హాలంతా నిశ్శబ్దంగా కవితల్ని వినే విధంగా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. కవి తన కవితను చదివిన తరువాత కవితా సంక్షిప్త విశ్లేషకులుగా రవీణా చవాన్, సీతా సుధాకర్, అత్తిలి అనంతరాం, మంచాల శివ, నటరాజ మహర్షి తదితరులు వ్యవహరించారు. కవితా విశ్లేషణ పేరుతో పడికట్టు పదాల గారడీ చేయకుండా కవులకు మార్గదర్శనం చేశారు. కవుల్ని ప్రోత్సహించారు. కవితలోని లోపాల్ని సున్నితంగా ఎత్తి చూపారు. మున్ముందు ఉన్నతమైన కవితలు రాసేందుకు స్ఫూర్తి కలిగించారు.

ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగడం విశేషంగా చెప్పుకోవాలి. **కవి సమ్మేళనం ముగిసేంత వరకు ఏ ఒక్క కవి కూడా వెళ్ళిపోకుండా వుండటం అభినందనీయం.** మహారాష్ట్ర తెలుగు సాహితీ చరిత్రలో మరో మైలు రాయిలా ఈ కార్యక్రమం నిలిచి ఉంటుంది.

– సంగెవేని రవీంద్ర



Unfiled Notes Page 49

పాట

## తేట తెలుగులు

'నుడి–నానుడి' పుస్తకం చదివి స్పందించి రాసిన కవిత. దీనిని పుస్తక ఆవిష్కరణసభలో విమలక్క తన బృందంతో కలిసి తొలిసారిగా పాడి సభికుల మెప్పు పొందారు

– మిత్ర

సెలిమె నీల్లయి నుడి నానుడి
తేట తెలుగై పారుతుంటె
తలాపున నదీ నదులై
అక్షరాలను తడుపుతుంటె
ఎందుకురా ఆ ఉప్పునీల్ల
కడలి వెంట ఉరుకుడు
ఎందుకురా అవ్వ అయ్యనే
ప్రేమ పలుకులు మర్సుడు
**సెప్పవా బంగారయా తేనెలొలికె మాటలు**
**సెప్పవా బంగారయా తల్లి పాల తీపులు**

ఎన్ని సెమటలు దారబోసి
తల్లిభాషను అల్లుకుంటిమి
ఎన్ని అంచలు దాటుకోని
భావముతో పోల్చుకుంటిమి
ఎందుకుర పడికట్టు పదముల
ఎండమావులెంట ఉరుకుడు
ఎందుకుర అక్కరలేని
సముస్కృతముకు జారిపోవుడు
**సెప్పవా బంగారయా...తేనెలొలికె భాషలు**
**సెప్పవా బంగారయా మనసు మెచ్చే ఇరుపులు**

పోత నుడులు పోత నుడులు
పాత పెట్టెలా మూసిపెట్టి
తప్పులు తడకలు పేర్చి
కుప్పలా పొత్తములు రెచ్చి
ఎందుకురా అరువుదెచ్చిన
భాషగొప్పని మొత్తుకుంటరు
ఎందుకురా తెలిసి తెలియని
భావమెట్లా ఒప్పనంటరు
**చెప్పవా బంగారయా**
**పలుకు బడులే మేలనీ**
**చెప్పవా బంగారయా**
**అవిబడిపలుకులు కావాలని**

పుస్తక సమీక్ష

## బుఝ్ఝా సూరమాంబ రచనలు



స్త్రీ విద్యలో బాగా వెనుకబడిన అప్పటి భారతదేశంలో, పురుషులతో సమానంగా గ్రంథ రచన చేసిన కవయిత్రులలో శ్రీమతి బుఝ్ఝా సూరమాంబ (1889–1980) ఒకరు. విద్వత్కుటుంబంలో జన్మించిన ఈ రచయిత్రి తండ్రివద్ద 'ఇంటి చదువు'తోనే భగవంతుని యందు భక్తి తత్పరతను ఆధ్యాత్మిక చింతనను అలవరచుకుని తన హృదయంలో నుండి వచ్చిన భావాలకు అక్షర రూపం యిచ్చి, తన జీవితకాలంలో ఎనిమిది రచనలు చేసారు. వచనం, నాటకం, కావ్యం, కీర్తనల రూపంలో రచనలు సాగాయి. ఆమె రచించిన భారతీస్తవస్తబకము, హరినాథనందనార శతకము, శ్రీకృష్ణబోధామృతము, సావిత్రీ విజయము – అనే గ్రంథాలు ఇంతవరకు లభ్యం కాలేదు. ఇప్పుడు ఆమె కుటుంబ సభ్యులు, లభ్యమైన నాలుగు రచనలను ఈ సంకలనంగా తిరిగి ప్రచురించి పాఠకలోకానికి అందించారు. మొదటిది : – 1905 వ సం॥లో కేవలం పదహారేండ్ల వయసులోనే 'భగవద్భజనకీర్తనలు' వ్రాయగా ఇవి 1954లో మొదటగా ప్రచురింపబడ్డాయి. ఇందులో 49 కీర్తనలు, 3 లాలిపాటలు, 5 మేలు కొలుపులు ('జీవా...తెలివి కలిగి యుండు" – అనే పల్లవితో), 33 ద్విపదలు, 81 ద్విపదలలో 'ఆత్మబోధ', పూజా విధానాలు, కొన్ని యితర స్తోత్రాలు ఉన్నాయి. రెండవది – 'మధుగీత' అను 'విజయగోపాల సంవాదము' వచనం. భారతంలో కౌరవ పాండవ యుద్ధంలో విజయం పొందిన అర్జునుడికి యుద్ధానంతరం శ్రీకృష్ణ పరమాత్మ చేసిన ఆధ్యాత్మిక ప్రబోధాన్ని 'ఉత్తర గీత' అంటారు. దీనిని అనుసరించి తెలుగులో వ్రాసిన తీయని పలుకులు 'ఇవి. భగవన్నామ సంకీర్తన, ధ్యానాదుల వలన చిత్తశుద్ధి, ఏకాగ్రత, నిశ్చలత్వం కలిగి, తద్వారా ఆత్మశక్తి – ఆ మార్గం ద్వారా ముక్తి పొందుతారు అనేది ఇందులో తాత్పర్యం మూడవది – 1929 సం॥లో ఆమె వ్రాసిన మూడవ రచన 'శ్రీ ప్రహ్లాద నాటకము'. 'నాకు గల అల్ప జ్ఞానముతో, భక్తుల యందగ్రగణ్యుడు, సకల జనాదర్శప్రాయుడు' అయిన ప్రహ్లాదుని చరిత్రను నాలుగు అంకాల నాటకంగా పద్యగద్యాత్మకంగా హృద్యంగా చిత్రీకరించారు. ఇక నాల్గవది – 'భక్తవత్సల శతకము'. 108 పద్యాలతో 'భక్త వత్సలా' అనే మకుటంతో జగద్రక్షుడైన శ్రీమన్నారాయణుని కీర్తిస్తూ చేసిన ఈ శతకం 1971లో మొదటిసారిగా ప్రచురితమైంది.

పెద్దగా చదువుకోకపోయినా, అంత రంగంలోగల స్వచ్ఛమైన శక్తితో ఆమె కవిత్వం – రచనా ప్రస్థానం సాగింది. అది పండి తుల కోసమో, విద్యాధికుల కోసమో కాదనీ, ఈ దేశంలోని బాల బాలికల కోమల హృదయాలలో భక్తి విజ్ఞానాలను నాటితే, వారి జీవితాలు శాంతి నిలయాలుగ తయారవుతా యని ఆమె గాఢంగా నమ్మారు. ఆమె కవితాశైలి – 'తేనె సోకగా, నోరు తీయన అయినట్లుగా' ఉంటుందని కొందరు విమర్శకులు అభిప్రాయపడటం సమంజసమే. శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ తన 'ఆంధ్ర కవయిత్రులు' లో సూరమాంబ కవిత్వం గురించి చెపుతూ అది పూర్వ కవులను తలపించేటట్లుగా ఉంటుందని పేర్కొనటం మంచి యోగ్యతా పత్రమే. ఈ దేశానికి స్వాతంత్ర్యం రాకమునుపే, 20శ. ప్రారంభం లోనే స్త్రీ విద్య తక్కువ స్థాయిలో ఉన్నపుడు, చదివింది తక్కువే. అయినా, బాల బాలికలలో ఆధ్యాత్మిక భావన పెంపొంది, వారి జీవితాలలో భక్తి జ్ఞానాలు పెంపొందాలనే సంకల్పంతో తన కవిత్వాన్ని, రచనలను లలిత సుందరంగాను, సహజోక్తి సుందరంగాను వెలువరించిన శ్రీమతి బుఝ్ఝా సూరమాంబ అభినందనీయులు. వెల : రూ. 299/–లు, ప్రతులకు : జ్యోతి బుక్ డిపో, దాబా గార్డెన్స్, విశాఖపట్టణం – 530020, ఫోన్ : 0891–6642020

ఎమ్.వి.శాస్త్రి 9441342999

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362



Unfiled Notes Page 50


# మరాఠీ గేయకావ్యం 'సాకేత రామాయణం' తెలుగులో–గజానన్ తామన్ అనుసృజన విడుదలైంది





సుప్రసిద్ధ మరాఠీకవి, రచయిత శ్రీ గజానన్ దిగంబర్ మాడ్యూల్కర్ మరాఠీలో రచించిన 'గీత్ రామాయణ్'ను మరాఠీ తెలిసిన తెలుగు ప్రముఖుడు శ్రీ గజానన్ తామన్ తెలుగులో 'సాకేత రామాయణం'గా రచించి 2009లో తొలుత ప్రచురించారు. ప్రముఖ వ్యాపారవేత్త శ్రీపెద్దిరాజు పురుషోత్తం ఈగ్రంథాన్ని హైదరాబాదులోని హోటల్ మెర్క్యూర్‌లో ఎంతో వైభవంగా సభ జరిపి, విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ ఈటెల రాజేందర్ చేతులతో విడుదల చేశారు. ఈ సభకుముఖ్యమంత్రి సలహాదారు శ్రీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. మంథని శాసనసభ్యులు శ్రీపుట్టమధుకర్, 'అమ్మనుడి' సంపాదకులు డా॥సామల రమేష్‌బాబు, ఆచార్య అనుమాండ్ల భూమయ్య, శ్రీ కోయిలరాం ప్రకాశరావు, తెలంగాణ బిసికార్పొరేషన్ అధ్యక్షులు బి.ఎస్.రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్ మున్నగువారు పాల్గొని ప్రసంగించారు. అనంతరం రచయిత గజానన్ తామన్ దంపతులను పెద్దిరాజు పురుషోత్తం దంపతులు ఘనంగా సత్కరించారు.

# కీ.శే.బి.స.బంగారయ్య రచన 'నుడి–నానుడి' విడుదలైంది



ఎనిమిదేళ్ల కిందట నడుస్తున్నచరిత్ర పత్రికలో వరుసగా ప్రచురణై సంచలనం కలిగించిన 'నుడి–నానుడి' ఇప్పుడు పుస్తకంగా విడుదలైంది. తెలుగు భాషా సాహిత్యాలపై కొత్త చూపుగా, ప్రజల తెలుగుకు సిద్ధాంత గ్రంథంగా, తరతరాల తెలుగు భాష ఆవేదన వర్ణింపబడిన 'నుడి – నానుడి'ని జులై 29 ఆదివారం సాయంత్రం గం. 6 లకు హైదరాబాదులో ఇందిరాపార్కు సిగ్నల్ దగ్గర గల హైదరాబాద్ స్టడీ సర్కిల్ భవనంలోని సభా మందిరంలో విడుదల చేశారు. సభకు డా॥ ఎకె. ప్రభాకర్ అధ్యక్షత వహించగా శ్రీయుతులు సి.ఆంజనేయ రెడ్డి, డా॥ సామల రమేష్‌బాబు, ఆచార్య ఎండ్లూరి సుధాకర్, పొట్లపల్లి వరప్రసాదరావు, డా॥ శ్రీనివాస తేజ, సన్నిధానం నరసింహశర్మ, డేనియల్ నెగర్స్, విమలక్క సంపాదకులు ఆచార్య జయధీర్ తిరుమలరావు పాల్గొన్నారు. సాహితీ సర్కిల్ ప్రచురించిన ఈ పుస్తకం వెల రు. 200/–లు 'అమ్మనుడి' కార్యాలయానికి ఎం.ఒ. చేస్తే కొరియర్‌లో పుస్తకాన్ని పంపిస్తారు. హైదరాబాద్‌లో 'ఆర్ట్స్ అండ్ లెటర్స్ (హైదరాబాదు స్టడీ సర్కిల్ భవనం)లో అమ్ముతారు. ఈ పుస్తకాన్ని చదివిన కవి 'మిత్ర' స్పందించి రాసిన పాటను ఉద్యమకారిణి విమలక్క బృందం సభలో పాడి సభికులను ఆలోచింపజేశారు. ఆ పాటను లోపలి పుటల్లో చూడండి...(వివరాలు లోపలి పుటలలో...)

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
September 2018 Vol :4, Issue 7 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/13/2018-20




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244